డా॥ దేవులపల్లి రామానుజరావు గారి

అభినందన సంచిక

అభినందన సమితి
ఆంధ్ర సారస్వతపరిషత్తు భవనములు
హైదరాబాదు.

డా॥ దేవులపల్లి రామానుజరావు గారి
అభినందన సంచిక

ప్రచురణ :

డా॥ దేవులపల్లి రామానుజరావు గారి
అభినందన సమితి
ఆంధ్ర సారస్వత పరిషత్తుభవనములు
తిలక్ రోడ్డు, హైదరాబాదు.

ప్రచురణ : 1992

ప్రతులు : 1000

వెల : 20-00

ముద్రణ :
పద్మావతీ ఆర్ట్ ప్రింటర్స్
1-1 517/B/1, న్యూ బాకారం
గాంధీనగర్, హైదరాబాదు.
ఫోన్ : 611413

ముందుమాట

డా॥ దేవులపల్లి రామానుజరావుగారి పేరు విననివారు తెలుగు సాహిత్యలోకంలో ఉండరనే చెప్పవచ్చు.

గత యాభై సంవత్సరాలుగా తెలుగు భాషా సాహిత్యాలకు, తద్ద్వారా తెలుగు సంస్కృతికి వీరు చేస్తున్న సేవ నిరుపమానమైనది.

తెలంగాణంలో ఎన్నో ఉద్యమాలు నడిపి తెలుగు భాషా దీపాన్ని ఆరిపోకుండా రక్షిస్తూ దీప్తిమంతం చేసిన భాషాభిమానులు వీరు.

భాషాభిమానులే కాదు చక్కని రచయితలు కూడా. వీరు రచించిన పచ్చతోరణం, నా సాహిత్యోపన్యాసాలు, తెలుగు సీమలో సాంస్కృతిక పునరుజ్జీవనం, తెలుగు సాహితి, యాభై యేళ్ళ జ్ఞాపకాలు మొదలైన గ్రంథాలు వీరి రచనాశక్తికి నిదర్శనాలు. స్పష్టంగా, సంగ్రహంగా, సులభంగా, సమగ్రంగా, సరసంగా చెప్పడం వీరి రచనల్లోని విశిష్టత.

శ్రీ మాడపాటి హనుమంతరావుగారు, శ్రీ సురవరం ప్రతాపరెడ్డిగారు మొదలైన తెలుగు వైతాళికుల సాహచర్యంతో భాషాభిమానాన్ని, నిష్కళంక జీవన విధానాన్ని, క్రమశిక్షణను పుష్కలంగా తీర్చిదిద్దుకొని ఎందరికో ఆదర్శంగా నిలిచిన విశిష్ట వ్యక్తిత్వం వీరిది.

సాహిత్య సంస్థలను నిర్వహించడంలో వారికి వారే సాటి. వారిది అమృతహస్తం. వారి సహాయ సహకారాలు పొందని సాహిత్య సంస్థ లేదనే చెప్పవచ్చు. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడెమీకి దాదాపు 25 సంవత్సరాలు కార్యదర్శిగాను, ఉపాధ్యక్షులుగాను, అధ్యక్షులుగాను ఉండి ఎన్నో అమూల్యమైన గ్రంథాలను ప్రకటించి దేశంలోనే ఒక విశిష్టమైన సంస్థగా తీర్చిదిద్దినారు.

ఆంధ్ర సారస్వత పరిషత్తుకు కార్యదర్శిగా, ఉపాధ్యక్షులుగా, ప్రస్తుతం అధ్యక్షులుగా ఉంటూ తెలుగు భాషకు, తెలుగు సాహిత్యానికి గణనీయమైన సేవచేసినారు. ఎన్నో ఉద్యమాలు నిర్వహించి, ప్రభుత్వంతో పోరాడి తెలుగు భాషకు సముచితమైన స్థానాన్ని సంపాదించినారు. మెట్రిక్యులేషన్ వరకు తెలుగు మాధ్యమంలో బోధనకు అవకాశం, డిగ్రీ స్థాయిలో తెలుగుకు రెండో భాషగా స్థానం వీరు పరిషత్తు పక్షాన చేసిన కృషికి ఫలితాలు. ఈనాడు ఆంధ్ర సారస్వత పరిషత్తు యావదాంధ్రదేశంలో స్వయంసమృద్ధమైన సాహిత్య సంస్థగా రూపుదిద్దుకోవడానికి డా॥ దేవులపల్లి రామానుజరావుగారి నిరంతర నిస్స్వార్థ సేవ, కృషి కారణమని చెప్పవలసి ఉంటుంది.

ఇవికాక తెలుగు అకాడెమీ, అంతర్జాతీయ తెలుగు సంస్థ, కేంద్ర సాహిత్య అకాడెమీ, జిల్లా గ్రంథాలయ సంస్థ మొదలైన ఎన్నో సంస్థలకు వివిధ హోదాలలో డా॥ రామానుజరావుగారు అందించిన సేవలు విశిష్టమైనవి.

యువభారతి, సురభారతి వంటి సంస్థలు వారి మార్గదర్శనంలో, వారి చేయూతతో ఎంతో అభివృద్ధిని సాధించినాయి.

శ్రీ రామానుజరావుగారు గోలకొండ పత్రికా నిర్వాహకులుగా, సుజాత (సాహిత్య మాసపత్రిక) సంపాదకులుగా పత్రికారంగానికి కూడా ఎంతో సేవ చేసినారు.

ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ వీరిని రాజ్యసభ సభ్యులుగా ఎన్ను కొని గౌరవించింది. డా॥ రామానుజరావుగారు సాహిత్య రంగానికి, భాషా రంగానికే కాక విద్యా రంగానికి కూడా సేవ చేసినారు. సాంకేతిక విశ్వవిద్యాలయాలు తప్ప హైదరాబాదులోని అన్ని విశ్వవిద్యాలయాల్లో వారు సిండికేట్ సభ్యులుగా ఉన్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం సిండికేట్‌లో దాదాపు 16 సంవత్సరాలకు పైగా సభ్యులుగా ఉండి కొంతకాలం తాత్కాలిక ఉపాధ్యక్షులుగా కూడా పదవీ బాధ్యతలు నిర్వహించినారు.

శ్రీ రామానుజరావుగారు పండిత పక్షపాతులు. వ్యక్తిలోని ప్రతిభను గమనించి తదనుగుణంగా ప్రోత్సహించడం వీరికో సరదా. వారి సహాయ సహకారాలు పొందనివారు తెలుగు సాహిత్యలోకంలో చాలా అరుదనే చెప్పవలసి ఉంటుంది.

విద్యారంగంలో వీరు చేసిన కృషిని గుర్తిస్తూ ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విశ్వవిద్యాలయం వీరికి గౌరవ డాక్టరేట్ ఇచ్చి సత్కరించింది. ఇది తెలుగువారి కెంతో ఆనందదాయకమైన విషయం.

తెలుగు భాషా సంస్కృతుల ఉద్ధారకుడుగా, కవిగా, రచయితగా, విమర్శకుడుగా, పత్రికా సంపాదకుడుగా, సాహిత్య సంస్థా నిర్వాహకుడుగా, విద్యావేత్తగా, పరిపాలకుడుగా, నిష్కళంక జీవనుడుగా, నిరాడంబరుడుగా పేరు పొందిన డా॥ దేవులపల్లి రామానుజరావుగారు గత యాభై సంవత్సరాలుగా వివిధ రంగాలలో చేసిన, చేస్తున్న కృషిని వివరించే వ్యాసాలతో ఒక సంచికను ప్రకటించి వారిని సముచితంగా సమ్మానించవలెనని సంకల్పింపబడింది. ఇందుకుగాను ఆచార్య సి. నారాయణరెడ్డిగారి అధ్యక్షతన ఒక అభినందన సంఘం ఏర్పడి

కార్యక్రమాన్ని చేపట్టింది. డా॥ రామానుజరావుగారి మిత్రులు, హితైషులు, అభిమానుల సహకారంతో ఈ సంచికను ప్రకటిస్తున్నాము.

మా అభ్యర్థనమేరకు ఈ సంచికకు విలువైన వ్యాసాలు రాసి మాకు సహకరించిన సహృదయులకు

ఈ సంచికను ఈ రూపంలో తేవడానికి మాకు ఎంతో సహకరించిన సహృదయులు శ్రీ పాండురంగయ్యగారికి, శ్రీ హరికిషన్‌రావు గారికి

సంచిక ముద్రణకు ఆర్థికంగా తోడ్పడిన ఉదార హృదయులకు

సంచికను అందంగా ముద్రించి సహకరించిన పద్మావతీ ఆర్ట్ ప్రింటర్స్ అధినేత శ్రీ శ్రీనివాస్‌గారికి

మా హృదయపూర్వక కృతజ్ఞతలు.

డా॥ దేవులపల్లి రామానుజరావుగారి
అభినందన సమితి

30-3-1992

డా॥ దేవులపల్లి రామానుజరావు గారి అభినందన సమితి

అధ్యక్షులు :

డా॥ సి. నారాయణరెడ్డి

ఉపాధ్యక్షులు :

శ్రీ ఆబిదలీఖాన్

శ్రీ రాజబహద్దూర్ గౌడ్

కార్యదర్శులు :

డా॥ ఆర్. శ్రీహరి

డా॥ ఎల్లూరి శివారెడ్డి

సభ్యులు :

శ్రీ గడియారం రామకృష్ణశర్మ

డా॥ సరోజినీ రేగాని

డా॥ జి. వి. సుబ్రహ్మణ్యం

డా॥ పేర్వారం జగన్నాథం

డా॥ కె. కె. రంగనాథాచార్యులు

శ్రీ కోకా రాఘవరావు

శ్రీమతి ఇల్లిందల సరస్వతీదేవి

డా॥ యస్. వి. రామారావు

శ్రీ వి. వి. రాఘవరావు

శ్రీ ఎమ్. కె. రాము

శ్రీ పులిజాల వెంకట రంగారావు

శ్రీమతి సీతాశరచ్చంద్ర

ఈ సంచిక ప్రచురణకు తమ సహాయసహకారాలను అందించిన సహృదయులు, సంస్థలు

శ్రీ బి.ఎన్. శాస్త్రి
శ్రీ సి.వి. శేషాచార్యులు
సౌజన్య చిట్ ఫండ్, చైతన్యపురి, హైదరాబాదు
శ్రీ కోటేశ్వరరావు, జనతా కలర్ లాబ్
శ్రీ కే. మురహరిరావు, ప్రవర్ధన్ సీడ్స్
శ్రీ బాలాప్రసాద్, బాలాజీ ఆర్ట్ ప్రింటర్స్
శ్రీ భూమయ్య, మల్లికార్జున పబ్లికేషన్సు
శ్రీ తేలుకుంట్ల రాములు
మోహన్ ప్రాసెస్, రాంకోటి, హైదరాబాదు
శ్రీ నాగేందర్, శివాజీ ప్రెస్, సికింద్రాబాదు
శ్రీ బడేసాహెబ్, చార్ మినారు ఆర్ట్ ప్రింటర్స్, సికింద్రాబాదు
శ్రీ కూరెళ్ళ కేశవులు, భువనగిరి
రాఘవరత్న ఫార్ బాయిల్డ్ రైస్ మిల్లు, అనంతారం
పాండురంగ క్లాత్ ఎంపోరియం, భువనగిరి
రాఘవ ట్రేడర్స్, భువనగిరి
మహాలక్ష్మి రైస్ & ఆయిల్ మిల్స్, ఆలేరు
గోవింద్ ట్రేడర్స్, పేపర్ మర్చంట్

వీరికి మా హృదయపూర్వక కృతజ్ఞతలు.

విషయ సూచిక



ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి ప్రథమ వార్షికోత్సవ సభ
డా॥ సర్వేపల్లి రాధాకృష్ణన్ గారు, శ్రీ దేవులపల్లి రామానుజరావు గారు
తేది 10 జనవరి 1959.

అభినందనమ్

డా॥ ఆర్. శ్రీహరి

ఆంధ్ర సంస్కృతి బద్ధచిత్త శ్చాంధ్రభాషావృద్ధి నిరతః
అమృతహస్తః పరిషదాం చ స్థాపనే వా నిరూఢో వా

కార్యదక్షః స్వార్థరహితః సచ్చరిత్రో డంబరహితః
స్వాభిమానీ నిత్యతృప్తః పక్షపాతీ పండితేషు

ఈదృశాఖిల గుణగరిష్ఠో నిష్కళంకః ప్రజాసేవీ
కోనువా నన్వాంధ్రదేశే రాజతే సన్నద్వితీయః

దేవులపల్ల్యు పాహ్వస్స రామానుజరాయ ఏవ
తెలంగాణ తిలకో నహ్యశేషాంధ్రతిలకః సః

సారస్వత పరిషద్వా గ్రంథాలయసంస్థా వా
అకాడెమీ సంస్థే వా విద్యాపీఠానివాఽత్ర

వినిర్మలం యశశ్చాస్య వితన్వంతి దిక్షు సదా
భాషాపరిసేవనేన లబ్ధమహాసుకృతస్య ను

పంచాధిక సప్తతిమిత శరద్విలాస సందృశ్వా
పూర్ణాయుఃశాలీ స్యాత్ శ్రియః పతేశ్చ కారుణ్యాత్.

దేవులపల్లి రామానుజరావు

"ప్రియ మిత్ర కళాభిజ్ఞః సాహితీరసికం సుధీః
రామానుజోగుణాబోధః జయమేతు శతం సమాః
—డా॥ దివాకర్ల.

ఈ వ్యాసాన్ని మీకు అందించే ముందు, శ్రీ దేవులపల్లి రామానుజరావుగారు అభిమానించే అప్పుడు, భావ కవితా ఉద్యమానికి అద్యుడు అయిన శ్రీ రాయప్రోలు సుబ్బారావుగారి కమనీయ పద్యము ఒక దానిని ఇక్కడ చెప్పి, వారి గురుత్వభావనకు ప్రతీకగా ఉంటుందనీ, అది సమంజసం అనికూడా భావిస్తున్నాను.

"మామిడి కొమ్మ మీద కల మంత్ర
పరాయణుడైన కోకిల
స్వామికి మ్రొక్కి యీ యభినవ
ధ్వని ధారణకుద్యమించితిన్
ఈ వికసించిన శ్రావణ
నిశీధమున గానబడిన నాదరసుతకున్
ప్రశమితమతినై యీ ప
ద్య శుభాంజలి నొసంగితి ప్రణయాద్వమనంచున్.

శాశ్వత నవ్య స్ఫురణల
నశ్వర లావణ్యమై యెనయు కావ్య కళా
విశ్వమునందానందర
సైశ్వర్యములేలు కవితకంజలి యిత్తున్."

శ్రీ రామానుజరావుగారిది బహుముఖ ప్రజ్ఞ. ఇంగ్లీషు, తెనుగు ఉరుదూలలో నిగ్గయిన పాండిత్యం, న్యాయవాద పట్టభద్రుడు, మంచి రచయిత, కవి. కలుపుగోలుతనము సరసత ఈయన కార్య నిర్వాహణ దక్షతకు పదను బెట్టినవి. ఈ కార్యాచరణ కౌశల్యం ఆయన చేపట్టిన పనులకు, సంస్థలకు సుస్థిరతను గూర్చి, వాటి కీర్తిని పిండి అరబోసి నట్లు పండు వెన్నెల గాయించినది. కాబట్టే తెలంగాణా సాంస్కృతిక సాహిత్య ఉద్యమాలలో రావుగారు ఒక ప్రముఖ పాత్ర అయినారు.

గోలకొండ పత్రికకు ఇరవై ఏండ్లు సంపాదకీయాలు వ్రాసినారు. చాలా ఏండ్లు ఉస్మానియా యూనివర్సిటి సిండికేటు, సెనేటు లలో పలుకుబడి గలిగిన సభ్యుడిగా పనిచేసినారు. మధ్య మధ్య వైస్ ఛాన్సలరుగా పనిచేసినారు. రాజ్య సభలో సభ్యుడిగా ఉండినారు. కొంతకాలం తెలంగాణా గ్రంథాలయ ఆంధ్రోద్యమాలలో చాలా లోతుగా దిగి పనిచేసినారు. జంటనగరాలలో ఒక ప్రతిష్ఠాపూర్ణ సంస్థ అయిన ఆంధ్ర సారస్వత పరిషత్తును నాటి, నీరుబోసి, పెంచి, వివిధ శాఖలలో ఒక పెద్ద మర్రిచెట్టుగా చేసిన కార్యకర్తలలో వీరు తల మానిసి. ఈ పని నేర్పరి ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ పుట్టినది మొదలు ప్రధాన కార్యదర్శియై నేటివరకు సమగ్ర ఆంధ్రావనిలో అభిమానానికి పాత్రులై దానిపేరు ప్రతిష్టలకు ఒక బిగువును సమ కూర్చినారు. కేంద్ర సాహిత్య అకాడమీలో రెండు తడవలు పదేండ్లు కార్యనిర్వాహక సంఘం సభ్యుడిగా కార్యసరణిలో తన ముద్రను అద్దినారు. నగర గ్రంథాలయ సంస్థ అధ్యక్ష పదవి ఈయనను వరించ డంలో వింత లేదు. ఆయన రాణింప చేసిన గౌరవ పదవులలో ఇవి కొన్ని మాత్రమే.

కుల మత వర్గ భిత్తికలు విభాగించని విశాల హృదయం శ్రీ రావుగారిది. మాడపాటి హనుమంతరావు, బూర్గుల రామకృష్ణా

రావు, సురవరం ప్రతాపరెడ్డి మొదలగు పెద్దల అభిమానం పొందిన వారు. సనపర్తి రాజా రామేశ్వరరావు, నూకల నరోత్తమరెడ్డి, ఎం. రామప్ప (రిటైర్డు కలెక్టరు), బొమ్మకంటి సత్యనారాయణ, గడియారం రామకృష్ణశర్మ మొదలగు ఆప్తులకు నోటిలోని నాలుక ఈయన. ఇన్ని పదవులు పరిచయాలు చేకూర్చిన పలుకుబడిని, ఇతరుల సేవలకు సహాయాలకు వినిమయం చేసిన స్వార్థరహితుడు.

"మీజాన్" పత్రిక ద్వారా "ఏకశిలా నగర శిలాఫలక కలకల శోభా విభావరి" అన్న బిరుదాంకితుడూ ఆంధ్ర సారస్వత పరిషత్తు పేరు, దేవులపల్లి రామానుజరావు పేరు కాకుండా రెండూ రామానుజరావుగారే అయి పరిషత్తు మే, 1943 సంవత్సరంలో స్థాపించిన నాటి నుండి నేటి వరకు సభ్యుడు, కార్యవర్గ సభ్యుడు, పరోక్ష కార్యదర్శి, ఉపాధ్యక్షుడు, అధ్యక్షులుగా అనుబంధాన్ని అనురక్తిని పెంచుకుంటూ కొన్ని లక్షల మందికి (ఆంధ్ర సారస్వత పరిషత్తు ద్వారా పరీక్షలు నిర్వహించి) ఉపాధిని కలగించడమే ఆయన ధ్యేయం. తను నమ్మిన సిద్ధాంతానికి నిరంతరం పోరాడుతూ దానిని సాధించుకోవడం ఆయన కర్తవ్యం 'పిట్ట కొంచెం-పట్టు ఘనం' 'పొట్టివాడు-గట్టివాడు' అన్న నానుడులకు నిదర్శనంగా ఈనాడు వటవృక్షంలా నిలిచిన ఆంధ్ర సారస్వత పరిషత్తు వారి నిస్వార్థ సేవకు ప్రతీక-అందుకు ఆయన ప్రతిబింబం. అంతేకాదు, శ్రీ రామానుజరావు గారి జీవన ప్రతిబింబానికి ఓ మచ్చుతునక.

శ్రీ రామానుజరావుగారు 25 ఆగస్టు 1917లో వరంగల్లు పట్టణానికి 8 కిలోమీటర్ల దూరములో నున్న దేశాయిపేట గ్రామంలో వేంకటచలపతిరావు, అండాళమ్మల ప్రథమ సంతానంగా జన్మించారు. వంగపాడుకు దత్తతగా వచ్చాడు. వీరి నివాస స్థానము వరంగల్లులోని ఎల్లమ్మ బజారు. నాలుగవ ఫారం వరకు ఆయన విద్యాభ్యా

సము ఇంటివద్దనే గడిచింది. నాలుగవ ఫారం చదువుకొనే నిమిత్తం ఆయన హన్మకొండలోని "కాలేజ్ ఎట్ హైస్కూల్"లో చేరారు. (ఇదే తర్వాత మల్టీపర్పస్ హై స్కూల్‌గాను. ప్రస్తుతం ప్రభుత్వ జూనియర్ కాలేజీగాను రూపాంతరం చెందింది.) ఆయన పాఠశాలలో చదువుకునేటప్పుడు ఆయన కొరకు పెద్ద గుర్రం టాంగా (జట్కా) ఒకటి ప్రత్యేతంగా మట్టెవాడ నుండి హనుమకొండకు వచ్చెడిదట. వీరు చిన్ననాటినుండే దయార్ద్రహృదయులు, మృదువుగా మెత్తగా మాట్లాడేవారు. (మాటేటి రామప్పగారు ఒకచోట అంటారు) వీరికి ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు. ఈనాటికీ ఆయనతో పరిచయం ఉన్నవారికి ఈ విషయం బోధకంగానే అగుపడుతుంది. శ్రీ రామానుజరావుగారు కుదుమట్టమైన మనిషి. సన్నగా చామనచాయ కలిగి, మధ్యపాపట కలిగి, కళ్ళద్దాలతో ముఖం కళకళలాడుతూ ఉంటుంది. ఆ హసోన్ముఖునిలో కొంచెం హాస్యప్రియత కూడా కలదు. ఆ సహృదయుడు నవ్వుతూనే మాట్లాడిస్తాడు. అయన మాటల్లో హృదయ సంస్కారం కనబడుతుంది. కావ్యభాషలో మాట్లాడుతాడు. ఆయన యువకులలోనే లెక్క. ఆయన సాహిత్య వడసారం ఒక స్వర్ణోత్సవం. అంతేకాదు, ఆయన ప్రాచీన కాలపు పండితుల శ్రేణిలో చేరని నవీన కాలపు పండితుడు. అంత మెత్తనివాడూ కాదు, అంత గడుసరీ కాదు. మొత్తానికి మెత్తగా ఉన్నట్లు కనిపించినా స్వీయాభిప్రాయాలను వీడని ధీరచిత్తుడు. ఇంతైనా ఆయన కార్యవాదిగాని, ఖడ్గవాది మాత్రం కాదు. ఆయన వ్యవస్థాపకుడు, కార్యకర్త కూడా.

ఈయనను మనం పొట్టివాడుగా భావిస్తే మాత్రం, పొట్టివాడే. అయినా తనకంటే చాలా పొడుగైన వారి ఎదుట నిటారుగా నిలబడే శక్తి ఈయనకుంది. నిలబడి ధైర్యంగా మాట్లాడగలడు అని ఆయన యాభై ఏళ్ళ జ్ఞాపకాలు పరికించినప్పుడు మనకు తెలుస్తుంది. నిల

బడటం అంటే ఊరికే నిలబడటం కాదు. మనిషి పెరగగలడు. ఎంత ఎత్తుకు కావాలంటే అంత ఎత్తుకు పెరగగలడు. ఈయన దగ్గర ఇంకో విచిత్రం ఉంది. ఎదుటనున్న వ్యక్తి ఎంత ఎత్తో అంత ఎత్తుకు మాత్రమే పెరిగి ఊరుకోడు. ఆయన కంటే పైకి ఎదిగి, అక్కడ నుండి క్రిందికి చూస్తాడు చిరునవ్వులు కురిపిస్తూ.

శ్రీ రామానుజరావుగారు మద్రాసు విశ్వవిద్యాలయము నుండి పట్టభద్రులైనారు. తరువాత నాగపూర్ విశ్వ విద్యాలయం నుండి ఎల్.ఎల్.బి. పట్టాను పొందినారు. నాగపూర్‌లో డా॥ నటరాజ రామకృష్ణ తదితరుల చేత పరిచయం కలిగింది. ఆ కాలములోనే తెలుగు సాహిత్య మందు అభిలాష కలగడంతో వరంగల్లులో 'శోభ' పత్రికను స్థాపించి నడిపించినారు. విద్యాభ్యాసం తర్వాత కొంతకాలం గ్రంథాలయోద్యమమునకు తన సేవలను అందించినారు. 1941 సంవత్సరంలో వరంగల్లు పట్టణములో శబ్దానుశాసన ఆంధ్ర భాషా నిలయమునకు కార్యదర్శిగా ఉండి దాని రజతోత్సవమును జరిపించినారు. 1942 ప్రాంతంలో తెలంగాణా పత్రికకు సాహిత్య వ్యాసములను పంపుతుండేవారు. 1945-46 లలో వరంగల్లు యువజన కాంగ్రెసునకు అధ్యక్షులుగా ఎన్నుకొనబడినారు. వీరి ఆధ్వర్యములో నిర్వహిస్తున్న సాహిత్య పత్రికను రాజకీయ విషయాలకు ఉపయోగించుటకు ససేమిరా అంగీకరించలేదు.

గోలకొండ పత్రికలో ఉప సంపాదక పదవికి సురవరం ప్రతాపరెడ్డిగారు ఆహ్వానించినారు. ఆయన తన అభిప్రాయాలను నిర్భయంగా ఇందులో ప్రతిబింబింపచేస్తూ, కర్తవ్య నిర్వహణను సాగించినారు. 1949-50 లందు హైద్రాబాద్ రాష్ట్ర కాంగ్రెస్ ఎలక్షన్ ట్రిబ్యునల్ సభ్యులుగా పనిచేసిరి. 1955 లో ఆలంపూరు తాలూకా కాంగ్రెసు ఎన్నికలకు రిటర్నింగు ఆఫీసర్‌గా నియమితు

లైనారు. 1960-62 సం॥లలో సాహిత్య ప్రతినిధిగా రాజ్యసభ సభ్యులుగా పనిచేసినారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో 1950 నుండి 1979 వరకు సెనేటు సభ్యుడుగా, సిండికేటు మెంబరుగా, ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబరుగా, అక్టింగు వైస్ ఛాన్సలర్‌గా 3 సార్లు పదవులను నిర్వహించినారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విశ్వవిద్యాలయం (A. P. Open University) ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులుగా కూడా ఉండినారు. తెలుగు విశ్వవిద్యాలయం సిండికేటు సభ్యులుగా ఉన్నారు రెండు మూడు సంవత్సరాలు. కేంద్ర విశ్వవిద్యాలయం (హైద్రాబాద్ సెంట్రల్ యూనివర్శిటీ) ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులుగా 1974-77 ప్రాంతంలో పనిచేసినారు.

వీరి మొట్ట మొదటి గ్రంథం ఖండకావ్యం. అది "పచ్చ తోరణం." శ్రీ రామానుజారావుగారి భావుకతకు అది ప్రతీక. 'సంక్రాంతి'ని ఆయన వర్ణించిన తీరు అమోఘం.

"కుంకుమంబులు చల్లి గొబ్బి ముద్దలు పెట్టి
పగడాల సొగసును పరిహసింప
పక్షి వ్రాలిన భంగి పసుపు ముగ్గులు దీర్ప
పుష్యరాగంబుల పొలుపుమీర
రంగారదీర్చిన రంగవల్లిక గుంపు
కన్నెతీగలవోలె వన్నె గుల్క
జడలోని పూవులు జారి యుండినచోటు
ముత్యాల ముగ్గుతో ముచ్చటాడ
చీరకుచ్చిళ్ళు పదముల చిందులాడ
తెనుగువాకిండ్ల దిరిగెడు తీగబోండ్లు
సరస సల్లాపములు సేయు సమయమందు
పుట్టినింటికి వచ్చెను పుష్యలక్ష్మి."

ఆయన సంక్రాంతి లక్ష్మిని ప్రతిబింబించిన తీరు అది. ఆ స్వాగతంలోనే లలితమాధుర్యమైన పదగుంభవలను మనం పరవశంతో చదువుకొనవచ్చును.

వీరి పుస్తకాలలో చెప్పుకొనదగినది, మణిపీఠం అలంకరించిన గ్రంథం 'సారస్వత నవనీతము.' వీరి ఉత్తమ సాహిత్య విమర్శకు ఆధారం గాను, వీరి తులనాత్మక శక్తిని, వీరిలోని విమర్శకుడిని ఆయనలోని నిశితమైన పరిశీలనాధోరణి ఇందులో ద్యోతకము అవుతుంది. ఈ పుస్తకం ఆధారంగానే అని అనుకున్నప్పటికిని వీరిని కేంద్ర సాహిత్య అకాడమీ కౌన్సిలు సభ్యులుగా ఎన్నుకొనుటకు కారణభూతము అయినది. శ్రీ కృష్ణదేవరాయల వారి "దేశభాషలలో తెలుగులెస్స" అన్న వాక్యానికి పరమార్థంగా తెలుగు భాషలోని తియ్యదనమును గుర్తించి ఉర్దూలో 'తెలుగు సాహిత్య చరిత్ర'ను ప్రచురించినారు. వీరి సాహిత్యాభిలాష కారణముగా రవీంద్రనాధ ఠాగూర్ శతవార్షిక జయంతి సంఘంనకు కార్యదర్శిగాను, గురజాడ శతవార్షిక జయంతి సంచిక సంపాదకులుగాను వ్యవహరించి వాటిని దిగ్విజయము చేసి 1974-75 లో ప్రపంచ తెలుగు మహాసభకు కోశాధికారిగా, వాటికి ఎంతో గణతను చేకూర్చినారు. కేంద్ర సాహిత్య అకాడమీ తెలుగు సలహా సంఘంలో 20 సం॥లు **General Council** తర్వాత 15 సం॥లు **Executive Council** లలో పనిచేసినారు.

శ్రీ రామానుజరావుగారు బమ్మెరపోతన కేవలం భక్త కవియే కాదు సహజసిద్ధమైన శృంగార కవి అనియు, శృంగార నైషధమును రచించిన శ్రీనాథుడు కూడా పోతనామాత్యుడిలో సరితూగ లేడని (సారస్వత నవనీతము పుట 230) లో విమర్శనాత్మకముగా వివరించి చూపినారు. అంతేకాక సూరన అయిదు తరాల శృంగారమును చిత్రించితే, పోతన అరువది తరాల శృంగారమును చిత్రించినాడు

అని నిర్మాణాత్మకమైన మనోరంజకమైన విమర్శ గావించి ఉన్నారు పోతన భక్తిరసములో నుండి శృంగారంను వెలికి తీసి వారి శృంగార భావనను అందించిన వారిలోని పరిశీలనకు, భావనకు మనం జోహార్లు అర్పించాలి. భాగవతమును నూత్న దృష్టితో పరికించడానికి అవకాశమిచ్చినందులకు ఆయనకు ధన్యవాదాలు చెప్పాలి.

ఒకచోట రామానుజరావుగారు ఒక జాతి సారస్వతము ఆ జాతి జాతీయ జీవనమునకద్దము వంటిదని అంటారు. రావుగారు పుట్టి పెరిగిన కుటుంబంలో ఉన్న వసతినీ, ఆనాటి అవకాశాలనూ, చదివిన చదువునూ, ఈనాడు వారు ఆంధ్ర సారస్వత పరిషత్తు అవరణలో ఓ చిన్న గదిలో కూర్చునే తీరునూ తలచుకుంటే కొంత ఆశ్చర్యము కలుగకమానదు. వీరు పుట్టింది భూస్వామ్య వర్గానికి చెందిన కుటుంబం కాబట్టి భూ వసతి బాగా ఉన్నది. ఆ వసతి చూచుకొని అక్కడే స్థిరపడితే ఈనాటికి సిరిసంపదలతో తులతూగే భూస్వామిగా కనిపించేవారు. వాటికి ఆయన లోభపడ లేదు. 1939 నాటికే పట్టభద్రుడు అయిన వీరు ఆనాటి అవకాశాలు సరి చూసుకొని నిజాం ప్రభుత్వంలో ఉద్యోగిగా చేరినా ఫించన్ పుచ్చుకొనే నాటికి తప్పకుండా అత్యున్నత కార్యదర్శి హోదాలో ఉండేవారు. ఉన్నతోద్యోగ భవిషత్తును కూడా వారు ఆశించలేదు. వకీలు వృత్తిలో స్థిరపడినా నేటి సుసంపన్న న్యాయవాదుల్లో ఒకరుగా కనిపించేవారు. 'చదివింది న్యాయశాస్త్రం అయినా మీరు సాహిత్య విమర్శకు మంచి మెరుగులు దిద్దారే? ఏ ప్రభావం వల్ల?' 'అని ఎవరైనను అడిగితే ఆయననుండి వచ్చే సమాధానం ఇది 'సాహిత్యం, ముఖ్యంగా నవ్య సాహిత్యం అంటే నాకు మొదటి నుంచీ ఇష్టమే. పూర్వపద్ధతిలో వ్యాకరణం, అలంకార శాస్త్రం వంటివి నేను చదువలేదు. వాటి సంగతి నాకు తెలియదు. కాని చిన్నప్పుడు "ఆంధ్ర ప్రచారిణి" నవలలు బాగా చదివాను. అవి చదవడం వల్లనే నాకు తెలుగు సాహిత్య

పఠనాభిరుచి, క్రమంగా రచనాభిరుచి కూడా పెరిగింది. అంతే, ఇదంతా నాయంతకు నేనే తీరిక సమయాల్లో నేర్చిన తెలుగే'నని నిర్మొహమాటంగా, నిస్సంకోచంగా చెప్పుతారు.

అంతేకాదు, "ఆ రోజులలో ఆంధ్ర - తెలంగాణాల మధ్య సేతువు నిర్మించిన నాటక ప్రదర్శనలు, అవధానాలు, గ్రంథాలయాలు, నవలలు, పత్రికలు మొదలైనవి నా మట్టుకు నేను చిన్నతనంలోనే తెలుగు సాహిత్యము వైపు ఆకర్షితుడను కావడానికి ఇవీ కారణం. మైలవరం కంపెనీవారి నాటకాలను చూచి, అందులో కపిలవాయి రామనాధశాస్త్రి, ఉప్పలూరి సంజీవరావు, వేమూరి గగ్గయ్య మొదలైనవారు ఆడిన నాటకాలను చూచి, అవధాన సభల్లో పద్యాలు విని, గ్రంథాలయ వార్షికోత్సవాలలో సాహిత్యోపన్యాసాలు విని, ధర్మవరం, చిలకమర్తి, పానుగంటి ప్రభృతుల నాటకాలు కొన్ని చదివి, విజ్ఞానచంద్రికా మండలి, ఆంధ్ర ప్రచారిణి గ్రంథమాలలు నవలలు కొన్ని పఠించి, ఆంధ్ర, కృష్ణా పత్రికలను అప్పుడప్పుడు చదువుతూ, నీలగిరి, తెనుగు, గోలకొండ పత్రికలను చదువుతూ తెలుగు సాహిత్యం వైపు అభిముఖుడైనాను. చిన్న వయస్సులో సాహిత్యంలో కలిగిన ఆ సంబంధం నాటికీ, నేటికీ తెగిపోక దృఢంగా ఉన్నది" అని యాభై సంవత్సరాల జ్ఞాపకాలు (1929 నుండి 1979)లో రామానుజరావు గారొక చోట చెప్పినారు.

శ్రీ రామానుజారావుగారు "మా ఊరు ఓరుగల్లు" అను వ్యాసములో వరంగల్లు నగరమును ఇలా వర్ణిస్తారు:

"కాబోలు నియ్యది కాకతీయులొకప్డు
కరకు నెత్తుట కత్తికడుగు చోటు
కాబోలు నీద్వార కళ్యాణ వేదిక

అలికి ముగ్గులు పెట్టె తెలుగు పడుచు
కాబోలు నీజీర్ణకమనీయ సౌధాన
సుకుమార శిల్పముల్ సొంపులొలికె
కాబోలు నీవీధికాపురంబొనరించె
పైడి మేడలలోన భాగ్యలక్ష్మి
ఇచటనే నిల్చి కాబోలు నిందుముఖులు
ఆయుధంబులు పూజించియరుగుదెంచు
ఆంధ్ర సేనకు కపురంపుటారతులను
ఇచ్చి వారల శౌర్యంబు మెచ్చినారు"
(పచ్చతోరణం పుట-17)

ఈ పద్యం చదివినపుడు శిథిలావస్థలోనున్న వరంగల్లు పురా చరిత్రను మన ముందు ప్రతిబింబింప చేసినారు. "కదనరంగమె కాక మా ఊరు కళాక్షేత్రము కూడా. సంగీతం, సాహిత్యం, చిత్రలేఖనం, శిల్పం మొదలైన కళలు మా ఊరిలో కాకతీయ ప్రభువుల ఆధ్వర్యాన వేయి ముఖాలుగా విస్తరించినవి. కాకతీయ ప్రభువుల పోషణలో ప్రోత్సాహముతో తెలుగు భాష, తెలుగు సాహిత్యము. తెలుగు కళలు అద్వితీయముగా అభివృద్ధి చెందినవి. నాడు తెలుగు భాష దాదాపుగా అధికార భాషగా అమలులోనికి వచ్చినది. కాకతీయ ప్రభువులు తెలుగులో శాసనాలను వ్రాయించినారు. వరంగల్లు కోటలో కట్టడాలు, వేయిస్తంభాల దేవాలయము, పద్మాక్షి దేవాలయము మొదలైన ఆలయాలు యీ రోజు శిథిలమైనప్పటికిని నాడు శిల్పము, సంగీతము, చిత్రలేఖనము, నృత్యము వంటి కళలు సాధించిన అత్యున్నత స్థాయికి సాక్షిభూతంగా సజీవ నిదర్శనాలుగా నిలిచి ఉన్నవి" అని (నా రేడియో ప్రసంగాలు పుట-1) 'మా ఊరు ఓరుగల్లు' వ్యాసంలో అంటారు. మాతృభూమిని, మాతృభాషని మరచినవాడు, మరణించినవాడితో సమానము. రామానుజరావుగారికి తాను పుట్టిన గడ్డపై ఎంత మమ

కారమో "గడిచిపోయిన ఆనాటి చరిత్రనే కాదు, జరుగుతున్న ఈనాటి చరిత్రలోను, రేపు జరుగనున్న చరిత్రలోను మా ఊరు వరంగల్ గణనీయమైనది" (నా రేడియో ప్రసంగాలు పుట-86) అని సగర్వంగా చాటుచున్నారు. సాహిత్య సంపదలో తెలంగాణా వెనుకబడిన ప్రాంతమనే కొందరి అభిప్రాయాన్ని రామానుజరావుగారు "తెలంగాణాలోని గ్రామాలలో తాళపత్ర గ్రంథాలు లేని వూరు లేనే లేదని చెప్పితే అతిశయోక్తి కాజాలదు" అని సహేతుకంగా వివరించారు. (సాహిత్యోపన్యాసాలు పుట - 7.)

శ్రీ రామానుజరావుగారు కేవలం సాహిత్య వికాసమునకు మాత్రమే తన సేవలను పణం పెట్టకుండా సాంస్కృతిక పునరుజ్జీవనంకు కూడా ఆయన ఎంతగానో సేవ చేశారు. శ్రీ కృష్ణదేవరాయాంధ్ర భాషానిలయం నిలద్రొక్కుకొనుటలోను, ఆంధ్ర సారస్వత పరిషత్తు, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి భవనాలు, వాటి ఉనికి స్థిరంగా ఉండటంలోను ఆయన ప్రతిక్షణం అవిరళకృషిని మనం ఒకపరి వెనుతిరిగి చూడాల్సి ఉంటుంది. అంతేకాదు, ఆయనలోని అంకురిత సాధనా పటిమకు అవి మూల స్థంభాలుగా నిలుస్తాయి. అంతేకాదు, ఉస్మానియా విశ్వవిద్యాలయంను హిందీ విశ్వవిద్యాలయంగా మార్చివేయడానికి జరిగిన ప్రయత్నాలను వమ్ము చేయడంలోను, అందులోనూ తెలుగు భాషను నిర్బంధ భాషగా ప్రవేశపెట్టడంలో ఆయన సాధించిన ఫలితం, అందుకు ఆయన సమిష్టిగా సాధించిన ఫలితం ఈనాడు మనమందరం అనుభవిస్తున్నది అయినప్పటికిని, ఎంతమందికి అది తెలుసు? అప్పటి విద్యాశాఖ మంత్రి శ్రీ బూర్గుల రామకృష్ణారావుగారు పరిషత్తు కృషిని గూర్చి ఇలా ప్రశంసించారు: "సూర్యుని వెలుతురువలె పరిషత్తు ఉద్యమము పల్లె పల్లెలకు వ్యాపించి అజ్ఞాన తమస్సును నివారించుచున్నది" దేవులపల్లి రామానుజరావుగారికి మాడపాటి హనుమంతరావు, సురవరం

ప్రతాపరెడ్డి, కొమర్రాజు లక్ష్మణరావుగారల సహకారం దొరకడం, నిప్పుకు గాలి తోడైనట్టుగా ఆంధ్రోద్యమం తెలంగాణాలో మొత్తం వ్యాపించి తెలుగు సాహిత్య వీధులలో వీరవిహారం చేస్తూ, పునరుజ్జీవ మునకు అది నాంది పలికింది. దీనికి తోడుగా ఆంధ్ర సారస్వత పరి షత్తు కృషిని కేంద్ర సాహిత్య అకాడమీ వారు గుర్తించి ప్రోత్సహిం చడం దానికి మరింత వన్నె తెచ్చింది. రామానుజరావుగారు ఒకచోట అంటారు నైజాం ప్రభుత్వం కాలంలో సభలు పెట్టుకోవడం ఇబ్బంది కావడం, డా॥ సర్వేపల్లి రాధాకృష్ణన్ గారిని రాష్ట్ర ప్రభుత్వం అనుమతి లేకుండానే ఆహ్వానించడం, ఆయన అంగీకరించి అలంపురం సభలకు వచ్చి కొంతసేపు ఆంగ్లంలోను, తెలుగులోను మాట్లాడి మా అందరిని ఆశీర్వదించి, మా ఆంధ్ర సారస్వత పరిషత్తు సప్తమ వార్షి కోత్సవాలను జయప్రదం చేసినారని అన్నారు. ఈ సంఘటన 1953లో జరిగినది. (యాభై సంవత్సరాల జ్ఞాపకాలు-పుట 29).

శ్రీ రామానుజరావుగారికి కలిగిన అదృష్టాలలో మరొకటి వీరు భారతకోకిల శ్రీమతి సరోజీనీనాయుడు గారితో హైద్రాబాద్‌లో ప్రత్య క్షంగా, సన్నిహితంగా గడపడానికి అవకాశం కలిగింది. ఆమె చేసిన ఎన్నో ప్రసంగాలను ఆయన చెవుల్లో గింగుర్లు తిరుగుతున్నాయి అని అంటారు. ఆమె చెప్పిన ఒక ఉర్దు ఖండికను వారు ఉదహరించారు.

"బుల్ బుల్‌కు గుల్ ముబారక్
గుల్ కూ చమన్ ముబారక్
రంగీన్ తబీయతోంకు
రంగీన్ సుఖున్ ముబారక్"

ఈ ఖండికను ఆమె హైదరాబాద్‌లో హోలీ పండుగ సంద ర్భంగా చెప్పినారట. ఆ గత స్మృతులను తలచుకుంటూ, మహానాయ

కులను గుర్తుచేస్తూ తమ జ్ఞాపకాలలో ఒక చోట ఇలా అంటారు: "నిజానికది మహోన్నతమైన, మహోదాత్తమైన వ్యక్తిత్వము సంస్కృతీ గల నాయకుల యుగం. వారందరూ రాజకీయరంగం లోను, విజ్ఞాన రంగంలోను అతిరథ మహారథులైన సవ్యసాచులు, త్యాగమూర్తులు, భారతదేశ వైతాళికులు యువకులు, విద్యార్థులు వారి నుండి ఉత్తేజం పొందేవారు."

"ఆంధ్ర సారస్వత పరిషత్తుతో వివిధ సమస్యలపై భిన్నాభి ప్రాయాలు కలవారు. రాజకీయంగా, సాంఘికంగా ప్రత్యేక దృక్పథం కలిగినవారు అందరు సహకరించినారు. కావుననే సారస్వత పరిషత్తు ప్రజల సంస్థ, తెలుగు భాషా సంస్కృతుల పరిరక్షణ కొరకు అంకిత మైన సాంస్కృతిక సంస్థ. నాటినుండి ఈ పరిషత్తు నిరంతరాయంగా అభివృద్ధి పథంలో ముందడుగు వేస్తూ భాషారంగంతో చరిత్రాత్మక మైన కృషి చేసినది" అని అంటారు.

ఈనాడు విద్యాభ్యాసములో ఉర్దూ మాధ్యమికత కేవలం ముస్లిము సోదరులకే పరిమితము అయిపోయినది కాని, తెలంగాణాలో 1950 కు ముందు నిజాం రాష్ట్ర పాలనలో ఉర్దూ మాధ్యమికంగాను, ప్రథమ భాషగాను దానికి ప్రాధాన్యత ఉండేది. దానితోపాటుగా ఫారసీ భాష కూడా ప్రముఖంగా ఉండేది. ఈ ప్రాచుర్యమును గమ నించే ఆయన తెలుగు సాహిత్య చరిత్రను ఉర్దూలో రచించినారు. అంతేకాకుండా, ఆనాటి తెలుగుభాషపై ఫారసీ, ఉర్దూభాషల ప్రభావము గాఢంగా ఉందని చెప్పుతూ, శ్రీనాథుని కాలంలో కూడా శ్రీనాథుడు, జక్కన, గోగులపాటి కూర్మనాథ కవుల కవిత్వంలో కూడా ఈ పదాలు చోటు చేసుకున్నాయని చెప్పుతూ కొన్ని పద్యాలను పేర్కొ న్నారు కూడా. శ్రీనాథుడు వాడిన ఒక పద్యం (నా సాహిత్యోపన్యా సాలు - పుట-36)

"పూజారి వారి కోడలు
తాజారగ బిందె జారి దబ్బున బడియెన్
మైజారు కొంగుదడిసిన
బాజారే తిరిగి చూచి ఫక్కున నవ్వెన్."

ఇక్కడ 'బాజారు' అనే పదం గమనించాల్సి ఉంటుంది. ఇక్కడ ఈ విషయం ప్రస్తావించడం ఎందుకంటే, ఆయనలోని నిరంతర పఠనం, విమర్శక ధోరణి, సునిశిత పరిశీలనను మీ ముందుంచడమునకే ఇక్కడ చెప్పడం జరిగింది.

శ్రీ రామానుజరావు గారి ప్రోత్సాహ ప్రచారములను పొంది మహాకవులుగా, గ్రంథకర్తలుగా, కళాప్రపూర్ణులుగా, ఆస్థానకవులుగా, ఉత్తమోత్తమ బహుమతి గ్రహీతలుగా వెలసిన యువకవులు, రచయితలు ఎందరో ఉన్నారు. దేశ సౌభాగ్యమే తన సౌభాగ్యమని భావించి, అడిగిన ప్రతి వ్యక్తికి సహాయము చేసిన ఉదారహృదయు డాయన. ప్రతి కవి వ్రాసిన కావ్యమునకు ఆవిష్కరణోత్సవ సౌకర్యం కలిగించుటకు పరిషత్ ప్రణాళికలో చేర్చిన ఆయన సౌహార్ద్రము మెచ్చదగినట్టిది. ఆయన స్వయముగా కవి, విమర్శకుడు, కృతికర్త ఆయనకెందరో కవులు, రచయితలు తమ కావ్యములను అంకితం చేసి ధన్యులైనారు. (శ్రీలేఖ సాహితి కూడా తన వంతు కర్తవ్యంగా శుక్ల కవితా సంకలనం చంద్రునికో నూలుపోగులా 1989 ఉగాదినాడు అంకితం ఇచ్చింది.) అంతేకాదు, పరిపాలనాదక్షుడైన ఆయన సన్నిధిలో అలసత్వమునకు, నిర్లక్ష్యమునకు, ఏమరుపాటుకు, వ్యక్తి విమర్శకు తావులేదు. బి.ఏ., ఎల్.ఎల్.బి. పట్టము వహించి, రాజకీయ వేత్తయైన ఇట్టి మనీషి దొరకుటచేతనే ఆంధ్ర సారస్వత మందారము వికసించి పరిమళించినది. జీవితమును సారస్వతసేవకే ధారబోసిన శ్రీ రామానుజరావుగారు ఎంతో ధన్యులు. అంతేకాదు, ఈయన కర్మయోగి.

"దిన పూర్వ పదభాగజనితమైన ఛాయ పోలిక నుండు
కుజన సజ్జనుల మైత్రి" అన్నట్లుగా జాతి మత కుల వివక్షతల నెరుగని ఈ తెలంగాణా తెనుగు బిడ్డ మైత్రి అట్టిది! ఈయన హృదయం స్నేహదుగ్ధపూర్ణము. తెలంగాణాలో శ్రీ రామానుజారావు గారు పాల్గొని దీపింపచేయని ఉద్యమము లేదు, పాలించి పెంచని సంస్థ లేదు. విశాలాంధ్ర ఏర్పడిన తర్వాత సమగ్ర ఆంధ్ర జీవిత చీనాంబరానికి ఓతప్రోతయై ఉభయ ప్రాంతాల మధ్య స్నేహసేతు వైనారు. ఈయన కీర్తి, ఈయన మూర్తిని మించినది అని డా॥ మరుపూరు కోదండరామరెడ్డిగారు ప్రశంసించారు.

తన జాతి సంస్కృతీ సంపదను తనవారికి ప్రదర్శించి, వారిలో ఆత్మగౌరవాన్ని కలిగించి, ఉత్తేజాన్ని కలిగించటమే రామానుజరావు గారు తమ సాహిత్య కృషికి లక్ష్యంగా పెట్టుకున్నారు.

శ్రీ రామానుజరావుగారు వెలువరించిన గ్రంథాలు ఇవి :

1. పచ్చతోరణం (ఖండకావ్యము)
2. సారస్వత నవనీతము
3. తెలుగుసీమలో సాంస్కృతిక పునరుజ్జీవనము
4. తెలంగాణాలో జాతీయోద్యమాలు
5. నా రేడియో ప్రసంగాలు
6. ఉపన్యాస తోరణము
7. నా సాహిత్యోపన్యాసాలు
8. వేగుజుక్కలు
9. తెనుగు సాహితి
10. యాభై సంవత్సరాల జ్ఞాపకాలు (1929 నుండి 1979 వరకు)
11. తలపుల దుమారము
12. పంచవర్ష ప్రణాళికలు

13. బంకించంద్ర ఛటర్జీ జీవితము
14. హైద్రాబాన్‌లో స్వాతంత్ర్యోద్యమం
15. ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీ (బాలుర కొరకు-సచిత్రంగా)
16. మనదేశం - తెలుగుసీమ (బాలల కొరకు ఉద్దేశించినవి)
17. జవహర్‌లాల్ నెహ్రూ ,,
18. గౌతమ బుద్ధుడు ,,
19. కావ్యమాల-II-సంపాదకుడు - కేంద్ర సాహిత్య అకాడమీ ప్రచురణ (ఇది కేవలం స్వాతంత్ర్యానంతరం వచ్చిన కవితల సంకలనం)

సంపాదకత్వం వహించినవి :-

1. శోభ సాహిత్య మాస పత్రిక (1945-46 & 50-52)
2. గోల్కొండ దినపత్రిక సహాయ సంపాదకుడు (48-64)
3. గురుజాడ శతవార్షికోత్సవ సంచిక (తెలుగు-ఆంగ్లం) (1962-64)
4. రవీంద్రనాథ టాగూరు శతవార్షికోత్సవ సంచిక (1960-61)
5. రెండవ ప్రపంచ తెలుగు మహాసభల ప్రత్యేక సంచిక (1981)

శ్రీ రామానుజరావుగారు అంకితము తీసుకున్న గ్రంథాలు దాదాపుగా 30 కృతులు. వీటిలో డా॥ దాశరథి, మునిమాణిక్యం నరసింహరావు, గుంటూరు శేషేంద్రశర్మ, డా॥ సి. నారాయణరెడ్డి, శివశంకరస్వామి, తూమాటి దొణప్ప, డా॥ పల్లా దుర్గయ్య, డా॥ బోయి భీమన్న, తదితర శ్రీలేఖ సాహితి ప్రచురించిన 'శుక్ల' కవితా సంకలనం (దీనికి సంపాదకుడు టి. శ్రీరంగస్వామి) పుస్తకాలు కూడా చోటు చేసుకున్నాయి.

శ్రీ రామానుజరావుగారు ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి, ఆంధ్ర సారస్వత పరిషత్తు ద్వారా ఎంతో మంది రచయితలతో ప్రత్యక్ష పరిచయం, సన్నిహితత్వం ఉన్నందువలన వారి మనస్తత్వ ములను పరిశీలించినారు కాబట్టే ఆయన "నల్లగొండ జిల్లా రచయితల ప్రారంభోపన్యాసములో" ఇలా అంటారు: 'రచయితకు సలహా ఇవ్వడం, ఉపదేశం ఇవ్వడం నా ఉద్దేశం కాదు, ఒక అభిప్రాయాన్ని రుద్దటం కూటా నా అభిమతం కాదు. అయినా రచయితలను గురించి చాలామందిలో వినవస్తున్న అభిప్రాయాలను మీ ముందుంచడం అసమంజసమూ, అప్రస్తుతము కాదనుకుంటాను. సమకాలీన వ్యక్తుల ఆలోచనలలో, చిత్తవృత్తులలో వస్తున్న మార్పు, వేగాన్ని అందుకొన డానికి రచయితలకు సాధ్యం కావడంలేదు. అతనికి పరిశీలనా శక్తి లేదు. దానికి కావలసిన ఓపిక, ఓర్పూ అతనికి లేదు. సామాజిక స్పృహతో సరియైన సంబంధం లేదు. వారి రచనలకూ, వారు నివ సిస్తున్న జీవితానికి మధ్య పెద్ద అఖాతం ఉన్నది. రచయిత తాను సామాన్య జనానికి అతీతుణ్ణని భావిస్తున్నట్లు, తనకు సమాజంలో ప్రత్యేక స్థానం ఇవ్వాలని ఆశిస్తున్నట్లు కనిపిస్తుంది. రచయిత ఉప దేష్ట మాత్రమే-కాదు ఆదర్శమూర్తికావలె. చేతలకూ, మాటలకూగల అఖాతాన్ని ఎంతగా తగ్గించే ప్రయత్నంచేస్తే అంతగా రచయిత జనా నికి సన్నిహితం అయ్యే అవకాశం ఉంది. రచయిత తాను కట్టుకున్న గూడునుంచి బయటపడాలె. తాను గీసుకున్న పరిధిని దాటి వచ్చి జనం జీవనాడిని పట్టగలగాలె. రచయిత పరస్పర మాత్సరాన్ని వదిలి పెట్టాలె. అప్పుడే జనము అతన్ని గుర్తిస్తారు. అంతేకాదు, రచయితలు చాలామంది స్వేచ్ఛను గురించి మాట్లాడుతుంటారు. ఈ రోజు చాలా మంది రచయితలు తమకు తామే బానిసలు. అవకాశా లకు బానిసలు. కొందరు రాచరికపు వ్యవస్థలోని నందిమాగధులకు ఏమాత్రం తీసిపోరనే అభిప్రాయం కూడా ఉన్నది. సమాజం బాధ్య

తను స్వయం సేవకుడిగా స్వీకరించవలసిన రచయిత తన అవకాశా లకు తన వ్యక్తిత్వాన్నే పణం పెట్టినప్పుడు తనకే కాదు, తన భాగ స్వామి అయిన సమాజానికే అన్యాయం చేసుకున్న వాడౌతాడు. రచ యిత స్వేచ్ఛకు తానే శత్రువు కాగలడు" అని నిస్సంకోచంగా ఆయన తమ అభిప్రాయాలను వెలిబుచ్చారు.

శ్రీ రామానుజరావుగారు సారస్వత నవనీతము (పుట-62)లో రచయితల గురించి ఒకచోట ఇలా అంటారు: "అధర్మములకు, అన్యా యములకు సుకుమార హృదయులు సాధారణ మనుజులకన్నా నెక్కుడు క్షోభింతురు. ఆ యావేదన, ఆ యుద్వేగము మహాగ్రంథ రచనగా ప్రత్యక్షమగును. విశ్వసాహిత్యము ఒకమారు వీక్షింతిమేని గ్రంథ రచయిత లెల్లరు క్షోభించి, కుమిలి కృశించినవారే, సమకాలిక సంఘమునందలి యక్రమముల నెదుర్కొన్నవారే, తత్ఫలితముగా ననేక కష్టముల ననుభవించినవారే."

పత్రికలకు నిర్వహణ చేసేవారి గురించి, దానిని నిర్మొహ మాటంగా ఏ విధంగా ఉండాలో వారు చెప్పినారు. ఈ క్రింది మాట లలో ప్రస్తావించారు: "దేశాన్ని, ప్రజల జీవితాన్ని సినిమా చూసినట్లు చూడవలెనంటే అందుకు సాధన మొక్కటే, అదే మన పత్రికలు. ఆశయశుద్ధితో నిర్భయముగా, స్వతంత్రముగా పత్రికలను నిర్వ హించవలెను. దేశానికి స్వరాజ్యము రాకముందు పత్రికలు ఎంత నిర్భయంగా నిర్వహించినారో, ఈనాడు కూడా అంత నిర్భయముగా నిర్వహించవలెను. ఈ విషయములో నాకు ఆశాభంగం కలిగింది" అని ఉపన్యాస తోరణములోని (100 వ పుట) "ఆంధ్రప్రదేశ్‌లో స్వాతంత్ర్యోద్యమం" వ్యాసమందు.

శ్రీ రామానుజరావుగారు ఒకచోట నిస్సంకోచంగా తను ఇలా చెప్పుకున్నారు: "జీవితములో నాకు కల్గిన అదృష్టాలలో మిత్రుల సహకారం ఒకటి" అంటారు. ఆనాటి నుండి యీనాటివరకు కాలానుగుణంగా సాహితీసేవ చేస్తున్న రామానుజరావుగారు అందరికీ ఆప్త మిత్రులు - అజాత శత్రువులు. ఆయన ఒకచోట ఇలా అని వాటిని సాదృశ్యంగా సాధించిన మహోన్నతుడు కూడా. "నా రచనల్లో చూపిన ఆదర్శాలను, నా చేతనయినంతవరకు నా జీవితములో అనుష్టించిన వాటినే నా రచనల్లో వ్రాసినాను."

శ్రీ రామానుజరావుగారు సంఘ సంస్కరణాభిలాషి, నిష్కళంక జాతీయవాది. సంస్కృత ఆంధ్రములతోపాటు ఇంగ్లీషు,పారసీ, ఉర్దూ భాషలలో ప్రావీణ్యం కలిగిన పండితులు. అనేక విషయాలను గూర్చి సంపూర్ణమైన విజ్ఞానము సంపాదించిన మేధావి, మంచి వక్త, విమర్శకుడు, పరిశోధకుడు. ఎంతటి ఉద్గ్రంథమైననూ వేగంగా చదువగలిగి అందులోని సారాంశాన్ని గ్రహించగలిగిన మేటి పాఠకుడు. నిరంతర గ్రంథావలోకనంలో నిమగ్నుడైయుండే సంస్కృతీపరుడు. అన్నిటికన్నమిన్నగా దవ్వునకు భయతరుడుగా కనిపించినప్పటికీ, దాపునకు వచ్చిన తరువాత పరమాప్తుడు కాగలిగిన అమృతమూర్తి. ఇన్ని సుగుణాలు కలిగిన శ్రీ రామానుజరావుగారు సాధించిన కృషి ఏమిటి? అందువలన జరిగిన భాషావికాసం ఏమిటి? రచయితగా ఆయన ప్రతిభావ్యుత్తులు ఏమిటి? తెలుగు సారస్వతంలో ఆయన విశిష్టత ఏమిటి? అను ప్రశ్నలు సహజంగా ఉత్పన్నం అవుతున్నవి. ఈ ప్రశ్నలకు మనం ఇచ్చే సమాధానాలు తెలుగు వైతాళికుడుగా ఆయన స్థానాన్ని నిరూపించగలవు. ఆంధ్ర వాఙ్మయానికి ఆయన అనుపమానమైన భక్తితో సేవలందించి, అందిస్తున్న భాషా భక్తుడు.

ఆంధ్రప్రదేశ్ ఓపెన్ యూనివర్సిటీ 1990 మే 19 వ తేదీనాడు వీరికి డాక్టరేట్ పట్టాను ఇచ్చినది.

Literary Activities :

1. a) Secretary, Andhra Pradesh Sahitya Akademi 1957 to 1979
   b) Vice-President, Andhra Pradesh Sahitya Akademi 1979-1982
   c) President, Andhra Pradesh Sahitya Akademi 1979-1985
2. a) Member, Executive Committee, Andhra Saraswatha Parishath, | 1944-47
   b) Vice-President, Andhra Saraswatha Parishath 1947-52 & 1954-1980
   c) President, Andhra Saraswatha Parishath 1952-54 & 1983-Onwards
3. Secretary, Telugu Library, Warangal 1943-47
4. Member, Executive Committee, Central Sahitya Akademi, New Delhi 1967-1977
5. Secretary, Tagore Centenary Celebrations Committee, Govt. of Andhra Pradesh. 1960-62
6. Member, Excutive Board, Moulana Azad Memorial Reserch Institute, Hyderabad.
7. Member. Executive Board, Anjuman Taraqque-e-Urdu, Hyderabad.
8. Member, Bharatiya Bhasha Samithi, Govt. of India, New Delhi. 1970-72
9. Member, Executive Boad and General Council, Telugu Bhasha Samithi, Hyderabad.
10. Chairman, Hyderabad City Grandhalaya Samstha, Hyderabad. 1966-73
11. Treasurer, First World Telugu Conference.1975-76

12. Member, Executive and Board of Governors, Telugu Akademi 1967 onwards
13. Member, Executive and Board of Governors, International Telugu Institute. 1976 onwards
14. Member, Executive and General Council, Urdu Akademi 1976-79
15. Secretary, Andhra Saraswatha Parishath Trust, Hyderabad 1972 onwards
16. Vice-President, Surabharathi Samithi, Hyderabad. 1970 onwards
17. Secretary, All India Library Conference, 1954
18. Member, Programmes Advisory Committee, All India Radio, Hyderabad. 1962-68

Education :

Served on the following Committees of the-
A. P. Government.

1. Central Advisory Board of Education, 1952-55
2. Text Book Commitee. 1952-57
3. Selection Committee of Teachers of education Department 1952-57
4. Book Committee of the State Central Library, 1965-75
5. Adult Education Committee, 1952-54
6. Hindi and Sanskrit Committee. 1952-57
7. College Educational Committee. 1952-54
8. Chirman, Telugu Typewriter key Board Committee of the Government of Andhra Pradesh. 1957
9. Secretary, Citizens Committee to oppose Transfer of Osmania Univetsity to Centre. 1952-54

10. Member, Riyasat Scholarship Committee. 1954-56
11. Vice - President, Madresa - e - Aizza High school, Hyderabad. 1964-80
12. Member, Executive Board, Asrifa High School, Hyderabad.
13. Member, Administrative Glossary Committee, A. P. Legislature. 1957-60

University

1. Member, Senate, Osmania University, 1963-75
2. Member, Syndicate, Osmania University, 1963-76
3. Acting vice Chancellar. Osmania University Oct. 1972
4. Acting vice Chancellor, Osmania University August to October 1973
5. Acting Vice Chancellor, Osmania University January & May, 1975
6. Member, Executive Council Hyderabad University.
7. Member, Executivc council, A.P. Open University, Hyderabad.

Journalism

1. Edited "SOBHA" a high class literary magazine for 2 years 1945-48
2. Worked on the Editorial staff of 'GOLAKONDA PATRIKA' a Telugu Daily from Hyderabad 1948-64
3. Edited Gurajada Centenary Souvenir in Telugu and English. 1960-64

4. Edited Tagore Centenary Souvenir in English 1960-61
5. Edited Prapancha Rajya Sarvaswamu 1977
6. Edited Special Sonvenir Second world Telugu Conferenee at Koulalampur. 1981

Poltical Activities


1. Closely connected with the National Movement of Hyderabad State.
2. Member, Andhra Pradesh Congress Committe. 1960-64
3. President of the Youth Congress, Warangal 1945-46
4. Member of the Election Tribunal, Hyderabad-State Congress 1949-50

Co-operation

1. Director, Hyderabad General Co-operative Trading Society, Hyderabad. 1954-58
2. Director, Hyderabad Co-operative General Insurance Society, Hyderabad. 1959-71

Andhra Movement

1. President, Visalandhra Maha Sabha Hyderabad City.
2. Member, Editorial Committee appointed by the Government of Andhra Pradeeh to compile the History of Andhra Movement.
3. Member, Executive Board and Editorial Committee of the History of Freedom Struggle. Government of A.P.



ఆంధ్ర సారస్వత పరిషత్తు నలుభై యేండ్ల పండుగ
ఆర్థికామాత్యులు శ్రీ నాదెండ్ల భాస్కరరావు, శ్రీ దేవులపల్లి రామానుజరావు గారు,
డా॥ కె. కె. రంగనాథాచార్యులు,

Parliament

1. Member Rajya Sabha 1960-62

Other Activities

1. Member, Editorial Committee, District Gazetteers.
2. Vice-President, Andhra Bharathi
3. Member, Managing Committee of Ravindra Bharathi 1962 to 1980
4. Member, Administrative Glossary Committee. Government of Andhra Pradesh. 1957-60
5. Member, Development of Modern Indian Languages Comittee, Government of Andhra Pradesh 1960-67

శ్రీ రామానుజరావుగారికి కృతి యిచ్చిన రచనలు

1. అశ్వఘోషుడు (నాటకము) - డాక్టర్ అరిపిరాల విశ్వం
2. నవోదయం - కీ.శే. బెల్లంకొండ చంద్రమౌళి శాస్త్రి
3. అనపోతు - కీ.శే. సిద్ధయ్యకవి
4. కవితా పుష్పకం - డా॥ దాశరథి
5. తెలుగు హాస్యము - స్వర్గీయ మునిమాణిక్యం నరసింహారావు
6. సాహిత్యకౌముది - శ్రీ గుంటూరు శేషేంద్రశర్మ
7. జయంతి - శ్రీ ముదిగొండ వీరభద్రమూర్తి
8. సాహిత్య సౌరభం - డా॥ జి.వి. సుబ్రహ్మణ్యం
9. జాతక కథలు (ఐదవ భాగం) - స్వర్గీయ స్వామి శివశంకర స్వామి
10. ఉదయం నా హృదయం - డా॥ సి. నారాయణరెడ్డి
11. భాషా చారిత్రక వ్యాసావళి - డా॥ తూమాటి దోణప్ప

12. మందారాలు - శ్రీ పోతుకూచి సాంబశివరావు
13. వైతరణి - కుమారి వాసిరెడ్డి సీతాదేవి
14. అక్షరగుచ్ఛము - డా॥ జ్ఞానానంద కవి
15. ప్రతిజ్ఞ - శ్రీ ఎన్. వి. జగన్నాధం (మాజీ శాసన సభ్యులు)
16. ఫారసీ కవుల ప్రసక్తి - శ్రీ ఎస్. సదాశివ
17. అల్లసాని పెద్దన - డా॥ పల్లా దుర్గయ్య
18. శ్రీనాథుని సాహిత్య ప్రస్థానము - శ్రీ జంధ్యాల జయకృష్ణ ప్రసాద్ బాపూజీ
19. నెలవంక - ఆంధ్ర సారస్వత పరిషత్తు ప్రాచ్య కళాశాల పక్షాన వెలువడిన ప్రత్యేక సంచిక
20. కాంతిపుంజాలు - శ్రీ నీలా జంగయ్య
21. బొమ్మ - శ్రీమతి జోతిర్మయి
22. కావ్యమీమాంస - సంస్కృత అలంకార శాస్త్రానికి తెలుగు అనువాదం (రాజశేఖరుడు) - డా॥ పుల్లెల శ్రీరామచంద్రుడు
23. లజ్జాకిరీటధారిణి - శ్రీమతి ఊటుకూరి లక్ష్మీకాంతమ్మ
24. పుంభావ సరస్వతి శ్రీనాథుడు-శ్రీ పాలకోట రాధాకృష్ణమూర్తి
25. ఉగాదులు - డా॥ బోయి భీమన్న
26. వ్యాసాంజలి - శ్రీ తక్కెళ్ళ బాలరాజు
27. బెజవాడ దుర్గామల్లీశ్వరాలయ శాసనాలు - డా॥ బి.ఎన్. శాస్త్రి.
28. శుక్ల-(శ్రీలేఖ సాహితి)-శ్రీ టి. శ్రీరంగస్వామి సంపాదకత్వం.

మరపురాని మనస్వి

—డా॥ ఎల్లూరి శివారెడ్డి

హైదరాబాదు నగరానికి నడిబొడ్డు ఆబిడ్సు. ఆబిడ్సు నుంచి ఒక రోడ్డు గత చరిత్రను నెమరేసుకుంటూ కాచిగూడా స్టేషన్ వైపు తిన్నగా సాగిపోతుంది. ఆబిడ్సు నుంచి కొంత దూరం సాగిపోతే కుడివైపు ఆంధ్రదేశంలో మహనీయంగా వెలిసిన ఒక సాహితీసంస్థ ఠీవిగా కనిపిస్తుంది. ఆ సంస్థలోనికి ప్రవేశిస్తే ఎడమవైపు మూల గదిలో పత్రికలు పారచూస్తూనో, సందర్శకులతో సంభాషిస్తూనో, గ్రంథవాలోకనం చేస్తూనో, కార్యాలయ వ్యవహారాలను సమీక్షిస్తూనో ఒక విశిష్ట వ్యక్తి దర్శనమిస్తారు. మనిషి పాటిగా ఉన్నా మనస్సు మంచుమలతో పోటీచేసే వ్యక్తి ఆయన. డెబ్బది అయిదు వసంతాలు మీదపడ్డా ఆయన ఉత్సాహం తగ్గలేదు. కార్యదక్షత మొక్కవోలేదు. ఆయన పాదధ్వనులకు, కంఠధ్వనులకు పరువం తగ్గలేదు. వారే డా॥దేవులపల్లి రామానుజరావుగారు.ఆసంస్థే ఆంధ్ర సారస్వతపరిషత్తు.

రామానుజరావుగారు గొప్ప మేధావి. ప్రముఖ సాహితీవేత్త. పత్రికా నిర్వహణదక్షులు. సంస్థా సక్రమ నిర్మాణశీలురు. వాగ్మి. ప్రోత్సాహకులు. సాంస్కృతిక విజ్ఞాన చక్షువులు. తెలంగాణ వైతాళికులు.

వారి జన్మస్థలం ఓరుగల్లు మండలం. 1917 ఆగస్టు 25 నాడు జన్మించారు. హనుమకొండలో పాఠశాల విద్య పూర్తిచేశారు. మద్రాసు విశ్వవిద్యాలయం నుంచి పట్టభద్రులయ్యారు. యల్.యల్.బి. పట్టా

నాగపూరు విశ్వవిద్యాలయం నుంచి పొందారు. ఆ తరువాత శోభ పత్రిక నడిపారు. 1941 లో వరంగల్లులోని శబ్దానుశాసన ఆంధ్ర భాషానిలయానికి కార్యదర్శిగా ఉండి దిగ్విజయంగా రజతోత్సవాన్ని జరిపించారు.

1945 - 46 లో వరంగల్లులో యువజన కాంగ్రెసుకు అధ్యక్షులుగా ఉన్నారు. రామానుజరావుగారి దక్షత గమనించి సురవరం వారు గోలకొండ పత్రికకు ఉప సంపాదకులుగా రమ్మని ఆహ్వానించారు. దానికి అంగీకరించి ఆ పత్రికతో ప్రగాఢ సంబంధం ఏర్పరచుకున్నారు. ఇలాగ తొలిదశలోని ఉత్సాహం తరువాత జీవన ప్రణాళికకు పునాదిగా నిలిచింది. కార్యరంగం హైదరాబాదుకు మారింది. తరువాత వారు ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ కార్యదర్శిగా, అధ్యక్షులుగా, ఆంధ్ర సారస్వత పరిషత్తు అధ్యక్షులుగా, విశ్వవిద్యాలయాలు, తెలుగు అకాడమీ పాలనామండలి సభ్యులుగా, ప్రపంచ తెలుగు మహాసభలకు కోశాధికారిగా, నగర కేంద్ర గ్రంథాలయ సంస్థ సంచాలకులుగా ఎంతటి సేవలందించారో అందరికీ తెలుసు. వారు నిర్వహించిన తక్కిన పదవులు, బాధ్యతలు అపారం. ఇక్కడ ఏ సంస్థ పచ్చగా ఉన్నా అందులో రామానుజరావుగారి హస్తోదకం ఉంది. వారి సూచనల అభిసేచనం ఉంది.

రామానుజరావుగారు రచించిన గ్రంథాలు, సంపాదకత్వ బాధ్యతలు స్వీకరించిన గ్రంథాలు ఇరువైఅయిదు దాకా ఉన్నాయి. వారి రచనలో వైవిధ్యం ఉంది. పచ్చతోరణం వంటి కవితా రచనలో 'ప్రకృతి రామణీయకము, పడతి కామనీయకము సరళ రమ్యముగా చిత్రితమైనవని' అని ఆచార్య సి. నారాయణరెడ్డిగారు అన్నారు. వారి రచనలకు ప్రతిధ్వనులున్నాయి కాని వారి రచనలలో ప్రతిధ్వనులుండవు. వారి సారస్వత నవనీతము సాహిత్య విమర్శ అనుభవ

సంపుటి. తెలుగుసీమలో సాంస్కృతిక పునరుజ్జీవనము తెలంగాణ పడ్డ పాట్లకు, పొందిన వెన్నుపోట్లకు సాహితీరూప దర్పణం. వారి "యాభై సంవత్సరాల జ్ఞాపకాలు" చదివి ఆనందింపదగినవి. అధ్యయనంచేసి ఆలోచింపదగినవి. వారి రచనలు స్వయం సమగ్రాలు. వారి అభ్యుదయ దృక్పథానికి సూచకాలు. వారి విజ్ఞానానికి కేతనాలు.

రామానుజరావుగారి వ్యక్తిత్వానికి సమయపాలన, నియమ పాలన రెండు కళ్లు. వారు సాంస్కృతిక రంగంలో అడుగువేసిన నాటినుంచి చేపట్టిన ప్రతి పని నిర్ణీత సమయ పరిధిలో పూర్తి కావల సిందే. ఏ పనికైనా సమయపాలనదక్షులైన వ్యక్తుల్నే నియమిస్తారు. రామానుజరావుగారికి నియమాలంటూ ప్రత్యేకంగా ఏమీలేవు. క్రమ శిక్షణే వారి నియమం క్రమ శిక్షణలో వారు మధ్యందిన మార్తాండులు. సంస్థల వినాశనానికి క్రమశిక్షణ రాహిత్యం అసలు కారణం అని అంటుంటారు. ఈ విషయం చాలామందికి తెలిసినా పాటించి, ఆచ రింప జేయటంలో శ్రద్ధ చూపరు. కాని ఈ విషయంలో వీరికి గట్టి పట్టుదల. ఉత్తరాలకు బదులు రాయటం మొదలుకొని, విశ్వవిద్యాలయ పాలనామండలి సభ్యులుగా వ్యవహరించే విషయందాకా ఏ విషయం తీసుకున్నా వారికి క్రమశిక్షణలో రాజీలుండవు. సంస్థలకు సంబం ధించిన సొమ్మును ఖర్చు చేయడంలో మాడపాటి వారి పద్ధతిని ఎన్నో సార్లు గుర్తు చేస్తారు. వారికి ప్రమాణాల మీదనే కాని పరిమాణాల మీద విశ్వాసం లేదు.

దేవులపల్లివారు సురవరం ప్రతాపరెడ్డిగారికి ఆప్తులు. ఏ సభకు వెళ్ళినా సందర్భం చూసుకుని సురవరం వారి పేరు ప్రస్తావించక మానరు. ప్రతాపరెడ్డిగారు మరణించి సుమారు నలభైయేళ్ళు దాటాయి. వారి రచనలు చాలావరకు అలభ్యం. సురవరం ప్రతాపరెడ్డిగారి

ప్రథమ కుమారులు శ్రీ యస్. యన్. రెడ్డిగారి సహకారంతో రామా నుజరావుగారు ప్రతాపరెడ్డిగారి గ్రంథాలు పన్నెండింటిని 'సురవరం ప్రతాపరెడ్డి వైజయంతి' పేరిట ముద్రించటంలో అత్యంత శ్రద్ధ తీసు కున్నారు. రెండేళ్ళ సమయంలో ఈ పన్నెండు పుస్తకాలు ప్రచురించ టానికి వారి సమయపాలన వ్యగ్రత మొదటి కారణం. ప్రతాపరెడ్డి గారికి వారు చేసిన సేవ విలువకట్టరానిది. ప్రతాపరెడ్డిగారి పేరిట ఏదైనా ఎవరైనా చేస్తే అది వారే చేశారు.

దేవులపల్లివారి అభిరుచులు, ఆశయాలు ఉదాత్తమైనవి. వారి వ్యక్తిత్వానికి వన్నె తెచ్చింది అపార శేముషీ వైభవం. ఎన్నో విష యాలు వారు చెబుతూ ఉంటే ఎదుట ఉన్నవారు చకితులై వింటారు. భారత జాతీయ నాయకుల వ్యక్తిత్వాలను తెలిపే సంఘటనలు, సూక్తులు పుంఖానుపుంఖంగా ఉదాహరిస్తూ గంటలకొద్దీ సంభాషిస్తారు. గత చరిత్ర గమనాన్ని స్పష్ట రేఖలతో వివరిస్తారు. నేటి రాజకీయ సాంస్కృతిక విషయాలను విశ్లేషించి సమదృష్టితో విషయాల్ని బేరీజు వేస్తారు. సాహిత్య విషయాల్లో వారి అభిప్రాయాలు నిగ్గు దేలినవి. పండితులకే పరిమితమైన ఛందో వ్యాకరణాలంకార విష యావగాహన ఒక్కటే విమర్శకాదని వారి అభిప్రాయం. మనో వికాసానికి, జాతి జాగృతికి, పేదల దళితుల ఉద్ధరణకు పనికి వచ్చే అంశాల ప్రాముఖ్యాన్ని ఒత్తి చెబుతారు. తెలుగు విమర్శకుల్లో రాళ్ళపల్లి వారంటే అమితమైన అభిమానం. రాళ్ళపల్లివారి వ్యక్తిత్వం వారిని ఎంతగానో ఆకర్షించింది. వారిలాగా విషయతత్వం చెప్పటం విమర్శ పరమార్థమని రామానుజరావుగారి అభిప్రాయం. రచనల వెనుక భిత్తికగా నిలిచిన చారిత్రక, సాంస్కృతిక విషయాల్ని వారు అనుశీలించి చూపుతూ విషయాలు వివరిస్తారు. ప్రాచీన సాహిత్యాన్ని గురించి చేసే ప్రసంగాల్లో అందులోని చారిత్రక విషయాన్ని విశ్లేషించి చూపుతారు. ఆంగ్ల, హిందీ, ఉర్దూ రచనలు అధ్యయనం చేయటంవల్ల

వారి దృష్టి బహు విషయాల్ని ప్రస్తరించి చూపుతుంది. వారికి సంస్కృత సాహిత్యాన్ని గురించిన సమ్యగవగాహన ఉంది.

ఏ విషయం మీదనైనా సాధికారంగా, సందర్భోచితంగా ప్రసంగించడంలో వీరికి ప్రత్యేకత ఉంది. ప్రతి చిన్న సంఘటనకు సంబంధించిన తేదీలను కూడా గుర్తుంచుకొని విషయాన్ని సమగ్రంగా ఉదహరిస్తారు. రామానుజరావుగారి కంఠధ్వనికికూడా ప్రత్యేకత ఉంది. వారు వక్తృ కంఠీరవులు. వారి గళానికి ఠీవి, భాషకు దర్జా ఉన్నాయి. ఈనాడు తెలుగు రాజధానిలో విద్వత్సభలకు, సాంస్కృతిక సభలకు అధ్యక్షులుగానో, ముఖ్య అతిథులుగానో సారథ్యం వహించే వారిలో డా॥ రామానుజరావుగారు, ఆచార్య సి. నారాయణ రెడ్డిగారే అగ్రేసరులు. రామానుజరావుగారి భాషణలో విషయ ప్రాధాన్యం, విషయ వివేచనం సరిపాళ్లలో ఉంటాయి. వారి ఉచ్చారణలో ఒక సౌందర్యం ఉంది. ప్రామాణిక తెలంగాణా భాషకు ప్రథమోదాహరణం వారిదే. తెలంగాణ తెలుగులోని తీయదనం, నుడికారపు సొంపు వారి భాషలో తొణికిసలాడుతుంది. వారు ఏ గ్రంథాన్ని గురించి అభిప్రాయం ఇచ్చినా దాని నేపథ్యాన్ని తెలుపుతారు. ఆంగ్లంలో అనర్గళంగా భాషించగలరు. ఉర్దూలో ఉరకలువేసే ప్రసంగాలు చేయగలరు. తెలుగులో తేటగా ఉపన్యసించగలరు. వారు ఎంత చదువుతారో అంతకన్న ఎక్కువగా ఆలోచిస్తారు. ఏ రాజకీయ సిద్ధాంతాలకు వారు బద్ధులు కారు. విశాల మానవీయ దృక్పథం వారిది. నేటి సమస్యలేవో వారికి తెలుసు. వాటికి పరిష్కారాలేవో తెలుసు. నేటి సామాజిక రుగ్మతలను గురించి ఆవేదన చెందుతారు. అన్ని స్థాయిలలోని అవినీతిని తలచుకొని బాధపడతారు. విద్యాసంస్థలలోని ప్రమాణాలను గురించి సాధికారంగా మాట్లాడగలరు. ఉస్మానియా విశ్వవిద్యాలయం, సార్వత్రిక విశ్వవిద్యాలయం, తెలుగు విశ్వవిద్యాలయాల పాలనా మండలులలోని అనేక సంవత్సరాల అనుభవం

ఆ విశ్వవిద్యాలయాలకు వారిచ్చే సూచనలలో, సలహాల రూపంలో చక్కని ఫలితాలనిస్తున్నది. వారు ఏ సంస్థలో ఉంటారో అక్కడ ఆ సంస్థకు ఎంతో ఉపకారం జరుగుతుంది. వారి సేవను మన ప్రభుత్వం ఈనాటికి ఎంత ఎక్కువగా వినియోగించుకోగలిగితే అంత ఉపకారకం, ప్రయోజనకరం. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ చేసిన పని రామానుజరావుగారి దక్షతకు గొప్ప దృష్టాంతం.

రామానుజరావుగారికి సమకాలికులైన తెలుగు పండితులు, కవులందరితో గాఢా పరిచయం ఉంది. విశ్వనాథ సత్యనారాయణ గారు రామానుజరావుగారి అభిమాని. రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ గారంటే వీరికి అంతులేని అభిమానం. గంటల కొలది వారితో సంభాషిస్తూ రామానుజరావుగారు పరవశించేవారు. వట్టి గాలిని పోగు చేసే మాటలు వీరికి నచ్చవు. ఇచ్చకాలకు బహుదూరం. సత్యాన్ని కచ్చితంగా చెప్పడంలో, హితాన్ని మృదువుగా చెప్పటంలో సవ్యసాచిత్వం వీరిది. ప్రముఖ ఉర్దూ పత్రికా సంపాదకులు శ్రీ ఆబిద్ అలీఖాన్‌గారు వీరికి ఆప్తమిత్రులు. హైదరాబాదులోని ప్రజాస్వామిక దృక్పథం కలిగిన ముస్లిం ప్రముఖులకు ఆత్మీయులు వీరు. వారికి చెందిన అనేక సంస్థలలో వీరు సభ్యులుగా, ఆహూతులుగా ఉంటారు. ఉర్దూ భాషలోని ఎన్నో విషయాలు వీరికి వాచో విధేయాలు. ప్రసిద్ధ రచయిత్రి డా॥ జీనత్ సాజిదాగారు వీరితో కలిసి ఒక నవలను తెలుగులోనికి అనువదించారు. శ్రీ ఆబిద్ అలీగారు ఒకచోట వీరిని గురించి వ్రాస్తూ 'Shri D. Ramanuja Rao is a shing example of the world famous "Hyderabad Culture" - aculture of love and tolerance with all communities; of a mity and frendship; of affection and thoughfulness" అని వివరించారు. ఒకోతరం, ఒకోజాతి కొందరు మహావ్యక్తుల విజ్ఞానకాంతిలో జీవితంలోని విలువైన విషయాలను గ్రహించటం జరుగుతుంది.

ఆ మహావ్యక్తులు ఏదిచేసినా సమాజం కోసమే. వారిని వరించే పదవు లుంటాయి. వారు పొందదగిన సంపదలుంటాయి. వారు నిర్మించుకో గలిగిన సుఖ సౌధాలుంటాయి. కాని ఈ అన్నింటినీ కాదనుకొని, జాతికి, భాషా సాహిత్యాలకు, సంస్కృతికి తమ జీవితాలు వెచ్చించిన వారే త్యాగజీవులు. ధన్యజీవులు. ఈనాటి తెలుగువారిలో అలాంటి ప్రముఖులలో అద్వితీయులు డా॥ దేవులపల్లి రామానుజరావుగారు.

రామానుజరావుగారు పరిషత్తుకు చేసిన సేవ ఆంధ్రులు మరువరానిది. తెలంగాణ సాంస్కృతిక పునరుజ్జీవనానికి పరిషత్తు ప్రమాణసహితమైన సేవ చేసింది. నిజాం పాలనలో గుడ్డి దీపంలాగా ప్రకాశించే తెలుగును ఉజ్జ్వలంగా వెలిగే జ్ఞాన సూర్యునిలా తీర్చిదిద్దిన ఘనత పరిషత్తుకు దక్కుతుంది. పరీక్షలు నిర్వహించటం, సాహిత్య ఉపన్యాసాలు ఏర్పాటు చేయడం, ఉపన్యాసాలను ఉత్తమ గ్రంథాలను ప్రచురించటం, పండిత శిక్షణ కళాశాలను, ప్రాచ్య కళాశాలను నిర్వ హించడం, పరిశోధకుల కోసం ఒక గ్రంథాలయాన్ని నడపడం పరిషత్తు ఆశయాలు. ఈ పని కొన్ని దశాబ్దులనుంచి సక్రమంగా నిర్వ హించటం సులభమైన పనికాదు. పరిషత్తు వెన్నెముక రామానుజ రావుగారు. వారి నిరంతర కృషి వల్లనే ఇవన్నీ సక్రమంగా సాగి పోతున్నాయి. పరిషత్తు అభ్యుదయానికి తమ జీవితంలోని సుఖాల్ని ధారపోశారు.

వారు తెలంగాణాలో 'తెలుగు దీపం ఆరిపోకూడదనే ఆశయంతో, భాషాస్రవంతి ఇంకిపోరాదనే తపనతో' భాషాభివృద్ధి ఉద్యమంలో పాల్గొన్నారు. అయితే పాండిత్య భేషజం వైపు వారి బుద్ధి ప్రసరించలేదు. వీరేశలింగం, గురజాడ, రాయప్రోలు, శ్రీశ్రీలు వారి మనస్సును ఆకట్టుకున్నారు. "తిక్కన రచన - లేదా - కవిత్రయ భారతం, చదివితే చాలు, ప్రబంధాలు అధ్యయనం చేయవలసిన అవసరంలేదు" అని వారి అభిప్రాయం. అయితే ప్రబంధాలను తిర స్కరిస్తూ ఆ మాట అనరు. ప్రబంధాలనుంచి ఎన్నో పద్యాలు వారు

ఉదాహరిస్తూనే ఉంటారు. ఇది వారి ఆర్జవమైన అభిప్రాయం. వారి అభిప్రాయాలన్నీ స్వచ్ఛందంగా ఆర్జవంగా ఉంటాయి. 'హింసాత్మక ఉద్యమాలు నేను ఇష్టపడను' అని అంటారు. "కవి స్వేచ్ఛగా, స్వతంత్రంగా ఆలోచించాలి. గుండె పలికిన పలుకులు చెప్పగలగాలి" అని భరోసా యిస్తారు.

రామానుజరావుగారి జీవితాన్ని ప్రభావితం చేసినవాళ్ళున్నారు. వారికి నచ్చిన పుస్తకాలు ఉన్నాయి. వారి రుచిరాభిరుచిని గురించి తెలుసుకోవటానికి శ్రీ ఆచార్య తిరుమల, శ్రీమతి సీతాశరచ్చంద్రగారు నిర్వహించిన "ముఖాముఖి"లో నుంచి ఉదాహరిస్తాను:

"నేను అఖిల భారత స్థాయి నాయకులచే ప్రభావితమైనాను. ఉదాహరణకు గాంధి యుగానికి చెందిన నెహ్రూ, మౌలానా అబుల్ కలాం ఆజాద్, ఆచార్య నరేంద్రదేవ్, గోఖలే, తిలక్, ప్రేంచంద్, గాలిబ్ ప్రముఖులు నా సాహిత్య ప్రజా జీవితాల్ని ప్రభావితం చేసారు."

"భారతం, భాగవతం, శతక వాఙ్మయం-ప్రత్యేకంగా వేమన, తాళ్ళపాక కృతులు, త్యాగరాజ కృతులు, క్షేత్రయ పదాలు, వీరేశ లింగం, చిలకమర్తి, పానుగంటివారి కొన్ని రచనలు, గురజాడవారి ముత్యాలసరాలు, కన్యాశుల్కం, రాయప్రోలువారి తృణ కంకణం, ఆంధ్రావళి, తెనుగుతోట, విశ్వనాథవారి ఏకవీర, కిన్నెరసాని పాటలు, వేయి పడగలు, మహాప్రస్థానం, చలం కథలు, ముద్దుకృష్ణ సంకలనం వైతాళికులు. ఉన్నవగారి మాలపల్లి — తెలుగువాళ్ళు తప్పక చదువాల్సిన పుస్తకాలు."

వారితో సంభాషిస్తేచాలు ఉత్తేజాన్ని పొందవచ్చు. వారి జీవితం ఎంత గొప్పదో రచనలంత గొప్పవి. ఈనాడు తెలుగుభాషా సాహిత్యాలకు పెద్దదిక్కు డా॥ రామానుజరావుగారు. వారు ఉదాత్తజీవితానికి ప్రతీక. సంస్కృతి - సాహిత్యపోషణకు ఆధారభూమిక. వారు సౌజన్యభూషితులు - సంస్కార విభూషితులు.

ఒక నిండు మనిషిని గురించిన మదింపు

మరుపూరు కోదండ రామరెడ్డి

మూర్తి ఎంత చిన్నదో, కీర్తి అంత పెద్దదై, పండు వెన్నెల గాయించిన బహుముఖ ప్రజ్ఞాశాలి ఈ తెలంగాణా తెనుగు బిడ్డ - ఈ దేవులపల్లి వారు. ఈ వివిధ గుణ దీపితుని సమగ్ర చరిత్ర చిత్రీకరణమే సాహితీ మిత్ర మండలి వారి (టి. శ్రీరంగస్వామి) ఈ లఘులేఖనము.

ఇది తెలంగాణా సమష్టి సమగ్ర చరిత్ర. తెలంగాణా రాజకీయ సాంఘిక సాంస్కృతిక సాహిత్య ఉద్యమాలలోను, ఆ తర్వాత సమగ్ర ఆంధ్రోద్యమాలలోను రామానుజరావుగారు పెనవేసుకొని పోయి ఉన్నారు. ఇందు ఈయన వట్టి ప్రేక్షకుడు గాదు, కార్య నిర్వాహకుడు. వీరు ఈ అన్ని రంగాలలో చేయి తిరిగిన సవ్యసాచి. పాత్రికేయుడుగా, భావకుడైన కవిగా, ఉపన్యాసకుడుగా, సంస్థా పాలకుడుగా, విద్యాశాఖ నిర్వాహకుడుగా - తాను పాల్గొన్న ప్రతి పనిలో తమ సామర్థ్య కీర్తిని ప్రస్ఫుటంగా ముద్రించినారు. తమ కవితా సంకలనము 'పచ్చతోరణము'ను గుణ గౌరవం చేత పచ్చల తోరణంగా చేసినారు.

ఆంధ్ర సారస్వత పరిషత్తు వీరి నిర్మాణ శక్తికి శాశ్వత కీర్తి స్తంభము; ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ చరిత్ర వీరి కార్య నిర్వాహక శక్తి నివేదిక.

ఇన్నిట ఆరితేరినా తల తిరుగని వినయభూషణుడు. ప్రతి వారిని - కుల మత వివక్షత లేకుండా ఆదరించి ఆదరింపబడు

తున్నారు. ఆత్మగౌరవము సంగతి ఎరిగినవాడు కాబట్టే ఎదిటివారి గౌరవమును మాన్యపరచగలుగుతున్నారు. ప్రతివాని పట్ల చెలిమి చలువను ప్రసరింపజేసి హాయిని కూర్చగలుగుతున్నారు. ఈయన స్నేహము దిన దిన ప్రవర్ధమానము. స్వయంగా, నా హైదరాబాద్ సాహిత్య వ్యాసంగంలో, ఈయన ఆస్థానము - ఆ పరిషత్తు నాకు చలువ పందిలి, నా సాహిత్య జీవితంలో ఇది సువర్ణ ఘట్టము.

'తెలంగాణా' కీర్తి నిజాముల కాలంలో కొంత మరుగైనా, తీర ప్రాంతానికి ఎందునూ తీసిపోదు - పేరుబడ్డ గడ్డ! కాకతీయుల పాలన ప్రజా శ్రేయోరాజ్యమైనది. కాకలు తీరిన కవులు - పోతన, సోమన, బుద్ధారపు మల్లారెడ్డి, వేములవాడ భీమన, సంస్కృత వాఖ్యాతృ చక్రవర్తి మల్లినాథ, కన్నడ కవిత్రయం - పంప, రన్న (వైశ్య) తెలంగాణావారు, పొన్నడు వేంగి ఆంధ్రుడు.

ఆధునిక యుగంలో ప్రతి రంగములో 'నాయకమణులకు' కొదువలేదు. ఈ నేపథ్యం రామానుజరావుగారికి అనుగా నిలిచి ఉన్నది.

ఇక ప్రస్తుతం శ్రీరంగస్వామిగారి లఘు లేఖనం :-

ఈ రచన చిన్నదైనా, దేవులపల్లి వారి జీవిత వివిధ విషయాలను రచనా నైపుణ్యం మెరసేటట్లు వ్రాసినారు. విషయాలు క్రిక్కిరిసి ఉన్నవి. ఇక ఆ బిగువులో కొత్తగా సూదిమొనగూడ దూరదు. రావుగారి నేర్పును వన్నెకు దెచ్చిన ఓర్పును కండ్లకు గట్టినట్లు విప్పి చెప్పినారు. ఆయన ప్రాగల్భ్యము కొంత సమగ్రంగానే వర్ణింపబడియున్నది. ఇందలి విషయ గురుత్వమును పెంచను భాష దీపిస్తూ, రచయిత సౌజన్యాన్ని చాటుతున్నది. ఈ వ్రాత రావుగారిని ఒక నిండు మనిషిగా తీర్చిదిద్ది నిలబెట్టుతున్నది.

ప్రతి రంగంలో లెక్కకు ఎక్కిన ప్రతి వ్యక్తికి పరిచయం రావుగారి స్నేహశీలానికి ఒక తేజోరేఖ! ఇది శ్రీరంగస్వామి కృషికి ప్రతిబింబిస్తున్నది. రామానుజరావుగారి గూర్చి పరిశోధించే వారికి ఇది అకరము.

ఇక దేవులపల్లివారు. అన్నిటా కోరదగినది దైవ కటాక్షం తప్ప అన్యమేమీలేదు. పుత్ర పుత్రీ సౌభాగ్యంతో హాయిగా కీర్తితో మనుచున్నారు.

శ్రీ దేవులపల్లి రామానుజరావుగారు పత్రికారచయిత

గడయారం రామకృష్ణశర్మ

ఆత్మీయులు శ్రీ దేవులపల్లి రామానుజరావుగారు చేసిన సర్వతో ముఖ సాహిత్య సేవలో ఒక భాగమైన పత్రికారంగ కృషిని సంక్షిప్తముగా పరిచయము చేయడమే ఈ రచనోద్దేశము. శ్రీ రావుగారు పత్రికా రచనలో ప్రవేశించిన నాడు తెలంగాణా ప్రాంతంలో సాగుతున్న నిరంకుశ నిజాంపాలన, ప్రజలపై సాగుతున్న అత్యాచారాలు, తెలుగుభాషా దీనదశలను గూర్చి జ్ఞాపకం చేసుకోవడం చాలా అవసరం.

తెలుగు భాషనూ, సాహిత్యాన్నీ అభిమానించి పోషించిన కుతుబ్షాహీ నవాబు పాలన అంతరించి 18 శతాబ్దిలో ఆసఫ్జాహీ నవాబుల పాలన హైదరాబాదు రాజ్యంలో ప్రారంభమైంది. ఈ వంశీయులలో ఏడవవాడైన చివరి నవాబు మీర్ ఉస్మానలీఖాన్ సింహాసన మెక్కిన నాటినుంచే ప్రాంతీయ భాషలను అణగద్రొక్కే ప్రయత్నం మొదలైంది. అప్పుడు హైదరాబాదు సంస్థానంలో కన్నడ ప్రజలు 3 జిల్లాల్లో, మరాఠీ ప్రజలు 5 జిల్లాల్లో, తెలుగు ప్రజలు 8 జిల్లాల్లో ఉండేవారు. ఆనాడు ప్రజలకు ఏ సౌకర్యమూ లేనట్లే చదువుకొనే అవకాశాలూ లేవు. తాలూకా కేంద్రంలో ఒక మాధ్యమిక పాఠశాల (అప్పర్ ప్రైమరీ స్కూలు), జిల్లా కేంద్రంలో ఒక ఉన్నత పాఠశాల (హైస్కూలు), అక్కడక్కడ పెద్ద పల్లెల్లో ప్రాథమిక పాఠశాల

లను మాత్రం ప్రభుత్వం నడుపుతూ ఉండేది. ఈ పాఠశాలల్లోగూడ చదువు ఉర్దూభాషలోనే సాగుతూ ఉండేది. ప్రజలందరూ గత్యం తరం లేక ఉర్దూనే చదువుకొనేవారు. ఉర్దూ చదివితేనే ఉద్యోగాలు. ఎంత చదివినా ప్రభుత్వ ఉద్యోగాలు 80% ముస్లిములకే లభించేవి. ఇది ఆనాటి ప్రభుత్వ విధానము.

పరిస్థితులనుబట్టి ప్రజలుగూడ ప్రభుభక్తి పరాయణులై తమ ఇండ్లలో భార్యాబిడ్డలతోగూడ ఉరుదూలో మాట్లాడేవారు. తెలుగుభాష వాడుకలో ఉన్నా ఉరుదూ మాట్లాడడమే ఘనత అని భావించే మనస్తత్వం మనవాళ్ళది. వేషధారణగూడ పురుషులకు బిగుతు పైజామా, షేర్వాణి, తలపైన కుచ్చుటోపి. అచ్చంగా ముస్లింలవలె ఉండేవాళ్ళు.

ఇంత దుస్థితిఉన్నా జిల్లాలలో అక్కడక్కడ సంస్కృతాంధ్ర పండితులు కొందరైనా ఉండేవారు. గద్వాల, ఆత్మకూరు, వనపర్తి, గోపాలపేట, కొల్లాపురం, సురపురం, దోమకొండ మొదలైన కొన్ని హిందూ రాజ సంస్థానాలు పండితులను పోషిస్తూ దూర ప్రదేశాల నుంచి వచ్చే కవి పండిత గాయక నటాది కళాకారులను సన్మానిస్తూ సాంస్కృతిక సేవ చేస్తుండేవి. ఆ సంస్థానాలలో సన్మానం పొందవలె ననే పట్టుదలతో స్వయంకృషితో కొందరైనా విద్వాంసులై మహా కవులై ఉత్తమ గ్రంథాలు రచిస్తూ తెలుగుతల్లిని ఆరాధిస్తూ తెలుగు భాషాదీపం కొండెక్కకుండా కాపాడినారు. ఇది తెలంగాణ అదృష్టము.

అప్పటికి ఇంకా హైదరాబాదులో ఉస్మానియా యూనివర్సిటీ పుట్టలేదు. మదరాసు యూనివర్సిటీకి అనుబంధముగా 'నిజాం కాలేజి' అవతరించింది. అందులో ఇంగ్లీషుతోపాటు సంస్కృతం - ప్రాంతీయ భాషలు తెలుగు - కన్నడం, మరాటీ భాషలకు గూడ తగిన స్థానం

లభించింది. అందులో చేరి విద్యాభ్యాసం చేసిన యువకులలో మాతృ భాషాభిమానము, తమ సాహిత్యంపై ఆదరణ పెరిగింది. ఆవిధంగా ఆనాటి నిజాం కళాశాలలో చదివి సుప్రసిద్ధులైన వారిలో శ్రీ రామానుజ రావు గారు కూడ ఒకరు. అప్పుడే వారికి తెలుగు సాహిత్యంలో గట్టి పునాదులు పడినాయి.

తరువాత వారు నాగపూరులో యల్. యల్. బి. చదువుకున్న రోజులలో అక్కడి మహారాష్ట్రుల మాతృ భాషాభిమానము వీరిని ఉత్తేజ పరచినది. ప్రాచీన నవీన ఆంధ్ర సాహిత్య ప్రక్రియలను శ్రద్ధగా పఠించి చక్కని పరిజ్ఞానమును సంపాదించినారు. ఒక రచయిత స్థాయికి ఎదిగినారు. నిజాం కాలేజి విద్యార్థిగా ఉన్నపుడే వీరికి హైదరాబాదు నగరంలోని ప్రముఖ ఆంధ్ర నాయకులతో సన్నిహిత పరిచయము కలిగింది. ఆ ప్రసిద్ధ వ్యక్తులు ఆంధ్ర పితా మహ మాడపాటి హనుమంతరావు గారు, సురవరం ప్రతాపరెడ్డిగారు, మందుముల నరసింగరావు గారు. ఈ ముగ్గురూ న్యాయవాదులు. పత్రికా సంపాదకులు. మాడపాటి వారు "ముషీరె దక్కన్" అనే ఉర్దూ దినపత్రికకు, సురవరం వారు "గోలకొండ పత్రిక" అనే తెలుగు అర్ధవార పత్రికకు, మందుముల వారు "రయ్యత్" అనే ఉరుదూ దినపత్రికకూ సంపాదకులుగా ఉండిరి. వారి ప్రోత్సాహము రామానుజరావు గారిని పత్రికా రచయితను చేసింది. 1939 లో రావుగారు కొందరు ఆంధ్ర నాయకులను గూర్చి వాక్చిత్రాలు (స్కెచెస్) రచించి గోలకొండ పత్రికలో ప్రకటించిరి. అపూర్వము లైన ఆ వ్యాసాలు అప్పటి పెద్దల ప్రశంసలకు పాత్రమైనాయి.

మందుముల నరసింగరావుగారి ప్రోద్బలంతో రామానుజరావు గారు 'రయ్యత్' పత్రిక సంపాదకీయాలను చక్కని తెలుగులో అనువ దించి ప్రకటించినారు. మందుముల వారి సంపాదకీయాలు ముట్నూరి

కృష్ణారావు గారి 'కృష్ణా పత్రిక' సంపాదకీయాలతో సమానంగా ఉండేవి. ప్రజలను ఉద్దీపింప జేసేవి.

ప్రసిద్ధ ఆంగ్ల పత్రికా సంపాదకులు (దక్కన్ క్రానికల్) శ్రీ బుక్కపట్నం రామానుజాచారి గారు 1942 లో "తెలంగాణా" అనే పేరుతో ఒక తెలుగు దినపత్రికను ప్రారంభించినారు. ఆయనే సంపాదకుడు. అప్పుడు రామానుజరావు గారు నాగపూరులో 'లా' చదువుతున్నారు. ఆ పత్రికలో వరుసగా తెలుగులోని నవ్య సాహిత్యమును గూర్చి రచయితలను గూర్చి చక్కని విమర్శ వ్యాసాలు వ్రాసి ప్రకటించినారు. ఆ రచనలే తరువాత "నవ్యకవితా నీరాజనము" అనే పేరుతో గ్రంథ రూపము దాల్చినాయి.

నిజాం ప్రభుత్వ దమననీతి క్రమక్రమంగా తీవ్ర స్థాయికి చేరింది. సంస్థానంలో "అంజుమనె ఇత్తెహాదుల్ ముసల్మాన్" అనే మతోన్మాద సంస్థను 'బహద్దూర్ యార్ జంగ్' స్థాపించినారు. అది ముస్లిం అధికారుల అండదండలతో త్వరలోనే రాజ్యమంతటా వ్యాపించింది. ఎందరో హిందువులు ముస్లిం లైనారు. మతంలో కలవని వాళ్ళను చిత్రహింసల పాలు జేసినారు. ప్రభుత్వ అసమర్థత నిర్లక్ష్యాలవల్ల ప్రజలు ఏ సౌకర్యాలకు నోచుకోక నానా అవస్థలు పడుతున్నారు. వాళ్ళకు ప్రాథమిక స్వత్వాలులేవు. పత్రికల్లో వాస్తవాలు వ్రాయడానికి వీలులేదు. సభలు సమావేశాలు ప్రభుత్వ అనుమతి లేనిదే జరుపుకోరాదు. తెలుగు భాషకు ఏ విధమైన ప్రోత్సాహం లేదు. ఇంక సాహిత్యం సంగతి చెప్పనక్కరలేదు. 1926 ప్రాంతంలో సురవరం ప్రతాపరెడ్డిగారి ప్రోద్బలంతో ప్రారంభించబడిన "సుజాత" అనే మాసపత్రిక P.N. శర్మగారి సంపాదకత్వంలో 3 సంవత్సరాలు సేవచేసి అంతరించింది. సాహిత్య వ్యాసంగానికి ఏ అవకాశాలూ లేవు. ఈ పరిస్థితులలో రామానుజరావుగారు వరంగల్లు

నుంచి 1945 లో ధైర్యంగా "శోభ" మాసపత్రికను ప్రారంభించి నారు. అది సాహసకృత్యమని చెప్పవచ్చు. ఆ పత్రిక ప్రసిద్ధ రచయితల ఆదరాభిమానాలు పొందింది. ఒక సంవత్సరం నడిచి పరిస్థితులు బాగులేనందువల్ల ఆగిపోయింది. మరల 1948 లో సంస్థానం మీద "పోలీసుచర్య" జరిగి స్వతంత్రమైన తరువాత పునరుద్ధరించబడి రెండేండ్లు సేవచేసి అంతరించింది. అప్పుడే నేనుకూడ ఎన్నడో ఆగిపోయిన "సుజాత" పత్రికను పునరుద్ధరించి 3 సంవత్సరాలు నడిపి మానుకున్నాను. ఆనాటి పరిస్థితులట్లాంటివి.

అర్ధవారపత్రికగా ఉండిన 'గోలకొండపత్రిక' 1946 లో వనపర్తిరాజా రామేశ్వరరావుగారి ప్రోత్సాహముతో దినపత్రికగా మారినది. ప్రధాన సంపాదకులు సురవరం ప్రతాపరెడ్డిగారే. సహాయ సంపాదకులుగా నూకల నరోత్తమరెడ్డిగారిని రాజాగారు చేర్చిరి. ఈ ఇద్దరూ రామానుజరావుగారికీ నిజాం కళాశాలలో సహవిద్యార్థులు.

పత్రిక దినపత్రికగా మారినప్పటి నుంచి దిన దినగండాలు గూడా ప్రారంభమైనాయి. ముసల్మీన్ సంస్థ అధ్యక్షుడు నవాబ్ బహద్దూర్ యార్‌జంగ్ చనిపోయి ఖాసిం రజ్వీ నాయకుడైనాడు. అతడు రజాకార్ అనే తీవ్రవాదులతో రాజ్యంలో అత్యాచారాలు చేయించ మొదలుపెట్టినాడు. ప్రభుత్వము దాన్ని అణచలేని స్థితి ఏర్పడింది. ప్రభుత్వ నిరంకుశ నీతి ఎక్కువైంది. పత్రికల్లో ప్రకటించే వార్తలూ, సంపాదకీయాలు ప్రభుత్వం సెన్సారు చేసేది. హిందూ ప్రజలమీద దౌర్జన్యాలు, దోపిడీలు, హత్యలు, మానభంగాలు నిత్య కృత్యాలైనాయి. 1947 లో భారతదేశం స్వతంత్రమైంది. దాదాపు 600 సంస్థానాలు భారత యూనియన్‌లో కలిసిపోయినాయి. కాని నిజాం నవాబు యూనియన్‌లో చేరక స్వాతంత్ర్యం ప్రకటించినాడు. రాజ్యంలో స్టేట్ కాంగ్రెస్ స్వాతంత్ర్య సమరాన్ని ఉధృతంచేసింది.

రజాకార్లు విజృంభించి అరాజకాన్ని సృష్టించినారు. హిందూప్రజలు హింసలు భరించలేక తమ సరిహద్దులలో ఉండే యూనియన్ భాగాలకు వలస వెళ్ళినారు. ఇంత జరుగుతున్నా పత్రికల్లో వాస్తవాలు ప్రకటించడానికి వీలులేదు. సురవరంవారు సంపాదకీయాలు మానుకొని ఖాళీ స్థలముతో ఒకటి రెండు ప్రాచీన శతక పద్యాలను వ్రాసి ప్రకటించేవారు. సంపాదకీయాలు లేకున్నా ఆ పద్యాలు పరిస్థితిని తెలుపుతుండేవి. ఉదాహరణకు ఒక పత్రికలో సంపాదకీయానికి బదులు ఈ పద్యం వచ్చింది. "అధరము కదలియు కదలక, మధురములగు భాషలుడిగి మౌనవ్రతుడౌ, అధికార రోగపూరిత బధిరాంధక శవము జూడ పాపము సుమతీ!"

దీన్ని ప్రభుత్వం సెన్సారు చేయనక్కరలేదు ప్రాచీన పద్యం.

ఈ పరిస్థితుల్లో ఆరోగ్యంచెడి సురవరంవారు గోలకొండను వదలి స్వగ్రామం చేరుకున్నారు. రాజాగారితో అభిప్రాయ భేదాలుగూడా తోడైనాయి. వెళ్ళిపోతూ ప్రతాపరెడ్డిగారు గట్టిగా కోరినందున రామానుజరావుగారు గోలకొండ పత్రికలో చేరవలసి వచ్చింది. సంపాదకులు నరోత్తమరెడ్డిగారైనా సంపాదకీయాలు రావుగారే వ్రాసేవారు. ఇందుకై వారు ప్రతి దినం ఆంగ్ల - ఉర్దూ - తెలుగు భాషలలోని ప్రసిద్ధ దినపత్రికలను ఓపికతో చదువుతూ ఉండడం నాకు బాగా తెలుసు. వారి సంపాదకీయాలు గూడ చాల ముఖ్యమైనవిగా ఉండేవి. పత్రికను దినగండముగా నడపవలసి ఉండేది. ఆ భయంకర పరిస్థితుల్లో రజాకార్ల దుండగాలను, ప్రభుత్వ దమననీతిని ఎదుర్కొంటూ, ప్రజోద్యమాలను సమర్థిస్తూ కత్తిమీది సాముగా ఆ దినాలలో పత్రికను నడప గలగడం సాహసోపేతమైన చర్య. ప్రజలను బలపరుస్తూ, రజాకార్లను ఖండిస్తూ ఉరుదూలో 'షోయిబుల్లాఖాన్' అనే జాతీయవాది యువకుడు "ఇమ్రోజ్" అనే పత్రికను ధైర్యంగా నడిపేవాడు. అతన్ని రజాకార్లు ఘోరంగా హత్య చేసినారు.

1948 లో హైదరాబాదు సంస్థానం స్వతంత్రమైంది. ఆ తర్వాత గూడ దాదాపు 15 సంవత్సరాలు గోలకొండ పత్రిక వీరి సంపాదకీయముతోనే నడిచి అంతరించింది. చివరి కాలంలో మర్రి చెన్నారెడ్డి నాయకత్వంలో మరలా "తెలంగాణా ఉద్యమం" తలయెత్తి తీవ్రరూపం ధరించింది. గోలకొండ పత్రికకు ప్రధాన సంపాదకులూ, ఆంధ్ర సారస్వత పరిషత్తుకు అధ్యక్షులు అయిన నూకల నరోత్తమ రెడ్డిగారు తెలంగాణా ఉద్యమంలో చేరి, దాన్ని సమర్థించినారు. ఆంధ్ర సారస్వత పరిషత్తు ఆంధ్రదేశ మంతటా విస్తరించిన సంస్థ. అన్ని జిల్లాలలో దానికి శాఖలు, పరీక్షా కేంద్రాలు ఉన్నాయి. అట్లాంటి మహా సంస్థను క్షుద్ర రాజకీయాలకు బలి ఈరాదని మేమంతా నిర్ణయించి ఆ ఉద్యమాన్ని ప్రతిఘటించినాము. అప్పుడు రామానుజ రావుగారు విశాల దృక్పథంతో ఆలోచించి, 3 సంవత్సరాల కాలము గోలకొండతో సంబంధాన్ని వదులుకున్నారు. మొగమాటం లేకుండా దృఢంగా నిలిచి తమ వ్యక్తిత్వాన్ని నిలబెట్టుకున్నారు.

పత్రికా నిర్వహణ దేశసేవా కార్యంగా భావించబడి, దృఢ నిశ్చయంతో నిస్వార్థంతో పవిత్ర కర్తవ్య దీక్షతో మన పెద్దలు దాన్ని నిర్వహించినారు. అట్టి ప్రసిద్ధ సంపాదకుల కోవలో రామానుజరావు గారు చేరదగిన వారని నిస్సందేహంగా చెప్పవచ్చును. వారిని అభినందిస్తూ దీర్ఘాయువును ప్రసాదించునట్లు పరాత్పరుని ప్రార్థిస్తున్నాను.

కాల్పనిక కవితాహర్మ్యానికి కట్టిన పచ్చతోరణము

డాక్టర్ నాయని కృష్ణకుమారి

శ్రీ దేవులపల్లి రామానుజరావుగారు ఈ శతాబ్దపు అయిదవ దశకంలో వెలువరించిన ఖండ కావ్యాల సంపుటి పచ్చతోరణం. ఆయన చదువంతా ఉర్దూ మాధ్యమంలో జరిగింది. నైజాం సంస్థానంలో తెలుగుకు ఏ స్థానం ఇవ్వబడిందో అందరికీ తెలిసిన విషయమే. రామానుజరావుగారి మిత్రులందరూ ఉర్దూ భాషా ప్రవీణులు. తెలుగు జోలికి ఎక్కువగా పోనివారు. ఆయన 1938 లో బి.ఏ. డిగ్రీ చేత పుచ్చుకున్నా 1942 వరకూ ఏ వ్యాసంగమూ లేకుండా ఉండి పోయారు. అందువల్ల 40 - 42 మధ్య ఆయన మనస్సు తెలుగు రచనావ్యాసంగం వైపు మొగ్గసాగింది. ఆ సమయంలో ఆంధ్రదేశాన్ని ఉర్రూతలూగిస్తున్న కాల్పనిక కవిత్వ ధోరణులు ఆయన్ని ప్రభావితం చేయసాగాయి. ఆ రోజుల్లో ముద్దుకృష్ణ సంకలనం చేసిన వైతాళికులు, విశ్వనాథ కిన్నెరసాని పాటలు, నాయని ప్రణయ యాత్ర, కృష్ణశాస్త్రి ప్రవాసం, ఊర్వశి ఆయన్ని బాగా స్పందింప జేస్తుండేవట. అప్పట్లో ముమ్మరంగా తెలుగు పాఠక లోకాన్ని ఆకర్షించిన ఆంధ్ర ప్రచారిణీ గ్రంథమాల నవలలు కూడా రామానుజరావు గారిని బాగా ఆకట్టుకుంటుండేవట. నైజామ్ పాలనలోనూ, ఉర్దూ భాష దిగ్బంధంలోనూ చిక్కుకుపోయిన అప్పటి యువతరం, స్వేచ్ఛకై పడ్డ తపనకూ, ఆంధ్రాభిమానానికీ, ఈయన గొప్ప ఉదాహరణ. అయితే అప్పట్లో యీయనకు చదివి ఆనందించడమే కాని కవిని కావాలనే తీవ్రమైన అభినివేశం ఉండేది కాదు.

ఆ రోజుల్లో ఉస్మానియా విశ్వవిద్యాలయంలో తెలుగు ఆచార్య పీఠంమీద శ్రీ రాయప్రోలు సుబ్బారావుగా రుండేవారు. రామానుజ రావుగారిని ఆయనే కవిత్వం వ్రాయమని ప్రోత్సహిస్తూ ఉండేవారట. కాని రామానుజరావుగారికి గురుతుల్యులూ పెద్దలూ అయిన సురవరం ప్రతాపరెడ్డిగారు మాత్రం "నువ్వేదైనా వ్రాయిగాని తెలుగు కవిత్వ రచన అనే పిచ్చిలో మాత్రం పడి పాడైపోకు" అని హెచ్చరిస్తూ ఉండేవారట. తొలుత తొలుత ఈయనమీద రాయప్రోలువారి ప్రభావమే సోకిందనవచ్చు. అందువల్లే ఏ యితర వ్యాసంగమూ లేని 40-42 మధ్యకాలంలోనే 'పచ్చతోరణం' రూపు చెందింది. అయితే అది 1952 లో గానీ అచ్చుముఖం చూడలేదు.

1942 తర్వాత రామానుజరావుగారు నాగపూర్ లా కళాశాలలో చేరి 44 నాటికి డిగ్రీ సంపాదించుకున్నారు. 'సనద్' కూడా తెచ్చుకున్నారు. కాని ఏ ఒక్కనాడూ కోర్టులో వాదించని న్యాయవాది యీాయన. అందుకో కారణం ఉంది. ఆ సంవత్సరమే, లాయర్లెవరూ వరంగల్‌లో ప్రాక్టీసు చెయ్యరాదంటూ 'లాయర్ల బాయ్‌కాట్' జరిగింది. అప్పుడే బహిరంగంగా రజాకర్ల ఉద్యమం మొదలైంది. ప్రతాపరెడ్డిగారు గోల్కొండ పత్రికను దినపత్రికగా మార్చారు. ఆయనకూ నరోత్తమరెడ్డిగారికే అంతశ్శైత్యాలుండేవి. కాని రామానుజరావుగారు మాత్రం ఇద్దరికీ కావలసిన మనిషి. వాళ్ళ ప్రోద్బలం వల్లనే, అది పరోక్షమో, ప్రత్యక్షమో, ఆయన అటు న్యాయవాద వృత్తినీ ఇటు కవిత్వాన్నీ అవతలకు నెట్టేసి పూర్తిగా పత్రికా వ్యాసంగంలో కూరుకు పోవలసి వచ్చిందట. ఆ సమయంలోనే ఉస్మానియా విశ్వవిద్యాలయాన్ని కేంద్రంగా మార్చి దాన్ని హిందీ విశ్వవిద్యాలయం చేయాలనే ప్రతిపాదన జరిగింది. దానికి చాలామంది తెలుగు నాయకులతోపాటు ప్రతాపరెడ్డిగారు కూడా వ్యతిరేకించారు. అప్పుడు అసెంబ్లీ మెంబరుగా ఉన్న ప్రతాపరెడ్డిగారు తన స్థానాన్ని

వదులు' కుంటానని కూడా బెదిరించారు. గురువు ననుసరించి శిష్యుడు కూడా ఈ ప్రతిఘటనోద్యమంలోకి దూకవలసి వచ్చింది. రామానుజ రావు, లక్ష్మణరావుబానూ, ప్రతాపరెడ్డి, రావి నారాయణరెడ్డి ప్రభృతుల ప్రతిఘటనవల్ల ఉస్మానియా యీ నాటికీ ఉన్నదున్నట్లు గానే మిగిరిపోయింది.

ఎప్పటికప్పుడు ఈరకమైన పరిస్థితుల ఉద్భృతివల్ల రామానుజ రావుగారికి కవిత్వం వైపుకు పోవడానికి తీరిక చిక్కలేదు. అదీగాక మనిషి సహజంగానే కవి సమ్మేళనాల్లో పాల్గొనడానికీ, శాలువలు కప్పించుకోవడానికీ విముఖత చూపించే కుతూహల రహితుడు. అటువంటి 'Mood' నాకెప్పుడూ వచ్చేది కాదంటా రాయన.

కాళోజీ, రామప్ప ఆయనకు అయిదో క్లాసునుండీ సహాధ్యా యులు అప్పుడు తెలుగు భాషకు ఆదరాభిమానాలు లేకపోవడమే కాక, అది అడుగడుక్కూ నిరాదరణకూ, హేళనకూ గురి అవుతుండేది. "తెలంగీ బేడంగీ" అని ఎగతాళిగా నవ్వుకుంటుండే వాళ్ళను ఎంతో మందిని వీళ్ళెరుగుదురు. బేడంగీ అంటే అర్థం తీరుతెన్నులు లేనిదని.

తెలుగుకుండే ఈ అవస్థను చూచి తెలుగు భాష ఉనికిని నైజా ములో స్థిరం చెయ్యడానికి హైదరాబాదులో ఆంధ్ర సారస్వత పరి షత్తు ఉదయించింది. అది ఆ రోజుల్లో ఎంతోమందికి తెలుగు నేర్పిం చింది. తెలుగు పరీక్షలు నిర్వహించింది. ఉద్యోగావకాశాలు కల్పిం చింది. ఆనాడు తెలుగుదేశానికి గల అన్ని సమస్యల మధ్యా మెల్లిగా ఊపిరి పోసుకుంటూ వాటితో పాటే ఎదిగింది. ఆ ఎదుగుదలను సూచించే పచ్చతోరణం శ్రీ రామానుజరావుగారు. ఆయనా, ఆ పరి షత్తూ వేరు చేసి చూపించడానికి వీలులేని రెండు అస్తిత్వాలు.

రామానుజరావుగారు కలం పట్టి కవిగా మలిచిన ఒకే ఒక ఖండకావ్యం పచ్చతోరణం. దీనికి కారణం శ్రీ రాయప్రోలువారే నని వారు చెప్పారు. అందుకే ఆయన్ని గురించి కవితాత్మకంగా కూడా,

లక్ష్య లక్షణ రూపకల్పనల యందు
ఆంధ్ర సారస్వతాన నవ్యంపు రుచుల
ప్రబల జేసెడి తావక ప్రాభవమున
కంకితంబయ్యె నా హృదయంబు సుకవి"

అని నీరాజనం సమర్పించారు. కవితా విషయకమైన ప్రేరణ రామానుజరావుగారికి రాయప్రోలువారు కలిగించారనడంలో అబద్ధం లేకపోయినా, ఆనాడు ఆంధ్రదేశ మంతటా సూచీ భేద్యంగా అల్లుకుపోయిన కాల్పనిక కవితా విన్యాసం కూడా ఈ ప్రేరణకు కారణం అనడం అసమంజసం కాదు. ఆ కాలానికి అనుగుణంగా రామానుజరావుగారు ఒక కాల్పనిక కవిగా రూపుచెందారు. ఆయన కవిత్వం కాల్పనిక కవిత్వమే కాని భావ కవిత్వం కాదు.

కాల్పనిక కవిత్వం ఒక ఉప్పెనలాగా ఆంధ్రదేశాన్ని ఎప్పుడు ఎలా ముంచెత్తిందో ఆ చారిత్రక నేపథ్యాన్ని ఇక్కడ తడవడం నా ఉద్దేశ్యం కాదు. కాని, కలంపట్టి అక్షరాలతో హృదయాన్ని మలిచిన ప్రతి కవికీ తన కవిత్వంలో కాల్పనిక లక్షణాలను పొందుపరచడం ఆ రోజుల్లో ఒక తప్పనిసరి పని. కవి తన అనుభూతిని తాను ప్రకృతీకరించుకుంటూ, ప్రకృతిని తన కనువైన పద్ధతిలో మానవీకరించుకుంటూ, ప్రకృతి మానవుల తాదాత్మ్యాన్ని కవనంగా ప్రతిష్ఠించడం, శిల్పీకరించడం ఈ కాల్పనిక కవిత్వానికి సంబంధించిన ప్రధాన లక్షణం. 'పచ్చతోరణం' నిండా ఈ లక్షణం ప్రతిభాసిస్తుంది.

ఇక్కడ మల్లికా కన్యక మలయానిలుని జూచి మురిపెంపు సిగ్గున మోము వాల్చుకుంటుంది. కొదమ కోయిల వాసంతికాలక్ష్మి వదనాన్ని చూచి భావపదం పాడుతుంది. నిగనిగలాడుతూ చిగురించే చెట్లను చూచి తీగెలు బిగియార కౌగిలించుకుంటాయి. కొత్త సంవత్సరం జగత్తనే కొమ్మను ఎక్కి ఉషఃకాలంలో అందరినీ మేలు కొలుపుతుంది. పంట కాపులు వరుణదేవుణ్ణి ప్రసన్నుడివి కమ్మంటూ, ఉరిమితే పొన్నపూల పూజ, మెరిస్తే అరటాకు దొన్నెలో అలరు తేనె, చెరువులు నిండితే దోరపండిన దోసపండ్లు, పైరులు పండితే పండుటాకులలో పచ్చివెన్న ఉపాయనంగా సమర్పించుకుంటారు.

17 వ శతాబ్దిలో ఆంగ్ల కవితా రంగంలో ఆవిర్భవించినకవితా వైవిధ్యాలలో గొర్రెల కాపరుల పరంగా చెప్పబడిన కవిత్వం ఒకటి. దీన్ని అక్కడ Pastoral Poetry అని పిలిచారు. డా. నారాయణ రెడ్డి ఈ పద్యాలను గోపగీతాలనీ, ఆంధ్రశేషగిరిరావు ఇటువంటి కావ్యాలను గోప కావ్యాలనీ పేర్కొన్నారు. దీని ఛాయలో తెలుగులో వెలసిన కావ్యాలన్నీ పూర్తిగా గోప కావ్యాలనడానికి వీలుకానివి. దీన్ని పల్లీయ కవిత్వమనీ గ్రామీణ కవిత్వమనీ అనవచ్చు. అయితే దీన్ని జానపద కవిత్వమని భ్రమపడరాదు. ఇది కేవలం తెలుగులో, నాగరకులైన కవులచేత పల్లె ప్రకృతినీ, వాతావరణాన్నీ దృష్టిలో ఉంచుకుని వ్రాయబడిన కవిత్వం. పట్టణాల కెగబ్రాకుతున్న జనాన్ని తిరిగీ పల్లెలకు పంపించడానికి గాంధీగారు "Go back to villages" అనే పిలుపు నిచ్చారు. పారిశ్రామికీకరణాన్ని మెచ్చని ఆయన పల్లెపట్టుల ప్రాధాన్యాన్నీ, వ్యవసాయ ప్రాముఖ్యాన్ని జనులు గుర్తించేటట్లు చేయాలన్నారు. భారతీయ నేపథ్యంలో ఈ ప్రబోధం కవులచేత జానపద ప్రకృతి వర్ణనాత్మక కావ్యాలను వ్రాయించింది. తెలుగులో ఈ కవిత్వం పుట్టడానికి ప్రముఖ కారణం ఇది. అనుషంగిక

కారణాలు మరెన్నయినా ఉండవచ్చు. దువ్వూరి వారి కృషీవలుడు, వనకుమారి అటువంటివి. కాల్పనిక కవితా విధానంలో ఈ రకమైన కవిత్వ ధోరణికి ప్రధాన స్థానమే ఉంది.

పచ్చతోరణంలో పసులమందను కాచే పిల్లవాళ్ళు, చింత కాయల కోసం చెట్లెక్కే చిన్నవాళ్ళు, కోడెలతో ఆవులతో చెరువుల్లో కేరింతలు కొట్టే ఆలకాపరులు, కంది చేలో నిలుచున్న యువకుల మీసపు కొనల్లోని కోడెతనానికి మోహపడే పడుచులు, సిగలోని సగం నలిగిన పూల శోభతో, రజత కంకణ కింకిణీరవంతో చల్లచేసే గొల్ల భామలు కొలువులు తీరి ఉంటారు. అంతేకాక తరిగిపోవునా ఏమొ ఈ ధాన్యమనుచు చేనుకు ఒక చిన్నది కావలికాస్తూ, చురుకు చూపులతో చూస్తుంటుంది. మరోపక్క పాలు గారెడి లేజొన్న పంటగాంచి భ్రమసి చవిచూడడానికై పక్షిగణం మూగుతుంటుంది. కవి తన చుట్టూ ఉన్న గ్రామీణ ప్రకృతిలో కరిగిపోతూ "పుణ్య పాపమ్ము లెరుగని పులుగు కన్నె నోటి ముందటి ధాన్యమ్ము నుస్సురనగ నీరీతి నెత్తగొట్ట చేతులెట్లాడె?" అని ఆ కాపు పిల్లను జంకిస్తాడు. కేవలం పల్లెసీమల్లోని సౌందర్య కాంతులేకాక వాటినానుకుని ఉన్న చీకటి ఛాయల్నిసైతం కవి మర్చిపోకుండా తన కవిత్వంలో పదిలం చేశాడు. ఆరిపోయిన చెరువు, పండువారి యెండబారుతున్న పొలాలు, వాటిని చూస్తూ ఈడిగిలబడి నడిచే కావు, తాగడానికి నీళ్ళు దొరకక చెరువులో నిలిచి బేలగా కన్నీరు కార్చే లేగదూడ, ఈ కవికి వర్ణ్య వస్తువులయినాయి. ఒకటి రెండు పిట్టలు కంకులమీద వాలినా ఆకలిని తీర్చుకోడానికి వాటికి ఒక గింజైనా దొరకదు. అసలు దారిద్ర్యమంటే యిదే. పునాసవంట పురుగుదిని పాడైపోయింది. నారుపోసిన దేవుడు నీరు పోయలేదు. ఆయనకూడా పేదలను ఈసడించాడు. సాధారణంగా పల్లెసీమల్లో కనిపించే బీదకాపుల ఘోష, ఎత్తుబడిన వారి సంసారాలు ఈ కవి దృష్టిని తప్పించుకోలేకపోయాయి.

గ్రామాలలో విషాద భరిత దారిద్ర్య జీవితా లెన్నో ఉన్నా, వాటికి సంబంధించిన ముగ్ధ సౌందర్యం కవిని పరవశుణ్ణి చేయడం ఈ కావ్యంలో అడుగడుగునా కనిపిస్తుంటుంది. తెలుగువారిండ్ల తిరిగే తీగబోడుల సౌరు, పసుపు కుంకుమల నడుమ తీరిన గొబ్బిళ్ళు, మెత్తగా పరచుకున్న రంగవల్లికలు, జవరాండ్ర జడల నుండి జారిన పూలరేకులు - ఇవన్నీ సౌందర్య మహితాలే. ఒకచోట గంప నెత్తిన బెట్టి సొంపుగా చూచే వన్నెలాడి, మరొకచోట బంతిపూల దండలు గుచ్చే సుందరాంగి, సంపెంగ తోటలలో చెమ్మచెక్కలాడే చెలుల గుంపు, ఎఱ్ఱగా పండిన మిరప తోటలు, పరిమళించే పొగడ చెట్లు, ఇంటి వెనక మల్లెతోట, బీరపాదులకు దూరంగా కొమ్మచిక్కుడు పందిలి, వంగతోటల వెలుపట కట్టలమీద దోసపండ్లు కోసుకునే వని తలు, వాళ్ళు పాడే ఏలపాటలు - ఇవన్నీ సౌందర్య నిధానాలే! అణు వణువునా సింగారించుకున్న పల్లె అందాన్ని ఈయన తన పద్యాలలో బంధించగలిగారు.

ఆ కాలపు కవిత్వంలో స్త్రీ పురుషాశ్రితమై, శారీరక స్పర్శకు ప్రాధాన్య మివ్వని లలిత శృంగార వర్ణన కూడా అవశ్యమూ ఉండ వలసిన లక్షణమే.

కవికి తన భావనలో ఎక్కడో దాగున్నదానినో, తన కల్పనా మయ ప్రపంచంలో రూపు చెందిన దానినో ఒక స్త్రీని ధ్యేయంగా నిలుపుకోవడం ఆనాటి కవిత్వంలో సర్వ సాధారణం. ఈ కాల్పనిక ధోరణి అప్పుడు ఎంతో కవిత్వాన్ని కుమ్మరించింది. ఇందులో స్త్రీ పట్ల పురుష హృదయానికి గల ఆరాధన విశ్వరూపావిష్కారం చేస్తుంది. ఇక్కడ పురుషు డెప్పుడూ నిశ్శబ్ద ప్రేమికుడూ స్త్రీ సౌందర్యారాధకుడూ మాత్రమే. ఆమెను ఆరాధించగలడే కాని, కావాలని సొంతం చేసుకుని విజయగర్వాన్ని చాటుకోడు. తన కాల్ప

నిక ప్రపంచానికి తానే రాజు. తన ప్రేయసి మహారాజ్ఞి. ఆ రసమయ ప్రపంచంలో తామిద్దరేగాని అక్కడ మరెవ్వరికీ చోటులేదు. ఆవిడకూ తనకూ జన్మ జన్మల బంధం ఉంటుంది. ఆవిడ చిన్ని బంగరు చేతులతో పొద్దు పొడుపున పూల చెట్లకు నీర్వోసి శ్రమించే బాల. ఆవిడ చిత్తం ఎప్పుడూ చెట్ల మీదనే! పూలు రాలక, ఆకులు వాడక, చెట్లు నిత్య హరితంగా ఉండే వరాన్ని కోరడానికి ఆవిడ శ్యామలా మందిరానికి పోతుంటుంది. కవి ఆమెను చూచి, తలిరు పిల్లల్ని చూస్తే తల్లికి బిడ్డల్ని చూచినట్లుగా నీకు ప్రాణం లేచి వస్తుందని మెచ్చు కుంటాడు.

ఆ మాటల కాపిల్ల నవ్వితే, ఆ కిలకిలలను దానిమ్మ గింజ లనుకుని, ఏరుకుని తినాలన్న భ్రాంతితో పచ్చని చిలక వచ్చి వాలు తుంది. ఆవిడ ముఖం ఎత్తితే పట్టపగలు వెన్నెల కాస్తుంది. వెన్నెల కాస్తే మండు వేసవి నాటి సూర్యుడు కోపిస్తాడన్న భయంతో ఆవిడ ముఖం దించుకుని నేలచూపులు చూస్తుంటుంది. ఆమె కోసి తెచ్చుకున్న పూలు అతని కక్కర లేదు. ఆమె ముఖంమీద నవ్వు తీవెలు విరబూచే పువ్వులు కావాలి. ఆవిడ భగవదర్చన కోసం భక్తితో పారిజాత పుష్పాలను కొనిపోవడ మెందుకు? అవి ఆవిడ శిరస్సుననే పరిమ ళిస్తాయి. ఈ జగతిలో వాటి జన్మమే అందుకోసం.

అటువంటి ప్రేయసిని కల్పనా ప్రపంచంలో రూపు కట్టిం చడమే కాక, ఆవిడను ఉద్దేశించి "దేవి భవదీయ పదపద్మ సేవ తప్ప ఇతర మేమియు నిక నాకు నింపుగావు" అనుకుంటాడు. ఆవిడ సెలవి వార నవ్వితే నోట రాలెడి ముత్యాలు మూటకట్టి తన పద్య పేటికలో పదిలం చేస్తానంటాడు. అన్నిటికంటే ప్రచురంగా కనిపించే విశేషం అందరు కాల్పనిక కవులలో కనిపించినట్లే పచ్చతోరణం లోనూ ఉంది. అది యీ ప్రపంచానికి దూరంగా పారిపోవాలను

కోపడం. దీన్నే కాల్పనిక కవితా విమర్శకులు గుర్తించి, ఇటువంటి కవిత్వాన్ని పలాయన వాద కవిత్వమని పేర్కొన్నారు. కవి, "ఈ జగతిని భీషణంగా జ్వలించే ద్వేషవహ్ని దహిస్తోంది. దీనిని నేను సహించలేను" అంటున్నాడు. అందువలన "కవితను వీణపై మీటుకుంటూ నేను అడవులలోకి వెళ్ళిపోతాను. అక్కడ నీతో కాపురాన్ని కాంక్షిస్తాను" అని తన ఆత్మవేదనను తన ఆరాధ్య శ్రీమూర్తికి విన్నవించుకుంటున్నాడు. జనం మధ్య నుండి పారిపోయి నేను ఆకాశంలోనో అడవిలోనో ఉండిపోతా ననడమే ఈ రకమైన విమర్శకు తావు నిచ్చింది. దీనినిబట్టి రామానుజరావుగారి కవిత్వం రాయప్రోలు మార్గంలో కాక కృష్ణశాస్త్రి మార్గంలో నడిచిందని చెప్పుకోవచ్చు. ఇదొక ఆస్తికమార్గం. ఇందులో ప్రకృతీ, పడతీ కవికి పవిత్రంగా, భగవత్స్వరూపాలుగా కనిపించడం విశేషం.

కాల్పనిక కవిత్వానికి మరో లక్షణం కూడా ఉంది. అప్పుడు కనిపించిన రాజకీయ సంక్షోభం వలన, మాతృదేశం పరాయి పాలనలో ఉండడం వలన, ఆ పాలనపట్ల వైముఖ్యం అందరికీ ఉండేది. కవులలో ఆ వైముఖ్యం ప్రత్యక్షంగా ప్రకటితం కాకపోయినా, అది జాతీయతాభిమానంగా, గత వైభవ స్మరణగా రూపుతాల్చింది. పచ్చ తోరణంలో ఆ లక్షణం కూడా కనిపిస్తుంది. భర్త దేశహిత కార్యాచరణలో వ్యగ్రుడు కాగా, "నన్ను నర్థాంగిగా నాత డెన్నుకొనుట నేను సహధర్మ మిప్పుడు పూనవలయు" అని భార్య నిర్ణయించుకుంటుంది. దేశంకోసం కవితా నివేదనం చేయాలన్న కోరిక ఈయన చేత ఓరుగల్లు, మహాత్ముడు, కస్తూరీదేవి వంటి ఖండికల్ని వ్రాయించింది. "తుచ్ఛ సుఖములకై తల్లి స్వేచ్ఛ విక్రయింప సంసిద్ధులై కొందరేమొ కొన్ని కూతలను కూసినంతనే కోలుపోరు ప్రజలు కలనైన స్వాతంత్ర్య భవ్యదీక్ష" అని ప్రశ్రయంతో ఆత్మస్థైర్యాన్ని

ప్రకటించగలిగేట్లు చేసింది. దీని వెనుక భారతదేశ దాస్య స్థితి మాత్రమేకాక నైజాము ఇనుప పిడికిలి పట్టు విలవిలలనుకూడా మనం గ్రహించవచ్చు.

పచ్చతోరణం ఆ కాలపు కవితా విన్యాసానికి పట్టిన మెరుగు టద్దపు సొగసు. ఒక కవిపైన సమకాలిక కవితా ధోరణు లెటువంటి ప్రభావాన్ని చూపుతాయో ఈ కావ్యాన్ని ఆధారంగా కొన్ని విశ్లేషించ వచ్చు. రామానుజరావు గారు మంచి కాల్పనిక కవిగా రాటు తేలడానికి కావలసిన ప్రాథమిక సామగ్రి నీకావ్యం పొందుపరచుకున్నది.

ఆయన తన జీవన వ్యాసంగాన్ని కవితా సృష్టినుండి పత్రికా రచన వేపు, తెలంగాణా సాంస్కృతిక పునరుజ్జీవన సాధన వేపు మళ్ళించుకోకపోయి ఉంటే, అనాటి పూపదశలోని యీ కవి, ఏనాడో సర్వోత్తమ కవితా ఫలమై పరిణమించి ఉండేవాడు. కాల్పనిక కవితా పరిగణంలో ఈయనకొక స్థిర స్థానం లభించి ఉండేది. అయినా అందువల్ల ఈయన పోగొట్టుకున్నదేమీ పెద్దగా లేదు.

కొసరు మాటగా, ఈయన పచ్చతోరణం ఆనాటి కాల్పనిక కవితా స్వరూపానికొక సోదాహరణ వివరణాత్మక విశ్లేషణ.

సకలకళావేత్త సకలజనప్రియుడు

—డా॥ పేర్వారం జగన్నాథం

డాక్టర్ దేవులపల్లి రామానుజరావుగారితో నాకున్న పరిచయం ఈనాటిది కాదు. సుమారు 35 సంవత్సరాల వయస్సు దానికున్నది. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో నేను 1956-60 ప్రాంతాన బి.ఏ; ఎం.ఏ. చదువుతున్నప్పుడు అప్పుడప్పుడు ఆంధ్రసారస్వత పరిషత్తుకు వెళ్ళుతుండేవాణ్ణి. అక్కడ జరిగే సభలకు హాజరయ్యేవాణ్ణి. వారి నేతృత్వంలో నిర్వహింపబడే కార్యక్రమాల్ని కళ్ళారా చూసి హర్షిస్తూ ఉండేవాణ్ణి. అప్పటి నుంచీ రామానుజరావు గారి కంచు కంఠంతో నాకు బాగా అనుబంధ మేర్పడింది. పరిషత్తు గేటులో మనం కాలు మోపుతామో లేదో కిటికీలోంచి వారు మన రాకను గుర్తించి సహజ గంభీర స్వరంతో మనల్ని సమాహ్వానిస్తారు. కూర్చుండ కుర్చీ చూపించి సమాదరిస్తారు. అక్కడినుంచీ సాహిత్య రంగంలోకి మన సంభాషణ మారుతుంది. అక్కడ ఒక ఘంటసేపు కూర్చుంటే చాలు - వేయి సంవత్సరాల తెలుగు సాహిత్య చరిత్ర మన కనులముందు కదలాడినట్లుంటుంది. వచ్చిపోయే కవిపండితుల సంభాషణ వింటే చాలు - కావ్య జగత్తులో విహరించినట్లవుతుంది. మహాకావ్యాల పఠనం వల్ల కలిగే రసానందం అనుభూతిలోకి వస్తుంది. అక్కడ అడుగు పెట్టని కవి పండితులు కానీ, సాహితీ డిండుములు కానీ అఖిలాంధ్రదేశంలో లేరంటే అతిశయోక్తి కాదు. అభిమానం కొద్దిగానీ, మొహమాటం కొద్దిగానీ అంటున్న మాటలు కావివి. అక్షరాలా ఇది నిజం. ఆంధ్రసారస్వత పరిషత్తు ఒక సాహిత్య నందనోద్యానం. తెలుగు సరస్వతికి తొడిగిన కంఠాభరణం. అది తెలుగు

వాకిట కట్టిన కవితా తోరణం. దీన్ని అట్లా తీర్చిన మహాశిల్పి శ్రీ దేవులపల్లి రామానుజరావు.

డాక్టర్ రామానుజరావుగారి జన్మస్థలం కాకతీయుల రాజధానీ నగరం వరంగల్లు అయినా హైదరాబాదులోనే స్థిరపడినారు. వారి సాహిత్య సాంస్కృతిక కార్యకలాపాలన్నింటికీ అదే కేంద్ర స్థానమైంది. రాజధాని నుండి సాగే అన్ని ఉద్యమాలకు వారు అగ్రేసరులుగా నిలుస్తుంటారు. కొన్నింటికి ప్రేరణ కలిగిస్తుంటారు. మరి కొన్నింటికి ప్రోత్సాహ మిస్తుంటారు. వారితో సంబంధం పెట్టుకోని విశ్వవిద్యాలయ మంటూ ఆంధ్ర దేశంలో లేదు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో వారు చిరకాలం సిండికేటు సభ్యులుగా ఉండి, దాని అభ్యున్నతికి పాటుపడినారు. నిజాం కాలంలో ఉర్దూ భాషామయమై పోయిన ఉస్మానియా విశ్వవిద్యాలయంలో పోలీసు చర్య పిదప తెలుగుకు సరియైన స్థానం కలిపించడంలో రామానుజరావు గారు చేసిన కృషి అసామాన్యమైంది. అంతేకాక, ఉస్మానియా విశ్వవిద్యాలయాన్ని కేంద్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకునే ప్రతిపాదనను కూడ రావుగారు మరికొందరు ప్రముఖుల్ని కూడదీసి వ్యతిరేకించినారు. తత్ఫలితంగా అది రాష్ట్రానికే దక్కింది. వరంగల్లులో కాకతీయ విశ్వవిద్యాలయం నెలకొనడానికి కూడ తమ పలుకుబడిని వారెంతో వినియోగించినారు. వరంగల్లులోని అతి ప్రాచీన గ్రంథాలయమైన శ్రీ శబ్దానుశాసన ఆంధ్ర భాషా నిలయానికి చిరకాలంగా కార్యదర్శిగా ఉండి, దాని రజతోత్సవాల్ని కూడ ఘనంగా జరిపించినారు. శోభ, సుజాత వంటి పత్రికల్ని నడిపించినారు. గోలకొండ పత్రికకు కొండంత అండగా ఉన్నారు. ఆంధ్ర సారస్వత పరిషత్తు ప్రారంభ దశ నుండీ నేటి దాకా దానికి నేతృత్వం వహిస్తూ, దాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్నారు. యువభారతి వారి ఇంటి ఆడుబిడ్డ. సుర

భారతి కన్నతల్లి. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడెమీ రావుగారి చేతుల్లో పుట్టి పెరిగి వర్ధిల్లింది. ఐతే ప్రభుత్వాధినేతల దుర్వ్యూహం కారణం గానే అది దుర్మరణం పాలైంది.

డాక్టర్ రామానుజరావుగారు సాహిత్య సాంస్కృతిక రంగాల్లో అడుగిడని ప్రాంగణమంటూ లేదు. ప్రవేశించని సాహిత్య ప్రక్రియ అంటూ కనిపించదు. ప్రాచీన ఆధునిక సాహిత్య ప్రక్రియల్ని క్షుణ్ణంగా అధ్యయనం చేసి సాధికారికమైన రచనలెన్నో చేసినారు. ఏది రాసినా, ఏమి మాట్లాడినా రసజ్ఞతను ప్రదర్శిస్తుంటారు. రామణీయ కతను భజిస్తుంటారు. హృద్యంగా సరళ సుందరంగా చెప్పడం వారి కలానికున్న ప్రత్యేకత, వారి గళానికున్న నైపుణ్యం. వారు సాహితీవేత్త మాత్రమే కాదు, సాహిత్య ఉద్యమకర్త. సాహిత్య పోషకుడున్నూ. ఎందరూ సాహితీపరుల్ని వారు ఉత్తేజపరచినారు, యువతను ప్రభావితం చేసినారు! ఆంధ్ర సారస్వత పరిషత్తును భిన్న భిన్న మనఃప్రవృత్తులవారికీ, భిన్న భిన్న మతాలవారికీ, అభిమతాల వారికీ, భిన్న అభిరుచుల వారికీ కూడలిస్థలంగా తీర్చినారు. అక్కడ సాహిత్య మతం తప్ప మరే మతానికీ తావు లేదు. అక్కడ కవితా రసం తప్ప మరే రసప్రవృత్తికీ ఆస్కారం లేదు. ఎంతటి కవి చక్రవర్తి అయినా పరిషత్తు నీడ పడగానే తలవంచి మన తలలూపింప చేయవలసిందే. ఎంతటి రాజశేఖరుడైనా పరిషత్తు ప్రాంగణంలో అడుగుపెట్టగానే రసజ్ఞ శేఖరుడుగా మారవలసిందే.

శ్రీ రామానుజరావుగారు అన్ని సాహిత్య ప్రక్రియల్ని అధ్య యనం చేసినట్లుగానే జానపద సాహిత్యాన్ని కూడ సుమారు 50 సంవత్సరాల క్రితమే సునిశితంగా అధ్యయనం చేసి విలువైన వ్యాసాల్ని ప్రకటించినారు. జానపద సాహిత్యంపై - అందునా పల్లె పాటలపై రసజ్ఞుల దృష్టినాకర్షించే విధంగా వ్యాసాలు రచించి పత్రికా

ముఖంగా వెలువరించినారు. అప్పటికింకా మన విశ్వవిద్యాలయాలలో జానపద సాహిత్యం గూర్చిన పరిశోధన ప్రారంభమే కాలేదు. దాని గూర్చిన ఆలోచనే లేదని చెప్పాలి. అప్పట్లోనే రావుగారు పల్లెపాటల లోని సహజ సౌందర్యాన్ని సశాస్త్రీయంగా విశ్లేషించి ప్రవచించిన మాటలు నేటికీ పరిశోధక విద్యార్థులకు మార్గదర్శక సూత్రాలుగా వున్నాయి. అంటే వారి జిజ్ఞాస ఎంతటిదో మనమూహించుకోవచ్చు. ఒకచోట వారు జానపద గేయాన్ని ఈ విధంగా నిర్వచించినారు- "వ్రాత పూత లెరుగని సామాన్య జనులు రసోద్రిక్తులై ఆలపించు మధుర భావ గేయములు జానపద గీతములు. ఈ గేయములు సాధారణముగా ఖండకావ్యములవలె పరిమిత పరిమాణము కలవి. ఇందలి భాష వ్యాకరణబద్ధమైనది కాదు. కృత్రిమరహితములై మిక్కిలి సహజములగు నీ గేయములందు వేదాంత వాసనగాని, తాత్త్విక విభూతి అంతగా కానరాదు."

అంతేకాక రావుగారు ఈ పల్లె పాటలలోని కవితా సౌందర్య స్వభావాన్ని తమ అంతర్దర్శనా శక్తితో ఈ విధంగా విశ్లేషించినారు- "ప్రబంధముల యందలి వర్ణనలు కృత్రిమములై, పాడినదే పాటగా, కొంతవరకు అసభ్యములుగా కూడ నుండును. కాని ఈ పాటల యందలి నాజూకువర్ణనలు మనల నానంద డోలికలయందు ఉయ్యాల లూగించుచున్నవి." (గోలకొండ పత్రిక-1950). అట్లాగే స్త్రీల పాటల పుట్టుకకుగల కారణాల్నికూడ ఎంతో సహేతుకంగా, వాస్తవిక దృష్టితో- "వివిధ సాంఘిక సమస్యల కాలవాలమగు స్త్రీల పాటలు మన సాంసారిక సౌందర్యమునకు ప్రతిబింబములు. కళా స్వరూపము లగు కసుగందుల నిదురబుచ్చుటకై యుయ్యేల నూచునప్పుడు, తోడి నెచ్చెలులతోడ పూదోటయందు మెలగునప్పుడు, వివాహాది శుభ కార్యములందు వరుసగల వనితలతో పరియాచకములనాడు నవసర

మున, మంగళగౌరి, శ్రావణ శుక్రవారము మున్నగు నోములు నోచు నప్పుడును మగువల మనసులు భావార్ద్రము లగుట సహజము. తత్ఫలితమే వారి గేయ సముదాయము" (ఆంధ్రప్రభ - 1944). అంటూ నిరూపించిన తీరు, రావుగారి పరిశోధనాసక్తతనూ వైమర్శక పరిశీలనాభిలాషనూ విశదపరుస్తున్నది. ఇట్లా శ్రీ రామానుజరావుగారు దేనిగూర్చి రాసినా, దేనిగూర్చి మాట్లాడినా వస్తుతత్త్వాన్ని అంత ర్దర్శనతో వ్యాఖ్యానిస్తుంటారు. దాని సౌందర్య రహస్యాన్ని వెదుకు తుంటారు. వెలికి తీస్తుంటారు.

రామానుజరావుగారికి అడంబరాలంటే గిట్టవు. సన్మానాలంటే సరిపడవు. షష్ఠిపూర్తి మహోత్సవం వంటివి చేసుకోవడానికి ఇచ్ఛ గించరు. కట్టులో బొట్టులో కూడ వారు నిరాడంబరతను కోరు కుంటారు. అచ్చమైన తెలుగువాడుగా దర్శన మిస్తుంటారు. సహజ సుందరమైన జీవితం వారికి ఊపిరి. ఐతే ఇతరులకు సన్మానాలు జరుగుతుంటే మాత్రం ఎంతో సంబరపడుతుంటారు. తనకే జరిగి నట్లుగా ఆనందిస్తారు. అభినందిస్తారు. ఆశీర్వదిస్తారు. చేతనైనంతగా సహకరించి ప్రోత్సహిస్తారు. వారి చేతిమీదుగా ఎందరో కవులకు, సాహితీ సార్వభౌములకు సన్మానాలు జరిగినాయి. సత్కారా లంది నాయి. అది వారిలోని ఉదాత్త వ్యక్తిత్వానికి నిదర్శనం. ఉత్తమ సౌజన్యానికి తార్కాణం. ప్రతిభకు సరియైన పీటవేసి ప్రోత్స హించడం రావుగారిలో ఉన్న మహోదాత్తగుణం. అదే వారికి అలంకారం.

చివరిగా ఒక మాట. అది నా వ్యక్తిగతమైంది. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడెమీలో నేను చిరకాలం సభ్యునిగా ఉన్నాను. వారి ఆశీస్సులతోనే దానికి నేను సంయుక్త కార్యదర్శిగా కూడ ఎన్నికై సేవచేసే భాగ్యం లభించింది. సాహిత్య కార్యక్రమాలు నిర్వహించ

దంలో వారు సన్నెంతో ప్రోత్సహిస్తుండేవారు. ముఖ్యంగా మేము వరంగల్లులో నిర్వహించే సాహిత్య కార్యక్రమాల్ని వారు స్వయంగా ఎంతో ఆసక్తితో సమీక్షిస్తుండేవారు. ఉచిత సలహా లిస్తుండేవారు. అకాడెమీ నుండి ఆర్థిక సహాయాన్ని అందిస్తుండే వారు. వారి ప్రోత్సాహంతోనే వరంగల్లులో అకాడెమీ తరపున నన్నయ సాహిత్య సమారాధన ఉత్సవాల్ని ఘనంగా జరిపించినాము. తెలుగు నవలపై సదస్సు నిర్వహించి పుస్తకం ప్రచురించినాము. ఇట్లా వారి ప్రేరణతో ఎన్నో కార్యక్రమాల్ని నిర్వహించినాము. ఇప్పటికీ వారు వరంగల్లు వచ్చినప్పుడల్లా ఎక్కడో ఒకచోట ఎట్లాగో వారిని కలసికోకుండా ఉండలేము. అట్లా వీలుకాని సందర్భాల్లో కనీసం ఫోన్ ద్వారానైనా వారు మమ్మల్ని పలుకరించి ప్రేమామృతాన్ని చిలుకరిస్తుంటారు. వారిలోని ఈ మహోదాత్త వ్యక్తిత్వానికి నా కైమోడ్పులు. భగవంతుడు వారికీ, వారి కుటుంబ సభ్యులందరికీ చిరాయురారోగ్య ఐశ్వర్యములు ప్రసాదించు గాక!

సంప్రదాయ కవి

—డా॥ ఎం. కులశేఖరరావు

గడచిన ఇరువది ముప్పది సంవత్సరాలుగా దేవులపల్లి రామానుజరావుగారిని సాహిత్యసభల్లో సందర్శిస్తున్నవాణ్ణి. వారు అధ్యక్షత వహించడం, లేక ఇతరులు వ్రాసిన కావ్యాలను ఆవిష్కరించడం జరిగినపుడు, ఆయా సాహిత్య ప్రక్రియలను గురించికాని, కావ్యాలను గురించికాని, సామాజకాపేక్షతో, విమర్శనాత్మకంగా సంభాషించి, సాహిత్యకులను సుసంబోధితం చేయడం నాకు తెలుసు. కాని, వారు కవితలువ్రాసి, సభల్లో చదవడం నాకు అజ్ఞాతమే. కాని, వారు వ్రాసిన పచ్చతోరణం అనే ఖండ కావ్యం చూసినప్పుడు ఈ వామనమూర్తిలో కవితా విజృంభణను గురించి తెలుసుకొని సంభ్రమం కలిగింది. సంతోషమైంది.

సంస్కారం అనేలక్షణం ఉన్న ప్రతి వ్యక్తిలో ఒక కవి అదృశ్యంగా ఉండడం సహజమే. ఆ కవికి తగిన వస్తువు, తగిన అనుభూతి, తగిన లేఖకపాఠకోత్తముల్ లభించినప్పుడు ఆ కవి అభివ్యక్తిని పొందుతాడు. ఆ కవిలో ఉద్బుద్ధమవుతుంది. లోకంలో ప్రవేశిస్తుంది. రసికులను అలరిస్తుంది. కావ్య శాద్వలాన్ని సుసంపన్నం చేస్తుంది. ఇది నిరంతరం కొనసాగితే, ఆ వ్యక్తి లోకానికి కవిగా పరిచయమై ప్రఖ్యాతిని పొందుతాడు. కారణాంతరాలచేత కవి, కవితా సాధనము పదలి వేసినా, కవిత కవిని వదిలినా, కవితాప్రవాహం నిరంతరం కొనసాగదు. డాక్టరు రామానుజరావుగారి వ్యక్తిత్వంలో ఈ రెండవ పరిణామం జరిగినట్లున్నది. నిత్య సాహిత్య వ్యాసం

గంలో ఉన్న ఈ సామాజిక పరిశీలకుడు, సాహిత్య వ్యవసాయకుడు, కవితా సుందరిని దూరం చేసినాడు. పరిణామంగా లోకం రామానుజరావుగారిని కవిగా మర్చిపోయింది. అస్మదాదుల అజ్ఞానానికి కారణం ఇదే.

ప్రస్తుత పరిస్థితి ఇట్లా ఉండగా, పూర్వం ఈ కవి వ్రాసిన కొన్ని ఖండ కావ్యాలను ఏర్చి కూర్చి పచ్చతోరణం అనే పుస్తకంలో సంపుటీకరించడం జరిగింది. ఈ చిన్న పుస్తకమే వారి కవితా సంచలనానికి ఈనాడు గుర్తుగా ఉన్నది. వక్తగా, విమర్శకుడుగా రావుగారు సామాజిక సాంప్రదాయకుడైనట్లుగానే కవిగాకూడ ఆయన సంప్రదాయవాదిగానే ఈ సంపుటిలో దర్శనమిస్తున్నాడు. ఆయన నిశితమై విస్తరమైన కవితా దృష్టి కలిగినవాడు. తెలుగు సాహిత్యంలో ఉండే కావ్య సౌందర్యాలను మొదలుకొని, లోకంలో ఉండిన కాపుకన్నెలను, తొలకరిని ఇంకా ఎన్నింటినో దర్శించాడు. స్పందించినాడు. అదృష్టవశాన నరకడానికి, ఖండించడానికి పూనుకోక, కమ్మని పద్యాల్లో తమ అనుభూతిని అందరికి పంచిపెట్టినాడు. ఆనందాన్ని అందించినాడు. ఆయన కవిత్వ కృషి సార్థకమైంది:

ప్రాచీన తెలుగు కవుల మహా కావ్యాలను చదివిన సంస్కారం నిండుగా కలిగినవాడీ కవి. అందుచేతనే కాబోలు, ఆముక్తమాల్యదనే కవితా వస్తువుగా గ్రహించినాడు. సందర్భవశాన శ్రీరంగనాథుని దివ్యమంగళ విగ్రహాన్ని వర్ణించవలసి వచ్చింది. ఒకే ఒక పద్యంలో ఎంత హృద్యంగా ఆ స్వరూపాన్ని ఆవిష్కరించినాడో చూడండి:

చల్లని సోగచూపులును చక్కని చామనచాయ రూపమున్
పల్లవ కోమలంబులగు పచ్చనిచెక్కుల జారుచెమ్మటల్
ఫుల్లనవారవిందముల పోల్పు హసించెదు పాదయుగ్మ మం
దలన మ్రోయు నందియలు, నందముచిందగ నప్పుడచ్చటన్.

తెలుగు మధురిమను సంతరించుకొన్న శైలి, పద సంబంధముల పొందిక, కవిలోని సంప్రదాయమూర్తిని కన్నులకు కట్టించినాయి.

గ్రామీణ జీవితంలో కర్షక యువతిని చూచి ఆకర్షితులై ఆమెను వర్ణించిన కవులు చాలామంది ఉన్నారు. కాని ఆమె సౌందర్యాన్ని, ఆమె సుందర గాత్ర సౌభాగ్యాన్ని దర్శించినవాడే కాని, అమె ప్రకృతిని, ఆమె చేసే పనిని అంతగా గమనించినవారు కారు. రామానుజరావుగారు చేను కాపు కాచే ఒక కన్నెను చూచినారు. ఆమె సౌందర్యం మాట అటుంచి ఆమె 'చురుకు చూపులే' వారికి దర్శనీయా లైనాయి. ఇతర కవులు ఆమెను వర్ణిస్తే, ఈ కవి ఆమెను ఒక ప్రశ్న వేసినాడు. 'లేతగా పాలుగారే ధాన్యం కలిగిన జొన్నచేనును చూచి, భ్రమసి, ఆ గింజలతో కడుపు నింపుకొందామని వచ్చిన పక్షులను పరుగెత్తించడానికి ఎంతటి రొద చేస్తున్నావు? ఇది నీకు న్యాయమా? ఇంతటి నిర్దయ నీకు తగునా?' అన్నాడు. నాకు తెలిసినంతవరకు ఏ కవి ఇటువంటి ప్రశ్న ఆ సుందరిని వేసినవాడు కాదు. పైగా పక్షుల మీద ఇంతటి దయ చూపించినవాడు కూడ కనిపించడు. ఇంకా వినండి: 'మనుష్యుల్లాగా ఈ పక్షులకు పుణ్యపాపాలు తెలియవు. కనిపించినదానితో కడుపు నింపుకోవడమే వాటికి తెలిసిన విద్య. వాటి నోటిముందర ఉండే ఆహారాన్ని అందనీయక, రాళ్ళు రువ్వేపని నీవు చేయవచ్చునా? ఇది న్యాయమా?' ఈ ప్రశ్నకు సమాధానం చెప్పే నాధు డేడి? కవిలోని భూతదయ పరాకాష్ఠ నందింది. అందరిలాగా ఈ కవి కూడ కాపుకన్య అందచందాలకు అలరినవాడే. కాని, ఆమె లోని 'విసపుముద్ద' స్వభావాన్ని గుర్తించి, రూక్షంగా మాట్లాడడంలో తన ప్రత్యేకతను నిల్పుకొన్నాడు.

ప్రకృతిలో స్త్రీ పురుషులు సమానమే ఐనా, కవికి స్త్రీ పట్ల ఆదరాభిమానాలు అధికంగా ఉండడం సహజం. పైగా భారతీయ సంప్రదాయంలో స్త్రీ పట్ల గౌరవం చూపించడం ప్రధాన విషయం. ఈ కవిగారికి వనితల పట్ల అభిమానమే కాదు. వారి నైసర్గిక స్వరూప స్వభావాల పట్ల చక్కని పరిశీలనాసక్తి ఉన్నది. ఒక వనితకు

సంతానం లేదు. ఆమె మానసిక స్థితిని పరిశీలించి కవి ఇట్లా వర్ణించినాడు:

అమ్మ, అమ్మా యటంచు మా యక్క కొడుకు
తలచి తన తల్లిగా నన్ను పిలిచి నపుడు
పులకరించును నెమ్మేను పొటమరించి
మాతృపీఠం బటన్న సామాన్య మౌనె?

ఆమెయే ఇంకొక చోట ఈ విధంగా వాపోయింది.

తల్లి! సంతాన భాగ్యమే తనర దేని
సత్యము వచింతు; వలదు సంసార సుఖము!

ఇంతటి మాట చెప్పించడానికి, సంతాన సౌభాగ్యం కాని స్త్రీ మనస్సును ఆవిష్కరించడానికి కవికి ఉండే నిశిత పరిశీలనాశక్తి మనకు ఆశ్చర్యం కలిగించక పోదు. స్వభావాన్ని మాత్రమే కాదు, స్వరూపాన్ని కూడ చిత్రం లాగ కన్నులకు కట్టించే శక్తి ఈ కవి కలానికి ఉన్నది.

చీరకుచ్చిళ్ళు పదముల చిందులాడ
తెనుగు నాకింద్ల తిరిగెడు తీగబోండ్లు
సరస సల్లాపములు సేయు సమయమందు
పుట్టినింటికి వచ్చెను పౌష్యలక్ష్మి

కాళ్ళకడియాల కరముల కంకణాలు
మధురమధుర స్వనంబుల మాటలాడ
ఆంధ్ర గృహములగారాబుటాడుబిడ్డ-వనిత

భాష, భావం, నుడికారం, అంతా సంప్రదాయ బద్ధంగానే ఉంటాయి రామానుజరావుగారి కవితల్లో. సరళంగా మాట్లాడినట్లు సరళంగా వ్రాయడంలో ఆయన నేర్పరి. రాయప్రోలువారు చెప్పినట్లు ఈ కవి కావ్యకృషి వదలకపోతే, తెలంగాణపు తేనెమాగాణికి ఇంకా అనేక మధురకావ్యాలు అంది ఉండేవి. అయినా, ఈ ఖండకావ్య సంపుటి డాక్టరు దేవులపల్లి రామానుజరావుగారిని సాహిత్యలోకంలో సంప్రదాయ కవిగా నిలచెడుతుందనడంలో సందేహం లేదు.

సాంస్కృతిక చరిత్రకారుడుగా డా॥ దేవులపల్లి

—జి. వెంకటరామారావు

కీ. శే. సురవరం ప్రతాపరెడ్డిగారు 'ఆంధ్రుల సాంఘిక చరిత్ర'ను 1907 సం. తో ముగించారు. 1929 నుంచి 1979 మధ్య-ఈ యాభై ఏళ్ళ కాలంనాటి సాంఘిక, చారిత్రక పరిణామాలను డాక్టర్ దేవులపల్లి రామానుజరావుగారు '50 ఏళ్ళ జ్ఞాపకాలు'గా గ్రంథస్థం చేశారు. మన దేశ, రాష్ట్ర చరిత్రలలో యీ యాభై ఏళ్ళ కాలంలో అనేక ముఖ్యమైన సంఘటనలు జరిగాయి. మహాత్మా గాంధీ నాయకత్వంలో స్వాతంత్ర్య పోరాటాలు, బ్రిటిష్‌వారి నిష్క్రమణ, దేశ విభజన, దేశ స్వాతంత్ర్యం, నెహ్రూ పండితుని నాయకత్వంలో ఒక కొత్త శక్తిగా ప్రపంచ పటంలో స్వాతంత్ర్య భారతదేశ ఆవిర్భావం - దేశ చరిత్రలో ప్రధాన సంఘటనలైనాయి. మన రాష్ట్ర చరిత్రను తీసుకుంటే నిజాం నవాబు పాలనలో ఆంధ్రుల దీనస్థితి, ఆంధ్రోద్యమాలు, ఆంధ్రప్రదేశ్ నిర్మాణం, అటు తర్వాత జరిగిన వేర్పాటు ధోరణులు ముఖ్య సంఘటనలు. దేవులపల్లివారి రచనలలో ప్రధానంగా ఆంధ్రప్రదేశ్ సంఘటనలే ఉన్నా, సందర్భానుసారంగా భారతదేశ సంఘటనలను కూడా ఉదహరిస్తూ వచ్చారు. కనుక యావద్భారతదేశ సాంఘిక పరిణామ చరిత్రగా ఆయన రచనలు రాణకొస్తాయి.

దేవులపల్లివారు తమ అనుభవాల చరిత్రలో ఇద్దరు హైదరాబాద్ రాష్ట్ర ప్రధానుల గురించి ప్రముఖంగా పేర్కొన్నారు. అందులో మొదటివారు మహారాజా సర్ కిషన్‌ప్రసాద్ బహదుర్. కవి గుండెకలవారందరూమహారాజా గురించి గొప్పలు చెప్పుకున్నవారే. ఎందుకంటే-మహారాజా స్వయంగా కవి; కవిపోషకుడు. ఎక్బాల్‌తో సహా ఎందరో ఉర్దు, పార్సీ భాషా కవులను ఆయన ఆదరించారు. కానీ తను ప్రధానమంత్రిగా ఉన్న రాష్ట్రంలో సగంమంది ఆంధ్రులే అన్న భౌగోళిక పరిజ్ఞానం కూడా ఆయనకి ఉండేదికాదు. 'అపర దానకర్ణుడు'గా ఖ్యాతి కెక్కిన మహారాజా ఒక్క తెలుగు కవిని ఆదరించిన పాపాన పోలేదు. ఒక్క తెలుగు సంస్థకు దానం చేసి పుణ్యం కట్టుకోలేదు. 'ముస్లిం సంస్థానానికి హిందూ ప్రధాని'గా వ్యవహరించాడే కాని, అంతకుమించి యీ ప్రాంతంలోని తెలుగు ప్రజలకు ఆయన చేసిన మేలు సున్న. 'మిశ్రమ సంస్కృతి' తెలుగు ప్రజల పట్ల శాపంగా పరిణమించిందన్నా అతిశయోక్తికాదు.

మహారాజా తర్వాత ప్రధానిగా వచ్చిన సర్ అక్బర్ హైదరీ ఉత్తరాది నుంచి వచ్చినవాడు. కాబట్టి గతంతో పోలిస్తే కొంత ఉదార స్వభావం కలవాడే. ఆయన ఫైనాన్స్ సెక్రటరీగా ఉన్నప్పుడే ఉస్మానియా విశ్వవిద్యాలయం స్థాపన జరిగింది. విచిత్రమైన విషయమేమంటే, ఉర్దు భాష తెలియని హైదరీ ఉస్మానియాను ఉర్దు విశ్వవిద్యాలయం చేయటానికి సమ్మతించాడు. (ఉర్దులో మాట్లాడ వలసిన అవసరం వచ్చినప్పుడు హైదరీ ఉర్దు మాటలను ఇంగ్లీసులో వ్రాసుకొని వాటిని ఉచ్చరించేవాడు. ఉర్దు పైళ్ళమీద ఇంగ్లీషులోనే తజ్‌వీజ్ (పరిష్కారం చేస్తుండేవాడు) విశ్వకవి టాగూరు, మహా మేధావి రాజాజీ అంతటివారు ఉస్మానియాకు 'స్వదేశీ విశ్వవిద్యాలయమ'ని కితాబులు ఇస్తుంటే దేవులపల్లివారు 'అధికసంఖ్యాక ప్రజల భాషను

అణగద్రొక్కే' ప్రయత్నంగా దీన్ని పేర్కొని నిజం బైట పెట్టారు. తాను పుట్టి, పెరిగిన మిశ్రమ సంస్కృతి తప్పు దారి పట్టుతుంటే ఆయన నిర్భయంగా విమర్శించటానికి జంకేవారు కాదు. (దేవులపల్లి వారు ఉద్యోగి కాదు. కనుక ప్రభుత్వాని విమర్శించే అధికారం ఆయనకు ఉండేది.) అలాంటి వారికే ఆ రోజుల్లో సాంస్కృతిక రంగంలో పని చేయటానికి వీలుండేది.

సాంస్కృతిక రంగాన్నే వేదికగా చేసుకొని ప్రజాసేవ చేసిన వారిలో తెలంగాణా ప్రాంతంలో ముగ్గురే ప్రధాన వ్యక్తులుగా మనకు కనిపిస్తారు (దీని అర్థం ఇతరులు కాదని కాదు). అందులో మొదటి వారు ఆంధ్ర పితామహ మాడపాటి హనుమంతరావు, రెండవవారు సురవరం ప్రతాపరెడ్డి, మూడవవారు దేవులపల్లి రామానుజరావు.

హైదరాబాద్ రాష్ట్రానికి నిజాం కబంధ హస్తాల నుంచి విముక్తి లభించగానే అధికార మార్పిడి తప్ప తక్షణంగా లభించిన మేలుకూడా ఏమీలేదు. అటుతర్వాత ఒక తెలుగు నాయకుడు ముఖ్య మంత్రి అయ్యాడనే సంతృప్తి తప్ప తెలుగు సంస్థలకు పెద్దగా ఒనగూడింది కూడా ఏమీలేదు. దీనికి ఆనాటి ముఖ్యమంత్రిని నిందించి లాభంలేదు. ఈనాడు మన రాష్ట్రంలో ప్రాంతీయ విభేదాలు ఎలా వెర్రితలలు వేస్తున్నాయో ఆ రోజుల్లో తెలంగాణా, మరట్వాడా, కర్నాటక విభేదాలు ఉండేవి. తెలుగు సంస్థలు వర్థిల్లాలంటే ఆ సాంఘిక కృషి అవసరం తగ్గలేదు. ఆంధ్ర సారస్వత పరిషత్తు, తెలంగాణా రచయితల సంఘం మొదలైనవి అలాగే వర్థిల్లినవి కదా. అవి తామరతంపరగా అభివృద్ధి చెందటానికి దేవులపల్లివారు చేసిన కృషి ప్రత్యేక వ్యాసంలో పేర్కొనవలసినదే.

సంస్థానాలను రద్దుపరచకుండా 'విశాలాంధ్ర' కోరడం రాజ్యాంగపరంగా సాధ్యమయ్యే పని కాదు. హైదరాబాద్ రాష్ట్ర విచ్ఛిన్నం భాషా రాష్ట్రాల వాదనతో అంతర్లీనమై ఉంది. హైదరాబాద్ రాష్ట్రంలోని తెలుగు, మరాఠీ, కన్నడ నాయకులు, సాంఘిక సంస్థలు - అన్నీ కలిసి ఒకే బాణంతో రాష్ట్ర విచ్ఛిత్తికి పోరాడాలి. దీనికి నాయకుడు హైదరాబాద్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు స్వామీ రామానందతీర్థ. స్వామీజీ ఆశీస్సులు పొందని సంస్థ నాడు రాష్ట్రంలో లేనేలేదు. తెలుగువారు వెనుకా ముందూ పోయినా స్వామీజీ మాత్రం తెలంగాణా విశాలాంధ్ర భాగం కావాలని ఆదినుంచి చెపుతూవచ్చారు. నిజాం రాష్ట్రాన్ని విచ్ఛిన్న పరచడం ఆయన స్వప్నం. ఆ స్వప్నం ఫలించే రోజులు రానున్నాయి. తెలంగాణా ప్రాంతం ఆంధ్రలో కలవాలి. మరట్వాడా మహారాష్ట్రలో, కర్నాటక్ మైసూర్‌లో కలిసిపోవాలి. హైదరాబాద్ సంస్థాన విచ్ఛిన్నం కోసం పుట్టిన కారణజన్ముడుగా చాలామంది స్వామీజీని గుర్తించుకుంటారు. ఇది కొందరి దృష్టిలో నిజం కావచ్చు. మరి కొందరికి నచ్చకపోవచ్చు. కానీ డా. రామానుజరావుగారు మాత్రం యదార్థంగానే చెప్పారు. విశాలాంధ్రకు స్వామీజీ ఆశీస్సులు లభించాయనీ, ఆయన నాయకత్వంలో అందరు కలిసి పోరాటం చేశారని చెప్పడం రామానుజరావుగారి విశాలదృష్టికి తార్కాణం. మనం పండు తింటున్నాం. అంటు వేసిన వారిని జ్ఞాపకం చేసుకోవాలి కదా!

'ఆంధ్ర' అనే శబ్దం ఉంటే అది బ్రిటిష్ ఆంధ్రులు, నిజాం ఆంధ్రుల ఏకీకరణకు దారితీస్తుందని భయపడి ఆ శబ్దం పేరు పెట్టనీయలేదు నిజాం ప్రభుత్వం. అయితే ఏం? జాతిని అవమానపరిచే యీ హుకుంను ఖాతరు చేసినవారెవరు? 'ఆంధ్ర పితామహ' అన్నామే కానీ 'తెలంగాణా పితామహ' అని అన్నామా? 'ఆంధ్ర' సారస్వత పరి

షత్తుగా చెలామణి అయిందేకానీ 'తెలంగాణా' సారస్వత పరిషత్తుగా చెలామణి కాలేదు. శ్రీకృష్ణదేవరాయ ఆంధ్ర భాషా నిలయాన్ని, 'తెలుగు భాషా' నిలయంగా పేరు మార్చుకోలేదు. ఇంకా ఎన్నో సంస్థలు 'ఆంధ్ర' శబ్దం పేరుతోనే పుట్టాయి, పెరిగాయి. తన స్వేచ్ఛ తోనే స్వాతంత్ర్యం కోల్పోతే జాతిసత్వం తగ్గుతుందా? ప్లెబిసైట్ ద్వారా నిరంకుశ పాలనను ఎన్నుకుంటే చేతులారా చేసుకున్నందుకు స్వతంత్రులుగా కొనసాగినట్లేనా?' హర్బర్ట్ స్పెన్సర్ అన్న యీ మాటలు మనలో చాలామందికి పరిచితం కాకపోవచ్చు. ఆనాటి నిజాం కాలంలో బాధ పడ్డవారు మనలో కొందరున్నారు. ఒక పద్ధతి ప్రకారం పౌర స్వేచ్ఛలను కుంచించి, ప్రాథమిక హక్కులను తొలగించి నప్పుడే నిజాం రాష్ట్రం నామరూపాలు లేకుండా పోతుందనుకున్నారు. ఎవరెవరు ఎలా అనుకున్నారో దేవులపల్లి వారి రేడియో ప్రసంగాలు తెలుపుతాయి.

రాజకీయాలలో డాక్టర్ రామానుజరావు గారు మదనమోహన మాలవ్యా లాంటి వారు కనుక, రాష్ట్ర రాజకీయ ఎత్తు పల్లాలతో ఆయన సంబంధం పెట్టుకోలేదు. కానీ, పట్టిన సాంస్కృతిక రంగం కొంగు బంగార మైంది. సమస్తాంధ్రమే కాదు, అఖిల భారతం నాదన్న విశాల దృష్టి ఆయనలో ఏర్పడింది. రాష్ట్ర సమైక్యత కోసం మిశ్రమ సంస్కృతి వర్ధిల్లటం కోసం నిర్విరామంగా కృషి సల్పుతున్న వారిలో ఆయన అగ్రగణ్యులు. ఏ సంస్థకైనా అది ఉర్దూ సంస్థకానీ, తెలుగు సంస్థ కానీ చేయూత నిచ్చే ఉదార స్వభావం వీరిలో ఉంది. అందుకే ఆచార్య సి. నారాయణరెడ్డి గారి పట్ల ఎంత గౌరవం భావం చూపుతారో 'సియాసత్' పత్రికా సంపాదకులైన జనాబ్ ఆబిద్ అలీ ఖాన్ గారి పట్ల అంతటి ఉదార భావం వ్యక్త పరస్తున్నారు. అది హైదరాబాద్ విశిష్ట సంస్కృతి లక్షణం. లక్ష్యం కూడా.

ఇంతటి గురుతరమైన బాధ్యతను మోస్తున్న దేవులపల్లివారిని అర్థం చేసుకున్న వారు బహు కొద్ది మంది. అపార్థం చేసుకున్న వారెందరో....కారణం వారు తమకు సంబంధం లేని విషయాలలో జోక్యం కలిగించుకోరు. పనిలేకపోయినా పదిమందిని పోగుచేసుకొని రాజకీయ తంత్రాంగం నడపడం తెలియని మేధావి. పలకరిస్తే పలుకుతారు. లేకపోతే ముక్కుకు సూటిగా వెళ్ళిపోతూ ప్రక్కనెవరున్నారో కూడా గమనించరు. ఆయన ఓ రకమైన 'భావకవి.' డాక్టర్ దేవులపల్లి రామానుజరావు భావుకుడు. వారికున్న భావాల్లో 'అహంభావం' కూడా ఉందని కొందరి ఆరోపణ. వారికి దూరంగా ఉండి చూచేవారు అనే మాటలవి. వారికి లేనిదే అహంభావం. అది వుంటే సారస్వత పరిషత్తు సర్వసభ్యపరిషత్తుగా నిలిచేది కాదు. ఇంతకాలం నిలువ కలిగేది కాదు.

విమర్శకుడుగా
డాక్టర్ దేవులపల్లి రామానుజరావుగారు

—డా॥ జి.వి. సుబ్రహ్మణ్యం

విమర్శకుడుగా డాక్టర్ దేవులపల్లి రామానుజరావుగారిని గురించి అభినందన సంచికలో వ్యాసం వ్రాయుమని ఆప్తమిత్రులు ఆచార్య రవ్వా శ్రీహరిగారు, డాక్టర్ ఎల్లూరి శివారెడ్డిగారు అడిగిన తరువాత నాకున్న యోగ్యతకంటె రామానుజరావుగారి పట్ల నాకున్న గౌరవప్రపత్తులను స్మరించి సంతోషంగా అంగీకరించాను. ఈ వ్యాసంలో నా శక్తికంటె భక్తియే ముఖ్యమని సహృదయులకు ముందుగా మనవి చేసుకొంటున్నాను.

డాక్టర్ దేవులపల్లి రామానుజరావుగారిని విమర్శకులుగా వివేచించే ముందు నన్ను వారు విమర్శకుడుగా ముందుకు నడవటానికి ఇచ్చిన ప్రోత్సాహాన్ని ముందుగా పేర్కొనటం నా కర్తవ్యం అవుతుంది. దాదాపు నాలుగు దశాబ్దాల కాలంనుంచి ఆంధ్ర సారస్వత పరిషత్తుతోనూ, డాక్టర్ దేవులపల్లి రామానుజరావుగారితోనూ నాకు సన్నిహితసంబంధం ఉంది. నేను నిజాం కళాశాలలో తెలుగు అభిమాన విషయంగా తీసుకొని బి.ఏ., చదువుతున్న కాలంలో (1953-55) పరిషత్తు నిర్వహించే సాహిత్య కార్యక్రమాలలో పాల్గొంటూ ఉండేవాణ్ణి. నాకు వ్యాసరచన పోటీలలో అప్పుడు బహుమతులు వస్తూ ఉండేవి. ఆంధ్ర సారస్వత పరిషత్తువారు నిర్వహించిన అటువంటి పోటీలలో నేను సురవరం ప్రతాపరెడ్డి బహుమతిని పొందాను. డాక్టర్

దేవులపల్లి రామానుజరావుగారు ఆ బహుమతిని నా కిచ్చారు. ఆనాటి నుండి సారస్వత పరిషత్తుతో ఏదో ఆత్మీయమైన అనుబంధం ఏర్పడింది; రామానుజరావుగారంటే అపారమైన గౌరవభావ మేర్పడింది. అదే క్రమంగా అభివృద్ధి చెంది నాచేత 'సారస్వత సౌరభము' అనే వ్యాస సంకలనాన్ని వారికి అంకిత మిచ్చేటట్లు చేసింది.

నా జీవితాన్ని మలుపు తిప్పిన మరొక సన్నివేశం తప్పక చెప్పాలి. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీవారు నా వీరరసం గ్రంథానికి బహుమతి ప్రకటించారు. అప్పుడు నేను వరంగల్ ఆర్ట్సు అండ్ సైన్స్ కళాశాలలో ఉపన్యాసకుడుగా పని చేస్తున్నాను. ఆ రోజుల్లో నాటకాలూ, నాటికలూ, నవలలూ, కథలూ, కవితలూ, విమర్శలూ వ్రాస్తుండే వాణ్ణి. అన్ని ప్రక్రియల్లోనూ గుర్తింపు వస్తున్న రోజు లవి. సాహిత్య అకాడమీ అవార్డు వచ్చిన తరువాత డాక్టర్ దేవులపల్లి రామానుజరావు గారిని కలిశాను. వారితో సన్నిహితంగా మాట్లాడటం అప్పుడే. అకాడమీ కార్యదర్శి వారు. నాలోని ఉత్సాహాన్ని చూచి వారు సంతోషించి, నా సాహితీ వ్యాసంగాన్ని గురించి సమీక్షించి, చివరకు ఒక సలహా యిచ్చారు. "కవితా రంగంలోనూ, నాటక రచనా రంగంలోనూ, నవలా రచనా రంగంలోనూ రచయితలు చాలమంది వివిధ ప్రయోగాలతో ముందుకు సాగుతున్నారు. కాని విమర్శ రంగాన్ని ఉన్నత ప్రమాణాలతో వికసింపజేయ గలిగిన విమర్శకులు తెలుగులో ఇప్పుడు అవసరంగా ఉన్నారు. మీలాంటి యువకులు ఆ రంగంలో కృషిచేయాలని నేను ఆశిస్తున్నాను. మీరు ఇక ముందు విమర్శకూ, పరిశోధనకూ అంకితమైతే నేను సంతోషిస్తాను" అని తమ సహజ గంభీర స్వరంతో భవిష్యద్వాణి పలికినట్లు తీర్మానించారు. వారిమీద నాకున్న గౌరవభావం వారి సలహాను శిరసా వహించేటట్లు చేసింది. ఆనాడు వారలా నన్ను విమర్శ మార్గం వైపు ప్రత్యేకించి మళ్ళించకపోయినట్లయితే నేనొక నటుణ్ణో,

నాటకకర్తనూ అయి ఉండేవాణ్ణేమో! కాబట్టి నా జీవితంలో సాహిత్య విమర్శకుడుగా నేనేవైనా ముందడుగులు వేసి ఉంటే బాటికి తొలి ప్రేరణ యిచ్చినవారిలో డాక్టర్ దేవులపల్లి రామానుజరావుగారిని ముందుగా చెప్పుకోవలసి ఉంటుంది. బహుశః నాలాగ మరెందరి యువకులను కార్యకర్తలుగా, కావ్యకర్తలుగా, విమర్శకులుగా వారు మార్చారో బహిష్యత్తు బహిర్గతం తప్పక చేస్తుంది. నన్ను విమర్శకునిగా మార్చిన సాహితీమూర్తిలో విమర్శకుని దర్శించటం ఈ చిన్ని వ్యాసంలోని తాత్పర్యం!

డాక్టర్ దేవులపల్లి రామానుజరావుగారి వ్యక్తిత్వంలో ముఖ్యంగా దేశాభిమానం, భాషాభిమానం, సాహిత్యాభిమానం అనే మూడు శక్తులు కలిసి ఒక సంగమతీర్థంగా ప్రత్యక్షమౌతాయి. దేశాభిమానంతో వారు ప్రభుత్వోద్యోగంలో చేరకుండా స్వతంత్ర ప్రవృత్తితో తెలంగాణా విమోచనోద్యమంలోనూ, ఆంధ్రప్రదేశ్ అవతరణయత్నంలోనూ, జాతీయోద్యమ, ఆంధ్రోద్యమాలలో పాలుపంచుకోవటంలోనూ తమ ప్రత్యేకతను ప్రదర్శించారు. వారి భాషాభిమానం గ్రంథాలయోద్యమంలోనూ, ఆంధ్ర సారస్వత పరిషత్ కార్యక్రమ నిర్వహణలోనూ, పత్రికా సంపాదకత్వం నిర్వహణలోనూ, ఆంధ్ర ప్రదేశ్ సాహిత్య అకాడమీలాంటి సంస్థల ద్వారా భాషాసాహిత్యసేవ చేయటంలోనూ చొరవ చూపింపచేసింది. వారి సాహిత్యాభిమానం వారిని కవిగా, వ్యాసకర్తగా, పత్రికారచయితగా, సాంస్కృతిక, సామాజిక, రాజకీయ పునరుజ్జీవనచరిత్ర సమీక్షకునిగా, కార్యకర్తగా, సాహిత్య విద్యాసంస్థల నిర్వాహకునిగా, సమకాలీన సాహిత్య చరిత్ర గతిలో పాలుపంచుకొన్న నిర్మాణాత్మక సాహితీరంగ మేధావిగా విలువైన పాత్ర నిర్వహించేటట్లు చేసింది.

డాక్టర్ రామానుజరావుగారి దేశాభిమానం వారిలోని కవితా శక్తిని జాగృతం చేసి పొంగింప చేసింది. 'పచ్చతోరణం' వారి పద్య రూప దేశాభిమానానికి హృద్యమైన ఉదాహరణం. 'జననీ జన్మ భూమిశ్చ స్వర్గాదపి గరీయసి' అన్నట్లు వారు ఓరుగల్లుమీద వ్రాసిన ఖండకావ్యం తెలుగు సాహిత్యంలోని ప్రబోధ కవితాశాఖలో వెలువడిన విలువైన కళాఖండంగా కావ్య విమర్శకులు గుర్తించారు. అందులోని అయిదు సీసపద్యాలూ పంచరత్నాలు. ఓరుగల్లు కోటను దర్శించే సమయంలో సాహితీపరులు ఆ పద్యాలను స్మరించుకుంటూ పులకిస్తూ ఉంటారు. మచ్చుకు ఈ పద్యం గమనించండి:

"తిక్కనామాత్యుండు తెలుగుదేశపురాజు
   కలిసి మాటాడిన కొలువిదేమొ
అన్యదేశాధీశు లర్పించు కాన్కల
   ఆ రాజు లిచటనే అందిరేమొ
కాటుక కన్నుల కావ్యకన్యక నాఁడు
   పోతన నిచటనే పోల్చెనేమొ
పురికొల్పెనో యేమొ పూఁబోఁడి యొక్కర్తు
   రణరంగమున కేగ రమణు నిచట
అనుగుమిత్రుని తోడుత నాంధ్రనగరి
వీథి గడియారపు న్మొత్రిత విని యొకండు
పూటకూటింటి కల్లనబోయి ముదము
గులుక విందారగించిన స్థల మిదేమొ!"

డాక్టర్ రామానుజరావుగారు 'మా వూరు - ఓరుగల్లు' వ్యాసం కూడా వ్రాశారు. పద్యాల్లో ఎంత ఆవేశాన్ని, ఆర్ద్రతనూ ప్రదర్శించారో మాటల్లో కూడా అంత ఆత్మీయతనూ, తాదాత్మ్యాన్ని ప్రకటించారు. ఆ వ్యాసం ఎత్తుగడ చదివితేనే పఠితకు ఒడలు పులకిస్తుంది;

పుట్టినగడ్డ తీపిరుచులు చారిత్రిక స్మృతుల రూపంగా చర్వణానికి అందుతాయి. వినండి-

"మా ఊరిని గూర్చి మాట్లాడినపుడు ఇప్పటికి సుమారు ఎనిమిదినూర్ల సంవత్సరాల క్రిందట జరిగిన ఒక చిన్న సంఘటన తలపునకు వస్తుంది. మా ఊరిలోని వాడవాడన వేడుకతో విహరించి, మిట్టమధ్యాహ్నమున వీథి గడియారము రెండెనిమిదులను, అనగా, ఇప్పటి పన్నెండు గంటలను కొట్టగానే ఇద్దరు రసిక హృదయులు పూటకూటి ఇంటికెళ్ళి ఒక్క రూక వ్యయముతోనే షడ్రసోపేతమైన భోజనము చేసిన ఉదంతము ఎన్నటికీ మరువరానిది. ఇన్ని నూర్ల సంవత్సరాలు గడచినప్పటికిని ఈ ఉదంతము మన స్మృతిలో ఇంత స్పష్టముగా మెదలడానికి కారణము కప్పుర భోగ వంటకము, కమ్మని గోధుమ పిండి వంట, గుప్పెడు పంచదార, క్రొత్తగా కాచిన ఆవు నెయ్యి, అరటిపండ్లు, పెసరపప్పు లప్పలతోడ క్రొంబెరుగు నాలుగైదు నంజుళ్ళతో లక్ష్మణ వజ్ఝల పూటకూటి యింటిలో ఆనాటి మిట్ట మధ్యాహ్నమున ఇద్దరు స్నేహితులకు దొరికిన షడ్రసోపేతమైన భోజనము నేటికిని శ్రీనాథకవి సార్వభౌముని క్రీడాభిరామములో మన జిహ్వకు విందు జేయుచుండటమే! తెలుగు సాహిత్యముతో పరిచయమున్నవారందరును నాడు మా ఊరు ఓరుగల్లు వడ్డించిన వంటకాల రుచి చూచినవారే!"

పద్యంలో కానీ, విమర్శలో కానీ డాక్టర్ దేవులపల్లి రామానుజ రావు గారు పఠితకు అనుభూతి నందించే అభివ్యక్తిని ఆవిష్కరించ గలిగే శక్తిని సహజంగా ప్రదర్శిస్తారు. ఆ శక్తికి ఆయుస్సూత్రం వారి దేశభక్తిలో ఉంది.

విమర్శకుడుగా డాక్టర్ దేవులపల్లి రామానుజరావుగారి మూర్తి మత్వాన్ని వివేచించేటప్పుడు అందులో ఒక చరిత్ర పరిశోధకుని

వ్యక్తిత్వం, ఒక పత్రికా సంపాదకుని ప్రవృత్తి, ఒక సాహితీ సమారాధకుని సమీక్షా దృక్పథం ముప్పేటగా ముడిముడి ఉన్నట్లు స్పష్టంగా దర్శించవచ్చు.

సమకాలీన చరిత్రను అర్థం చేసుకొంటూ ఆ కాలంలోని ఉద్యమాలలో పాల్గొనటంతో పాటు, తాను పాల్గొంటున్న చారిత్రక ఘట్టాల వాస్తవాలను, తత్వాలను వ్యాఖ్యానించగలిగే సామర్థ్యం సామాన్య సాహిత్య విమర్శకులకు ఉండటం కష్టం. తెలుగులో మల్లంపల్లి సోమశేఖర శర్మగారు, కొమర్రాజు లక్ష్మణరావు పంతులు గారు, మాడపాటి హనుమంతరావు పంతులుగారు మొదలైన విజ్ఞుల చారిత్రక పరిజ్ఞాన స్పృహను డాక్టర్ రామానుజరావుగారు అవలీలగా అలవరచుకొన్నారు. న్యాయవాద వృత్తికి తగిన అర్హత లున్నాయి కాబట్టి వారికీ లక్షణాలు సహజంగా అలవడ్డాయని చెప్పలేము. కాని వారికి గతాన్ని, వర్తమానాన్ని, భవిష్యత్తును అన్వయించుకొనే స్పష్టమైన అవగాహన శక్తి ఉండబట్టి ఒక చారిత్రక విద్వాంసుని పాత్రను సమర్థవంతంగా నిర్వహింపగలిగారు.

ఒక్క మాటలో చెప్పాలంటే, 1900 - 1980 వరకూ తెలంగాణాలో జరిగిన జాతీయోద్యమాలను గురించి, సాంస్కృతిక పునరుజ్జీవనం గురించి, తెలంగాణా ఆంధ్ర ప్రాంతాలలోని సాహితీ మూర్తుల సంబంధాలను గురించి సాధికారికంగా తెలుగులో నేడు చెప్పగలిగిన చారిత్రక సమీక్షకులు డాక్టర్ రామానుజరావుగారే. వారు రచించిన 'తెలంగాణాలో జాతీయోద్యమాలు', 'తెలుగు సీమలో సాంస్కృతిక పునరుజ్జీవనం' 'యాభై సంవత్సరాల జ్ఞాపకాలు' (1929-79) - ఈ మూడు గ్రంథాలూ ఆయా ప్రక్రియలకు ప్రమాణాలుగా నిలిచే ప్రయోగాలే కాకుండా ఈ శతాబ్ది తెలంగాణా చరిత్ర నిర్మాణానికి మూలసామగ్రిని సప్రమాణంగా అందిస్తున్న చారిత్ర

కాధార రచనలు. అపూర్వ విషయాలను రికార్డుచేసి చారిత్రక విమర్శ కుని పాత్రను చరిత్రాత్మకంగా నిర్వహించారు డాక్టర్ దేవులపల్లి రామానుజరావుగారు.

ఆ రోజుల్లో ఆంధ్రచరిత్రను త్రవ్వి విలువైన వాస్తవాలను వెలికి దీసి సాహిత్యస్పృహతో వెలయింప గలిగిన మల్లంపల్లి సోమ శేఖరశర్మగారన్నా, వారి రచనలన్నా రామానుజరావుగారికి అపార మైన గౌరవాదరాలున్నాయి. ఎన్నో వ్యాసాలలో వారి పరిశోధన ఫలితాంశాలను, అభిప్రాయాలను, నిర్ణయాలను తాము గౌరవంగా ఉట్టంకించారు. అలాగే, ఈ శతాబ్దిలో తెలంగాణ ప్రాంతంలో సాగిన పునరుజ్జీవన చైతన్యానికి సంబంధించిన చరిత్ర విశేషాలనుగాని, వివిధ ఉద్యమాల పుట్టుపూర్వోత్తరాలనుగాని, భాషా సాహిత్య సాంస్కృతిక సహజీవనంలోని సజీవ సమస్యలను గురించిగాని ప్రామాణికంగా తెలుసుకోవాలంటే డాక్టర్ రామానుజరావుగారి రచ నలు విలువైన ఆకరాలుగా ఈనాడు మనకు ఉపకరిస్తున్నాయి. రామానుజరావుగారి తరం రచయితలకు మల్లంపల్లి సోమశేఖరశర్మ గారు ఎలా చరిత్ర పరిశోధకులుగా, సాహితీమూర్తిగా ప్రామాణికులై ఉండేవారో ఈతరం వారికి తెలంగాణా పునరుజ్జీవన చరిత్రాంశాలలో రామానురావుగారు అలా ప్రామాణికులుగా పరిగణింపబడుతున్నారు.

డాక్టర్ దేవులపల్లి రామానుజరావుగారిలో మల్లంపల్లివారి సాహితీ వ్యక్తిత్వం, కొమర్రాజువారి శాస్త్రీయ దృక్పథం, మాడపాటి వారి వాస్తవవిశ్లేషణ ప్రవృత్తి కలిసి జాలువారాయి. వారిలో సహ జంగా న్యాయవాది కుండే సత్యనిరూపణ ప్రవృత్తి బలంగా ప్రకటిత మౌతుంది. డాక్టర్ రామానుజరావుగారు ఏదైనా వ్యాసంగాని, గ్రంథం గాని వ్రాయటానికి ముందు ఒక అడ్వొకేట్ ఒక కేసును ప్రతిపా దించడానికి తీసుకొనే జాగ్రతలన్నీ వారు పాటిస్తారు. సామగ్రి సమ

గ్రంగా సేకరిస్తారు: దానిని స్పష్టమైన అవగాహనతో విశ్లేషిస్తారు; కొన్ని కచ్చితమైన నిర్ణయాలను తర్కబద్ధంగా తీసుకొంటారు; తాము ప్రతిపాదింపదలచుకొన్న అంశాన్ని గురించి కూలంకషంగా చర్చించి ఒక నిశ్చితాభిప్రాయానికి వస్తారు; దానిని అస్పష్టత లేకుండా, పండొలిచి చేతులో పెడుతున్నట్లు వ్యక్తీకరించటానికి ప్రయత్నిస్తారు. రామానుజరావుగారు వ్యాసం వ్రాయటానికి ముందే ఎంతో మధన పడతారు. మజ్జిగ చిలికిన తరువాత వెన్న తీసినట్లు సారస్వత నవనీతాన్ని మనకు అందిస్తారు. వారి వ్యాసాలలో అస్పష్టత మందుకైనా దొరకదు; తర్కబద్ధమైన ఆలోచన ఎక్కడా కుంటుపడదు; లక్ష్యం లేకుండా అక్షరం ముందుకు సాగదు; ప్రతి పాద్యాంశాన్ని అన్ని అంచులతో ఆవిష్కరించే అప్రమత్తత అడుగడుగునా ప్రత్యక్షమౌతుంది; ఎంత జటిలమైన విషయాన్నైనా సరళంగా, స్పష్టంగా, సహజంగా, సంగ్రహంగా చెప్పటంలో నిష్ఠ గోచరమౌతుంది; మొత్తం వ్యాసం చదివితే ఒక నిర్మాణ శిల్పం పఠితల మనస్సుల్లో ప్రసన్నమౌతుంది. అందువలన డాక్టర్ రామానుజరావుగారు చరిత్రను గురించి వ్రాసినా, సంస్కృతిని గురించి సమీక్షించినా, సాహిత్యాంశాలను గురించి వివేచించినా వారి రచన ఒక వాస్తవ కథనం కంటె విశిష్టంగా సాహిత్య కళాఖండ గౌరవాన్ని సంతరించుకొంటుంది. అది వారి విమర్శ వ్యక్తిత్వం ప్రకటించే ప్రతిభాస్వభావం.

డాక్టర్ దేవులపల్లి రామానుజరావుగారి విమర్శక వ్యక్తిత్వంలో జీవచైతన్యంగా వెలుగొందే శక్తి వారి పత్రికారచనా ప్రవృత్తి. వారి వ్యాసాలలో సగానికి పైగా పత్రికల కోసం వ్రాసినవే. మరికొన్ని రేడియో ప్రసంగాలు. మరికొన్ని వివిధ సాహిత్య సభలలో చదివినవి; వివిధ సందర్భాలలో వ్యాసాలుగా వ్రాసినవి. అన్నింటిలో కంటె అధిక సంఖ్యలో వారి పత్రికా వ్యాసాలే వెలువడ్డాయి. దానికి కారణం లేకపోలేదు. తెలంగాణా పునరుజీవనంలో

పత్రికల పాత్ర గణనీయమైంది. అందులో సురవరం ప్రతాపరెడ్డి గారితో కలిసి రామానుజరావుగారు పత్రికాప్రపంచంలో సాగించిన సాహిత్య, సాంస్కృతిక, రాజకీయ చైతన్యపరమైన ఉద్యమం చరిత్రలో విస్మరించలేనిది. ఈ శతాబ్ది రెండు మూడు చరణాల్లో రామానుజరావుగారు వ్యాసం వ్రాయని తెలుగు పత్రిక తెలంగాణంలో లేదంటే అతిశయోక్తి కాదు. కొన్నాళ్ళు గోల్కొండ పత్రికకు సంపాదకీయాలు వారే వ్రాశారు. శక్తిమంతుడైన పత్రికా సంపాదకునికి ఉండవలసిన వ్యక్తిత్వం డాక్టర్ రామానుజరావుగారిలో పుష్కలంగా ఉంది. తెలుగులో పత్రికా సంపాదకులు పత్రికా రచనకు పెట్టిన ఒరవళ్ళను గురించి ప్రత్యేకంగా అధ్యయనం జరిగితే, రామానుజ రావుగారు దినపత్రికా సంపాదకీయాలలోనూ, సాహితీ పత్రికావ్యాసాల లోనూ చేసిన ప్రయోగాలను గురించి ఒక ప్రత్యేక అధ్యయనం చేయదగినంత నేర్పరితనాన్ని ప్రదర్శించారు.

నిజం చెప్పాలంటే - డాక్టర్ దేవులపల్లి రామానుజరావు గారి విమర్శ జీవితానికి వెలుగు నిచ్చేది వారి పత్రికా రచనా ప్రవృత్తి. ఈ శతాబ్ది పూర్వార్ధంలో పత్రికా రచనకు ఒక సాహిత్య స్థాయి ఉండేది; పత్రికా వ్యాసంలో రచయిత వివిధాంశాలలో చేసిన పరిశ్రమ ప్రతిఫలిస్తూ ఉండేది. ఒక సంపాదకుని స్థాయిలో నున్న సాహితీ మూర్తి వ్యాసం వ్రాస్తే అందులో ప్రామాణికంగా పరిగణింపదగిన ఎన్నో విలువల వివేచనలు వెలువడుతుండేవి. పత్రికా రచన జాతికి ప్రత్యక్షంగా చెప్పుకొంటున్న సప్రమాణమైన సంజాయిషిలాగా, వాస్తవ మైన విశ్లేషణలాగా, బాధ్యతాయుతమైన కళాభివ్యక్తిలాగా, నడుస్తున్న చరిత్ర వ్యక్తీకరిస్తున్న సత్యస్వరూపం లాగా అనిపించేది. అటువంటి అనుభూతి నందింపగలిగే ఒక శైలి పత్రికా సంపాదకుల కుండేది. ఆ కోవకు చెందిన పత్రికా రచన డాక్టర్ రామానుజరావు గారిది.

డాక్టర్ దేవులపల్లి రామానుజరావు గారికి భాషా సాహిత్యాల మీద అపారమైన ప్రేమాభిమానాలున్నాయి. ఆంధ్రత్వాన్నీ, ఆంధ్ర భాషనూ, ఆంధ్ర సంస్కృతినీ, ఆంధ్రుల చరిత్రనూ మనసార ప్రేమించే సాహితీ మూర్తులలో రామానుజరావుగారు అగ్రగణ్యులు. రాయప్రోలు, విశ్వనాథ మొదలైన కవులు రచించిన ప్రబోధ కవిత్వ ప్రభావంతో ప్రతిభావంతంగా కవిత లల్లటమే కాకుండా, వ్రాసిన ప్రతి వ్యాసంలో తమ దేశభాషాసాహిత్యాభిమానాన్ని సంయమనంతో సమన్వయ దృష్టితో ప్రకటించిన సాహిత్య సమారాధకు డాయన.

తెలంగాణలో సాగిన సాహిత్య చైతన్యాన్ని తెలియక ఎవరైనా తక్కువ అంచనా వేస్తే అభినివేశంతో అక్కడి తెలుగు వెలుగులను అఖిల ప్రజానీకానికి చాటి చెప్పటానికి కలంపట్టి కొన్నాళ్ళు తెలుగువారి సాహిత్య సమగ్రావగాహనకు కృషి చేశారు డాక్టర్ రామానుజరావుగారు. తీర ప్రాంతంలోనూ, రాయలసీమ ప్రాంతంలోనూ సాగిన సాహిత్య వికాసానికీ, తెలంగాణలో సాగిన సాహిత్య వికాసానికీ ఉన్న భేదాన్ని విడమరచి చెప్పటమే కాకుండా, ఒక్కుమ్మడిగా తెలంగాణా సాహిత్య చైతన్యం ఎన్ని ఉద్యమాలను సాగించి, కష్ట నిష్ఠురాలను ఎదుర్కొని స్వతంత్ర భారత చైతన్యంతో దీటుగా రావలసి వచ్చిందీ, ఆ సంఘర్షణలో తెలంగాణా ఎదుర్కొన్న సమస్యలను, సాధించిన విజయాలను, తెచ్చిన సమన్వయాలనూ, చేసిన త్యాగాలనూ ముక్తకంఠంతో తన సాహిత్య విమర్శ వ్యాసాల ద్వారా తెలియ జెప్పిన సహృదయ విమర్శకులు డాక్టర్ రామానుజ రావు గారు.

ఉత్తమ విమర్శకునికి ఉండవలసిన లక్షణాల నన్నింటిని తమ సాహితీ వ్యక్తిత్వంలో పండించుకొన్న పరిణత సాహితీమూర్తి డాక్టర్ దేవులపలి రామానుజరావుగారు. ఎన్నుకొన్న అంశంమీద గాఢమైన

అవగాహన లేనిదే కలం చేతపట్టరు రామానుజరావుగారు. తాము చెప్పదలచుకొన్న విశేషాంశాలను స్పష్టంగా నిరూపించుకోనిదే వ్యాసానికి శ్రీకారం చుట్టరు. వ్యాసాంశానికి సంబంధించిన విషయవివేకాన్ని ప్రదర్శించి తమ నిర్ణయాలను నిర్భయంగానూ, నిర్ద్వంద్వంగానూ ప్రకటించటానికి వెనుకాడరు. అనవసరంగా వివరించటం వారికి గిట్టదు. అవసరమైన అంశాన్ని విడవటం వారికి చేతకాదు. వారు వ్రాసే వ్యాసంలో ఒక్క వాక్యం కూడా మనం తీసివేయలేం. ఒక వాక్యం మీద మరొక వాక్యం తర్కబద్ధమైన ఆలోచనకు సోపానంగా నిలిచిఉంటుంది. అందువలన రామానుజరావుగారి విమర్శ వ్యాసం ప్రత్యక్షర సార్థకం; సాహిత్యసార సంగ్రహం.

డాక్టర్ రామానుజరావుగారు విమర్శలో చేసే కొన్ని నిర్ణయాలు, ప్రకటించే అభిప్రాయాలు న్యాయాధికారి తీర్పుల్లాగా ఉంటాయి. ఆ ప్రవృత్తి వారికి సాహిత్యరంగంమీద ఉన్న అభిమానాన్ని, అధికారాన్ని తెలియజేస్తుంది. కొన్ని వాక్యాలు గమనిద్దాం:

1. "రాజకీయంగా వేరుపడిపోయినప్పటికిని భాషాదృష్ట్యా తెలంగాణా ప్రాంతం ఆంధ్ర ప్రాంతంలో సన్నిహిత సంబంధం కలిగియుండినది. ఈ సంబంధాలు ఎన్నడూ తెగిపోలేదు. కావున తెలంగాణా ప్రాంతంలో తెలుగు పాండిత్యం లేదని, తెలుగు సంస్కృతికి చోటు లేదని ఆంధ్రప్రదేశ్ యేర్పడక పూర్వం కొన్ని వర్గాలలో వ్యాపించిన అభిప్రాయం సరియైనది కాదు." (తెలంగాణ సాహితీ వికాసము. వ్యా).)

2. "తెలంగాణా ప్రాంతంలో తెలుగు దీపాలు ఎన్నడూ ఆరిపోలేదన్నది సత్యం." (తెలంగాణా సాహితీ వికాసము (వ్యా)).

3. "తెలంగాణా సాహిత్య రంగంలో నవయుగోదయానికి వైతాళికులు నిస్సందేహంగా కొమర్రాజు వేంకట లక్ష్మణరావు గారు .... ఆధునిక యుగంలో తెలుగు భాషా వికాసానికి కృషి చేసిన వారిలో వీరేశలింగం ప్రక్కన ఉండవలసినవారు." (తెలంగాణా సాహితీ వికాసము. వ్యా)).

4. "ఆంధ్రప్రాంతంలోని ఆంధ్రోద్యమానికీ, తెలంగాణా ప్రాంతంలోని ఆంధ్రోద్యమానికీ వ్యత్యాసమున్నదని ఈ సందర్భంలో చెప్పవలసియున్నది. ఆంధ్ర ప్రాంతంలో అది ఒక ప్రత్యేక రాష్ట్ర సాధనకు కృషి చేసినది. తెలంగాణలో అది మొదట సాహిత్య ప్రచార ఉద్యమంగా ప్రారంభమై, తరువాత బాధ్యతాయుతమైన పరిపాలనకొరకు పోరాటము నిర్వహించిన రాజకీయ ఉద్యమంగా పరిణమించినది" (తెలంగాణ సాహితీ వికాసము. వ్యా.)

5. "పరిశీలించి చూస్తే ఫారసీ, ఉరుదూ సాహిత్యాలు తెలుగును ఎక్కువగా ప్రభావితము చేసినట్లు కనిపించదు. ఈ ప్రభావము యేమైనా ఉంటె అది శబ్దజాలంమట్టుకే పరిమితమైనది. ఈ పారసీ, ఉర్దూ సాహిత్యాలను చదివిన ప్రేరణతో, ఉత్సాహముతో వచ్చిన సాహిత్యం చెప్పదగిన దేమియు లేదు. ఇదే విధంగా తెలుగు సాహిత్యం కూడా ఆభాషలలోనికి వెళ్ళలేదు." (తెలంగాణ సాహితీ వికాసము. వ్యా.),

6. "హిందూ ముస్లింల సంస్కృతుల సమ్మేళన ఫలితంగా రూపొందింది ఉర్దూ భాష. ఉర్దూకూడ ఫారసీవలె మధురమైన భాష" (తెలుగుభాష-ఫారసీ, ఉర్దూల ప్రభావము) (వ్యా).

7. "సంస్కృత సాహిత్య గ్రంథాలు తగినన్ని ఉర్దూ భాషలో రాలేదు. దేశభాషా సాహిత్యాలపైన ఉర్దూ ఫారసీ సాహిత్యాల ప్రభావము ఎంత పడినదో సంస్కృత సాహిత్య ప్రభావము ఉర్దూ సాహిత్యముపైన అంతగా పడలేదనికూడా ఈ సందర్భంలో చెప్పితే అంత అతిశయోక్తి కాజాలదు." (ఉర్దూపై సంస్కృత భాషా ప్రభావము) (వ్యా.).

8. "గతకాలము మేలు వచ్చుకాలముకంటెన్" అని నమ్మిన నిరాశావాదిని కాను నేను....మనిషి ఆధునికుడు కావటం అంటే గతాన్ని పూర్తిగా సమీక్షించుకొని, వర్తమానంలో జరుగుతున్న పరిణామాలను గుర్తిస్తూ, సుందర భవిష్యత్తును నిర్మించుకొనడానికి కార్యోన్ముఖుడు కావడమేనని నా ఉద్దేశ్యం." (నల్లగొండ జిల్లా రచయితల సభల ప్రారంభోపన్యాసము.)

9. "రచయితలు చాలమంది స్వేచ్ఛను గురించి మాట్లాడుతుంటారు. ఈ రోజు చాలమంది రచయితలు తమకు తామే బానిసలు. అవకాశాలకు బానిసలు" (నల్లగొండజిల్లా రచయితల సభల ప్రారంభోపన్యాసం).

10. "ప్రస్తుత పరిస్థితులలో సమాజాన్ని ప్రకోపింపజేయటం కాదు రచయిత చేయవలసిన పని; ఉద్దీప్తం చేయటం" (నల్ల.జి.ర.స. ప్రా.).

11. "తెలుగు విద్వన్మణి శ్రీ అనంతకృష్ణశర్మగారు" (నేనెరిగిన అనంతకృష్ణశర్మగారు) (వ్యా.)

12. "విశ్వనాథ సత్యనారాయణగారు నూటికి నూరుపాళ్ళు తెలుగు వాడు....కల్తీ లేని జాతీయవాది....ప్రాచీనులో ప్రాచీనుడు, ఆధునికులలో ఆధునికుడు.... ఇటువంటి సర్వతోముఖమైన ప్రతిభాశాలి గడచిన కొన్ని శతాబ్దములలో తెలుగుదేశమునందు జన్మించలేదని నిస్సందేహముగా చెప్పవచ్చును." (నా దృష్టిలో విశ్వనాథ సాహితీ వ్యక్తిత్వము. వ్యా.)

13. "ఆంధ్రభాషకు ,ఆంధ్ర సరస్వతికి కృత్రిమమైన సరిహద్దులను, పొలిమేరలను కల్పించుటకు వీలు లేదు. అట్టి ప్రయత్నాలు విఫలమైనవి." (తెలంగాణలో జాతీయోద్యమాలు)

14. "ఆధునికాంధ్ర వాఙ్మయ సౌధమునకు మూల స్తంభములు అయిదు. 1) వీరేశలింగము 2) లక్ష్మణరావు) 3) నాగేశ్వరరావు 4) చెళ్ళపిళ్ళ వేంకట శాస్త్రి 5) గురజాడ అప్పారావు." ('శోభ' సాహిత్య మాసపత్రిక సంపాదకీయం-1951).

15. "సూర్యుని రశ్మివలె ఆంధ్రపత్రిక తెలుగు మాట్లాడే ప్రతి పల్లెకు వెలుతురు నిచ్చినది" (స్వాతంత్ర్యానికి పూర్వం పత్రికా రచన. వ్యా.)

16. "సమాజాన్ని ప్రభావితం చేసిన రచయితలల్లో వేమన్నవంటి వాడు చలం...."(స్వర్గీయ చలం. వ్యా.)

17. "భారతీయ భాషల వికాసాన్ని స్థూల దృష్టితో పరిశీలించి నప్పటికిని ఒకే పద్ధతిలో జరుగుతున్నట్లు వెల్లడి కాగలదు." (అఖిల భారత తెలుగు రచయితల (7 వ) మహాసభలు (14 అక్టో. 1981) అధ్యక్షోపన్యాసం.)

18. "ఆంధ్ర సారస్వత పరిషత్తు ఒక విశిష్టమైన సంస్థ. ఏ ప్రత్యేక సంప్రదాయానికి కట్టుబడిన సంస్థ కాదు యిది. అతి ప్రాచీన మైన సాహిత్యానికీ, అతి నవీనమైన సాహిత్యానికీ సుస్వాగత మిచ్చి ప్రోత్సహించే విశాల భావపూరితమైన సంస్థ." (యాభై సంవత్సరాల జ్ఞాపకాలు).

19. "వేర్పాటు ఉద్యమాలు వచ్చినప్పుడు కవి పండితులు ఎవ్వరూ అందులో పాల్గొనలేదు. ఇది గమనింపదగిన విషయం." (యాభై సంవత్సరాల జ్ఞాపకాలు).

20. "ఒక మహా రచయిత సంఘము నందలి యన్యాయములను అధర్మములను ఖండించి యెదురు తిరిగిన క్షంతవ్యుడే. కాని, ఒక వ్యక్తి ప్రతిభా విశేషమును గుర్తింపని సమకాలీకులు మాత్రము క్షమార్హులు కాజాలరు." (వేయిపడగలు)

ఇలా ఎన్నో ఎన్నికచేసి సూక్తి తోరణం కట్టి వ్యాసద్వారాన్ని అలంకరించవచ్చు. విమర్శలో విమర్శకులు కొన్ని వాస్తవాలను పేర్కొనవచ్చు; కొన్ని సత్యాలను నిరూపించవచ్చు; కొన్ని వ్యాఖ్యలు చేయవచ్చు; కొన్ని ప్రశ్నలు, ఆలోచనలు, చర్చనీయాంశాలు రేకెత్తించవచ్చు; కొన్ని ఫలితాంశాలు ప్రకటించవచ్చు; కొన్ని తీర్పులు చెప్పవచ్చు. విమర్శకుడు సందర్భోచితంగా అయా అంశా లను ఆవిష్కరించి తన విజ్ఞతను ప్రదర్శించుకొంటాడు. డాక్టర్ దేవులపల్లి రామానుజరావుగారి విమర్శ సాహిత్యంలో పైన పేర్కొన్న అంశాలన్నీ గోచరిస్తాయి. ఎన్ని మాటలు చెప్పినా తన మాటలలో వ్యాసానికి వ్యక్తిత్వం కల్పించటం రామానుజరావుగారి విమర్శక స్వభావం. ఇది ప్రతిభాశాలి చేయగలిగిన పని.

సాహిత్య విమర్శలో డాక్టర్ దేవులపల్లి రామానుజరావుగారు వ్యాసం, ఉపన్యాసం, సంపాదకీయం, పత్రికావ్యాసం, రేడియో ప్రసంగం మొదలైన ప్రక్రియలను నిర్వహించారు. అయితే, ఉపన్యాసాలను కూడా వ్రాసి చదివే సంప్రదాయంతో సభలలో వినిపించేవారు. అందువలన ఉపన్యాసం కూడా సుశిక్షితమైన వ్యాసంగానే వీరి విమర్శలో ప్రత్యక్షమౌతుంది. మహాసభల్లో అధ్యక్షోపన్యాసాలుగా ఇచ్చినవిగాని, స్మారకోపన్యాసాలుగాని, ప్రత్యేక ఉపన్యాసాలుగాని నిడివిలో నిర్మాణంలో విశ్లేషణంలో వ్యక్తీకరణంలో ఒక ప్రత్యేకతను ప్రదర్శిస్తూ ఉంటాయి. ఆకృతికి అవి పెద్ద వ్యాసాలు. 'వేగుజుక్కలు' అనే పేరుతో వెలువడ్డ గ్రంథంలో పదిమంది సాహితీమూర్తుల వాఙ్మయ చిత్రాల వంటి వ్యాసాలున్నాయి. అందులో కొన్ని పత్రికా రచనలు, మరికొన్ని రేడియో ప్రసంగాలు. డాక్టర్ రామానుజరావుగారికి చేపట్టే ప్రక్రియకుండే ప్రమాణం తెలుసు, దాని ప్రయోగం తెలుసు. అందువల్ల అనుభవజ్ఞుడు అస్త్రప్రయోగం చేసినట్లుంటుంది రామానుజరావుగారి విమర్శవ్యాసం.

విమర్శకునికుండే గుణాలు కొన్ని అతని విమర్శకు కూడా ఏర్పడతాయని అంటారు. అలాగే డాక్టర్ రామానుజరావుగారి వ్యక్తిత్వంలోని గుణాలు వారి విమర్శ స్వభావంలో కూడా ప్రతిఫలిస్తూ ఉంటాయి. మచ్చుకు ఒకటి రెండు గమనిద్దాం. రామానుజరావుగారు పొదుపరి, నిరాడంబరుడు, అర్థంపట్ల కడు జాగరూకత ప్రకటించేవారు. అలాగే వారు విమర్శలో కూడా శబ్దాలూ, వాక్యాలూ ఎంతో పొదుపరితనంతో వాడతారు. ఆలంకారికమైన అభివ్యక్తి ఎక్కడోకాని కనపడదు. అందువల్ల వారి శైలి చాల నిరాడంబరంగా, ప్రసన్నంగా, అర్థప్రతిపాదనంలో ఎటువంటి అస్పష్టతగానీ, అనవసరమైన శబ్దపటాటోపంగానీ లేకుండా నిర్మలంగా సాగుతుంది. వారి శైలి వారి వ్యక్తిత్వానికి ప్రతిబింబం.

డాక్టర్ దేవులపల్లి రామానుజరావుగారి విమర్శ సాహిత్యం చదివిన పఠితకు ఆయన ఒక సజీవ చరిత్ర సంపుటిలాగా, మూర్తీభవించిన దేశభాషాసాహిత్యాభిమానంలాగా, సమదృష్టిగల సాహిత్య విమర్శకునిలాగా, మాట్లాడుతున్న అపార జీవితానుభవంలాగా. అరవై యేళ్ళ ఆంధ్ర సాహిత్యానికి ఆత్మబంధువులాగా స్ఫురిస్తారు. ఆయన చిరునామా ఆంధ్ర సారస్వత పరిషత్తు. అయినా, ఆంధ్రులకు ఆయన కూర్చున్నచోటే అఖిలాంధ్ర సారస్వత పరిషత్తు! మహాసంస్థ వంటి మహావ్యక్తి!

రామానుజరావుగారితో ముఖాముఖి

ప్ర : మన రాష్ట్రంలోని అకాడెమీల రద్దు విషయముపై మీ అభి ప్రాయ మేమిటి?

జ : అకాడెమీల రద్దు విషయం సమర్థనీయం కాదు. ఆ విషయం మీద ఆంధ్రజ్యోతి, ఆంధ్రపత్రికలలో కూడా నా అభిప్రాయం పత్రికాముఖంగా తెలియజేయడం జరిగింది. జూన్ 1983 లో ఈ విషయము ముఖ్యమంత్రిగారి సమక్షంలో కూడా జరిగింది.

ప్ర : ఆరు సంవత్సరాల క్రితం, ప్రజాస్వామ్యం గురించి మీ కలలు కల్లలైనా యన్నారు. ఆ అభిప్రాయాన్ని ఏమైనా మార్చు కున్నారా?

జ : ప్రస్తుతం కూడా నా అభిప్రాయం ఏమీ మారలేదు. నాకు ఆశాభంగమే కల్గింది. నా ఆశలు, ఆశయాలు, నా పుస్తకం "ఉపన్యాస తోరణం"లో "ఆంధ్రప్రదేశ్‌లో స్వాతంత్రో ద్యమం - కొన్ని జ్ఞాపకాలు" అనే వ్యాసంలో పూర్తిగా వివ రించాను. రాజకీయ రంగంలో నైతిక విలువలు లోపించి నందున ప్రజాస్వామ్యం వర్ధిల్లడానికి ఆరోగ్యకరమైన వాతా వరణం ఏర్పడలేదు.

ప్ర : సాహిత్య రంగంలో మీ జీవిత లక్ష్యం ఏమిటి?

జ : నేను వ్యవహర్తల కుటుంబం నుండి వచ్చాను. సాహితీ కుటుంబంలో నుండి కేవలం సాహితీపరుడిగా రాలేదు. కాని ఆనాటి పరిస్థితులలో తెలుగు అంతరించిపోయే ప్రమాదం గుర్తించి, తెలుగు భాషాస్రవంతి యింకిపోరాదనే తపనతో,

తెలుగు దీపం కొడిగట్టరాదనే కోర్కెతో, దేశాభ్యుదయం కోసం, జరిగే అన్ని ఉద్యమాలతోపాటు, తెలుగు భాషాభివృద్ధి ఉద్యమంలో కూడా పాల్గొన్నాను.

ప్ర : మరి ఆ విషయంలో మీ లక్ష్యం నెరవేరిందా?

జ : అవును. ఒకనాడు నైజాం కాలంలో తెలుగు దీపం ఆరిపోతుం దనే భయం వుండేది. యిప్పుడు ఆ భయం లేదు. తెలుగు వెలుగులు యింటింటిలో విరజిమ్ముతున్నాయి. అధికార భాషగా తెలుగును గుర్తించారు. విశ్వవిద్యాలయ స్థాయిలో కూడ తెలుగుకు ప్రాధాన్యత పెరుగుతోంది. 'నేను తెలుగు వాడిని. నాది తీయనైన తెలుగు భాష' అని సగర్వంగా చెప్పగోగలిగే పరిస్థితులు ఏర్పడ్డాయి. నా చిన్ననాటి మిత్రులు, ఉద్యమ సహచరులు, అంతా యిప్పుడు ఆనందిస్తున్నారు.

ప్ర : ఆధునికాంధ్ర మహాకవులలో మీకు ప్రత్యక్ష సంబంధా లున్నాయి. వారిలో మీకు నచ్చిన, మీరు మెచ్చిన వారిని గురించి చెప్పండి.

జ : సాహితీ లోకంలో చాలామంది ఆధునికాంధ్ర మహాకవులతో నాకు పరిచయాలున్నాయి. వారి పుస్తకాలన్ని చదువుతాను. కొన్ని విషయాలలో వారితో ఏకీభవించనూవచ్చు. మరికొన్ని విషయాలలో విభేదించనూవచ్చు. చిన్న కథలు మొదలు, నవలల వరకు, మినీ కవితలు మొదలు ఖండకావ్యాలు నిండు కావ్యాలు కూడా చదువుతాను. మహాకవు లెవరో, గొప్ప రచనలేవో అన్నది కాలమే నిర్ణయిస్తుంది. మంచి రచన ఎక్కడ వున్నా, ఎవరు వ్రాసినా, నేను చదివి ఆనందిస్తాను. చేతనైన సహకారము అందజేస్తాను.

ప్ర : ఈ యుగంలో trend setter ఎవరు?

జ : నా అభిప్రాయంలో వీరేశలింగం, గురజాడ, రాయప్రోలు మరియు శ్రీశ్రీ.

ప్ర : యింత వైవిధ్యంగల ఆధునిక తెలుగు సాహిత్యానికి ఒక యుగకర్తని నిర్ణయించడం మంచిదా కాదా?

జ : కాదు. యిప్పుడే తొందరపడవలసిన అవసరంలేదు. అది భవిష్యత్తే నిర్ణయిస్తుంది.

ప్ర : ప్రాచీనాంధ్ర కవులలో మీ అభిమాన కవి ఎవరు?

జ : తిక్కన, పోతన, వేమన.

ప్ర : సాహిత్య రంగంలో ప్రాంతీయ తత్వాన్ని మీరు సమర్థిస్తున్నారా?

జ : నేను రాజకీయరంగంలోనే ప్రాంతీయతత్వాన్ని సమర్థించలేదు. యిక సాహిత్యరంగంలో అసలే సమర్థించను.

ప్ర : రచనల యొక్క ప్రభావం సమాజం మీద ఎంతవరకు వుంటుంది?

జ : ప్రభావం తప్పక వుంటుంది. కాని ఆచరణలోకి రావడంలోనే అడ్డంకులు ఏర్పడుతుంటాయి.

ప్ర : కవుల లేదా రచయితల లక్ష్యాలు సిద్ధించిన సంఘటనలుంటే చెప్పండి?

జ : ఎన్నో ఉద్యమాలమీద రచయితల ప్రభావం పడింది. ఉదాహరణకు మన జాతీయోద్యమాన్ని, ఆంధ్రోద్యమాన్ని పేర్కొనవచ్చు. గాంధీ, కార్ల్ మార్క్స్, టాల్‌స్టాయ్ మొదలైన మహనీయుల రచనలను పేర్కొనవచ్చును.

ప్ర : నేటి విప్లవ రచయితలమీద మీ అభిప్రాయం ఏమిటి?

జ : హింసాత్మక ఉద్యమాలు నేను యిష్టపడను. రచనలలో సహితం హింసా ప్రబోధం నాకు నచ్చదు. నేను అభ్యుదయ దృక్పథం కల మితవాదిని. గోపాలకృష్ణ గోఖలేపట్ల అభిమానం కలవాడిని. స్వామ్యవాద సమసమాజ స్థాపన నా ఆశయం. అందు కనుగుణమైన రచనలను నేనాహ్వానిస్తున్నాను.

ప్ర : నేటి నవలా రచయితల మీద, రచయిత్రుల మీద మీ అభిప్రాయం ఏమిటి?

జ : కొన్ని చాలా మంచి నవలలు వస్తున్నాయి కొన్ని చవకబారు. నవలలు కూడా వస్తున్నాయి. నేటి కొందరి రచనలలో ప్రతిభ స్పష్టంగా కనిపిస్తుంది. ప్రతిభలేని అనుకరణ రచనలుకూడా కనిపిస్తున్నాయి.

ప్ర : ఆధునిక తెలుగు సాహిత్యంలో మహా కవయిత్రి ఎవరు? ఎందుకు?

జ : ఎందరో కవయిత్రులున్నారు. కాని మహా కవయిత్రు లెవరు కనిపించడం లేదు.

ప్ర : సాహిత్య రంగంలో డబ్బుకోసమో, పేరుకోసమో, ఆత్మ వంచన చేసుకుంటూ బ్రతికేవారిని గురించి మీ తీర్పు ఏమిటి?

జ : నాకు సదభిప్రాయం లేదు.

ప్ర : క్రాంతదర్శియైన కవి కళ్ళకి మార్క్స్ సిద్ధాంతం కూడా రంగుటద్దం కాదా?

జ : నిస్సందేహంగా రంగుటద్దాలే. కవి స్వేచ్ఛగా స్వాతంత్ర్యంగా ఆలోచించాలి. గుండె పలికిన పలుకులు చెప్పగలిగాలి. అంతే

కాని, ఏదో ఒక యిజానికి సంబంధించిన కంచెలో చేరవలసిన అగత్యం లేదు. లోక కల్యాణం, సమాజ శ్రేయస్సు కొరకు అనుగుణంగా స్పందించాలి.

ప్ర : తెలుగు వాళ్ళు తప్పక చదువాల్సిన పుస్తకాలేవి?

జ : భారతం, భాగవతం, శతక వాఙ్మయం - ప్రత్యేకంగా వేమన, తాళ్ళపాక కృతులు, త్యాగరాజ కృతులు, క్షేత్రయ్య పదాలు, వీరేశలింగం, చిలకమర్తి, పానుగంటి వారి కొన్ని రచనలు మరియు గురజాడ వారి ముత్యాల సరాలు, కన్యాశుల్కం, రాయప్రోలు వారి తృణకంకణం, ఆంధ్రావళి, తెనుగుతోట, విశ్వనాథవారి ఏకవీర, కిన్నెరసాని పాటలు, వేయిపడగలు, శ్రీశ్రీ మహాప్రస్థానం, చలం కథలు, ముద్దుక్రిష్ణ సంకలనం వైతాళికులు, ఉన్నవగారి మాలపల్లి.

ప్ర : మీ సాహిత్య జీవితాన్ని ప్రభావితం చేసిన పుస్తకాలేవి?

జ : ముఖ్యంగా సాహితీ ఉద్యమాలు నన్ను ప్రభావితం చేశాయి. బాలం నుండి యువ దశ వరకు చదువంతా యింగ్లీషు మీడియంలో చదువుకోవడం జరిగింది. యింగ్లీషు ద్వారా చదివిన వాడిని కావున యింగ్లీషు రచనలు నన్ను ప్రభావితుని చేసినవి. ఉ. Shakespeare. తెలుగులో భారత, భాగవతాలు.

ప్ర : మీ ప్రజా జీవితాన్ని ప్రభావితం చేసిన వారెవరు?

జ : నేను అఖిల భారత స్థాయి నాయకులచే ప్రభావితమైనాను. ఉదాహరణకు గాంధీ యుగానికి చెందిన నెహ్రూ, మౌలానా అబుల్ కలాం ఆజాద్, ఆచార్య నరేంద్రదేవ్, గోఖలే, తిలక్, ప్రేంచంద్, గాలిబు ప్రముఖులు నా సాహిత్య, ప్రజా జీవితాల్ని ప్రభావితం చేశారు.

ప్ర : రచనా ముద్రణావకాశాల గురించి చెప్పండి. గ్రంథాలయాలు ప్రచురణకర్త అయినటువంటి గ్రంథకర్తకు ఎంత వరకు తోడ్పడుతున్నాయి?

జ : పేపరు ధర, ప్రింటు ధర బాగా పెరిగిపోయాయి. పుస్తకాలు ఎవరికివారు ప్రచురించుకోవడం చాలా కష్టతరమై పోయింది. తెలుగులో ప్రచురించే ప్రతి పుస్తకాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థలు కనీసం పది పుస్తకాలైనా కొంటే రచయితకు ఆర్థిక, హార్ధిక ప్రోత్సాహాన్ని యిచ్చిన వవుతాయి. ప్రస్తుతం గ్రంథాలయాలు ఎంత తోడ్పడవలెనో అంత తోడ్పడటంలేదు. గ్రంథాలయ సంస్థలవలన రచయితలకు జరుగుతున్న మేలు చాలా తక్కువ అని నా అభిప్రాయం.

ప్ర : ఇతర భాషాసాహిత్యాలతో పోలిస్తే మన సాహిత్యస్థితి ఏమిటి?

జ : తెలుగు సాహిత్యం సంతృప్తికరంగానే ముందుకు సాగుతోంది.

ప్ర : అవార్డులు, బిరుదులు మంచివా చెడ్డవా?

జ : ఆశ్రిత పక్షపాతం లేకుండా నిష్పాక్షికంగా యిచ్చే అవార్డులు మంచివే. బిరుదులపై మోజు సరైనదికాదు. పోతనకు బిరుదెందుకు? ఎవరికి కీర్తి బిరుదులు తగిలించుకున్నంతమాత్రాన శాశ్వతంగా నిలువదు. అంతగా పెరుగదు. వారి రచనలబట్టి మాత్రమే కీర్తి నిలుస్తుంది.

ప్ర : ఎలావుంటే మన సాహిత్యం, జాతీయ, అంతర్జాతీయ స్థాయిల నందుకోగలదో చెప్పండి?

జ : సమకాలీన సమాజానికి ప్రతిబింబంగా వుండి ప్రగతిపథంలో పురోగమిస్తూ జాతి అభ్యుదయానికి, మానవ కళ్యాణానికి ఉపయోగపడవలెను. అప్పుడే దానికి విశ్వజనీనత, నిత్యనూత

నత్వం సిద్ధిస్తుంది. ఆ సాహిత్యానికి జాతీయ, అంతర్జాతీయ స్థాయి లభిస్తుంది.

ప్ర : ఈ యువతరానికి ఏదైనా కార్యక్రమాన్ని సూచించండి?

జ : యువతరానికి క్రమశిక్షణ కావలెను. నైతిక విలువలు పాటించి ప్రగతిమార్గంలో అఖిలభారత దృక్పథంతో ముందడుగు వేయవలెను. ఆధునిక దృక్పథం, వైజ్ఞానిక దృక్పథం ఉండవలెను. ప్రాంతీయ భాషా సంస్కృతులు పరిపూర్ణంగా అభివృద్ధిచెందవలసిందే కాని, అవి భారత జాతీయతకు గొడ్డలిపెట్టు కారాదు.

ప్ర : మీ "యాభై సంవత్సరాల జ్ఞాపకాలు" పుస్తకం తర్వాత నుండి యిప్పటివరకు జరిగిన కాలంలో మీ జ్ఞాపకాలు చెప్పండి?

జ : రెండు మూడు మాటల్లో చెబితే సరిపోదు. నా జ్ఞాపకాలు చాలా ఉన్నాయి. వివరాలు "నా యాభై సంవత్సరాల జ్ఞాపకాలు" పుస్తకాన్ని పునఃపరిశీలనచేసి సరిచూసుకొని ముద్రించదలచుకున్నాను. దానిలో మిగతా జ్ఞాపకాలన్నీ పొందుపరుస్తాను.

—ఆచార్య తిరుమల,
సీతాశరచ్చంద్ర



20-4-1983

డా॥ సి. నారాయణరెడ్డి గారి కవితలకు ఆంగ్లానువాదం గ్రంథావిష్కరణ సభ

ముఖ్య అతిథి : ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖామాత్యులు

శ్రీ ఆనంద గజపతిరాజు గారు, శ్రీ దేవులపల్లి రామానుజరావు గారు.

దేవులపల్లి రామానుజరావు గారికి పలువురు ప్రముఖ పండితుల లేఖలు

44, Maredpalli
Secunderabad.
30-3-42

My dear Friend

I must first ask your pardon for long silence over a number of your letters, pouring forth your love and affection. As a budding poet you can guess at it. The Bee sings till the lotus opens its gates. After getting in and tasting the honey either forgets the song or unable to tune herself in Ecstasy. A some what similar state creeps over my mind. Otherwise it is inexplicable. I read your poem picture your heart, the whole association is so close and intimate. Now I thought of writing to you often, but it does not happen. Can you unravel this?

I think you might have had your essay by this time. Mr. Sitaramaiah also has a high opinion of it. Why not publish it? Only be careful in proof reading. That we can do during these summer holidays.

Your friends did not see me as they promised. I kept Andhravali ready for you.

Many thanks for your offer of help. I gave Rasagangadhar to the press and advanced Rs. 200/- We must see ధ్వన్యాలోకం, వ్యక్తివివేకం, హృదయదర్పణం also to be brought in to Telugu. Atleast the future people will remember your names. There are many works on poetics. But these are really original contributions to the thought and each in its own way is an independent investigation into this most bewitching phase of human endeavour.

More in my next.

Your most sincerly
R. SUBBA RAO.

* * *

Maredpalli
Secunderabad
16 April

My Dear young Friend,

Your very kind letter to hand. I tried to ascertain whether you have come back from Nagapore but could not get correct information.

Recently I had been to Nellore for Tikkana Jayanti and was surprised to find so many votaries of your muse. Perhaps the days are fast approaching when the Andhras recover their own not - lost but much neglected glory of literature. Even the reception and honour done to me were quite disproportionate to what I deserve.

I wish that Telangana should pay its part with due pride and zeal. You are my hope and your Nellutla is there. Can't we form our selves into a band of young men and devote to that triumphant end when all the sleeping songs and buried beauties wake up and make our lives sweet and soft ?

The Sahiti Mekhala people of Chandur are contemplating to honour our Ambadipudi Kavi. They have elected me as the President of the function. The date is not known.

At Gadwal an association called young intellectuals is formed and they are brimming with enthusiam to sing a new song and brush up the old strings.

But apart from these I am anxious to meet you and some of the young friends so that I may unburden myself before them and handover the torch. Some thing prompts that there are many gems that are to be discovered only to finish this garland of fadeless colours and perpetual fragrance.

Don't let your song break not the music slumber. Where is Nellutla - the streak of poetic flame ?

If oppourtunities favour try to have gatherings of our folk and we shall spend a day or two and see if this spring has brought us a message of love and sweetness.

Please do confer with other young votaries of the muse and let me know the response.

Hope you are all doing well.

With regards.

Yours faithfully,
R. SUBBA RAO.

* * *

53, శరవణ పెరూమాళ్ వీధి,
పురశవాకం, మద్రాసు - 7.
22-1-53.

శ్రీయుత దేవులపల్లి రామానుజరావు మిత్రవర్యులకు విధేయుడు మల్లంపల్లి సోమశేఖరశర్మ అనేక నమస్కారములు. ఉభయకుశలోపరి.

శ్రీ గిడుగు సీతాపతిగారి వల్లను, శ్రీ పందిరి మల్లికార్జునరావు గారి వల్లను, శ్రీ రాయన్నగారి వల్లను ఆలంపురం సారస్వత పరిషత్తు సభలు మహావైభవంగా జరిగాయని విని అపరిమితానందం పొందాను. అఖిలాంధ్రదేశంలోను అంతటి పనిచేసి చూపించిన సంస్థ, అంత మహావైభవంగా సారస్వత పరిషత్తు సభలు అంత భారీయెత్తున అంత జయప్రదంగా జరిపిన సంస్థ ఒక్క సారస్వత పరిషత్సంస్థే. ఇది యెంతమాత్రమూ అతిశయోక్తి కాదు. ఆంధ్ర సారస్వత పరిషత్తు ఈనాడింతటి ఉన్నత స్థితికి రావడానికి మీవంటి, శ్రీ పులిజాల

హనుమంతరావుగారు వంటి సారస్వత సేవాపరతంత్రులు దానికి సారథ్యం వహించడమే కారణం. ఎప్పటికయినా దానిని అఖిలాంధ్ర దేశంలోను ప్రభుత్వ సహాయం ఉన్నా వారి పర్యవేక్షణ క్రింద కాకుండా ఒక విశ్వకళాపరిషత్‌గా దిద్దగలిగితే ఆనాడు మీ అందరి కృషి సఫలమయినట్టూ నా స్వప్నం సఫలమయినట్టు భావించి సంతోషం పొందుతాను. మీ అధ్యక్షత క్రింద సభల నింత జయప్రదంగా జరిపినందుకు మళ్ళీ మీకు నా అభినందనాలూ అభివందనాలూను. మంత్రవాదిగారు ఇంకా రాలేదు. అందువల్ల వారు చెప్పవలసింది మాత్రమే మిగిలింది. అలంపురం వంటి చిన్న గ్రామంలో అంత గొప్ప యెత్తున సభలు జయగీయమానంగా జరిపారంటే అది చాలా విశేషం; ప్రశంసాపాత్రమైన విషయం.

తెలంగాణా చరిత్రను స్వతంత్ర ముద్రణాలయంలో అచ్చువేయించుటకు శ్రీ ఖాసా సుబ్బారావుగారితో మాటాడినాను. కాగితం కొని యిస్తున్నాను. ప్రతి వారమూ దాన్ని తెలుగు స్వతంత్రలో ప్రకటించి దాన్ని పుస్తకంగా తీస్తే wider publicity వస్తుందికదా, ఆ విధంగా చెయ్యరాదా అని సుబ్బారావుగారన్నారు. దానికి సారస్వత పరిషత్తువారిని కనుక్కోవాల, అది వారి యిష్టం అన్నాను. వారికి వ్రాసి కనుక్కోండి అన్నారు. నాకు ఆ పత్రికలో ప్రకటించి తీరాలనే పట్టుదల ఏమీలేదు. అందువల్ల మీయిష్టం; ప్రకటించమంటే ప్రకటిస్తాను; లేకపోతే లేదు. దయచేసి వ్రాయగోరెదను.

తెలంగాణాలోని Prehistoric remains and burials ను గురించిన ఫోటోలు Archeaological Department లో తీసికొని పంపించమని లోగడ వ్రాసినాను; వాటి నింతవరకు పంపలేదు. దయయుంచి త్వరలో పంపగోరెదను.

తమరు ఆదరాభిమానములతో పంపిన పచ్చతోరణము, నవనీతము అనే రెండు పుస్తక రాజములు అందుకొన్నాను. వాటిని చదివిన తరువాత తమకు వ్రాద్దామని ఇంతవరకు వ్రాయలేదు. అసలు అవి మీరు పంపగానే అందినట్టు వ్రాయవలసిందేమో అని ఇప్పుడను కొంటున్నాను. జరిగిన ఆలస్యానికి క్షంతవ్యుడను.

పచ్చతోరణము నిజముగా ఎప్పటికీ కాంతిచెడని పచ్చదనము మాయనీ, నవ్యత వసివాడనీ పద్యాల పచ్చతోరణమే. ఓరుగల్లుమీద ఇదివరకెందరో వ్రాశారు. ఎందరు వ్రాసినా, మీ పద్యాలలో కొత్త పోకడ, హృద్యములైన భావములూ కనబడి మనస్సుకు ప్రమోదము కలిగిస్తూనే ఉన్నది. "పురుష భామామణులయంటి తరుణులందు ఖడ్గతిక్కన భార్యలొక్కరునులేరె?"- ఎంత చక్కగా చెప్పారండీ- చాలా రమ్యముగా ఉంది. నీరాజనము, సంక్రాంతి, అనార్కలి, మూగబిడ్డ- ఒకటేమిటి అన్నీ అప్పుడే వికసించి పరిమళము వెదజల్లే మల్లెపూలలా పున్నాయి. చదివి చాలా ఆనందించాను. ఈ సందర్భంలో ఒక మనవి. తరువాత మరచిపోతానేమో- పోలీసుచర్య జరిపిన తరువాత తెలంగాణాలో వచ్చిన తెలుగు గ్రంథములెన్ని కయిన వేమిటి, అవి యెక్కడ దొరుకును చెప్పగలరా?

మీ నవనీతము కూడా చదివాను. అదిన్ని నిజంగా నవనీతమే. జాతీయోద్యమము- వాఙ్మయ ప్రభావము అనే వ్యాసం చదివాను. మీ అభిప్రాయమేమో కాని ఆంధ్రదేశంలో ఆంధ్రోద్యమం తప్పితే హోంరూల్ ఉద్యమంకాని గాంధీ మహాత్ముని సహాయ నిరాకరణోద్యమం కాని కోస్తా ఆంధ్ర కవిత హృదయములను స్పందింప జేయలేదనే నా అభిప్రాయం. స్వరాజ్యపు పాటలు, స్వరాజ్యరథం గేయములు (మాకొద్ది తెల్లదొరతనము వంటివి) రాలేదనను నేను. కాని సాహితివంటి సాహిత్య పత్రికలలో ప్రకటితములైన గద్యపద్య

రచనలను చూస్తే ఉద్యమము దొక దారి కావ్య జగత్తు దొక దారి యైనదేమోయని అనుకొంటున్నాను. ఆ యాశయాలను, ఆ యాదర్శాలను, ఆ సంచలనాన్ని ప్రతిఫలింప జేసే కావ్యం ఏమీ రాలేదేమో తెలుగు దేశంలో (తీరస్థ ప్రాంతంలో). నవనీతం ఒక్క తెలంగాణాలో మాత్రమే చలామణీ కావలసిన గ్రంథం కాదు. అదేకాదు, పచ్చతోరణమూ అంతే. ఇవి రాయలసీమలోను ప్రాగాంధ్రంలోను విరివిగా ప్రచారానికి రావలసినవి. సాధారణంగా తెలంగాణాలో ప్రకటితమయ్యే పుస్తకాలను గురించి కోస్తా జిల్లాలవారికి తెలియడంలేదు. రాయలసీమ వారికీ అంతే అనుకొంటాను. రాయలసీమ కోస్తా జిల్లాలలో ప్రకటితమైనవి తెలంగాణా వారికి తెలుస్తున్నవో లేవో చెప్పవలసినవారు మీరు. ఎట్లయినా పుస్తక ప్రకటన విక్రయాల విషయంలో ఒక కేంద్ర సంస్థ అవసరమని అనుకొంటాను. ఆఖరుకు ప్రకటన విషయంలో కాకపోయినా విక్రయం విషయంలో నయినా అట్టి సంస్థ ఆవశ్యకత నేడెక్కువగా ఉంది. ఆ సంస్థకు తెలంగాణాలోను, రాయలసీమ ఉత్తర కోస్తా జిల్లాలలోను శాఖలుండాలి. ఈవిధమైన సంస్థ ఒకటి యేర్పాటయితే రచయితలకు చాలా ఉపకారకంగా ఉంటుంది. ఏమంటారు? అట్టి దానిని స్థాపించడానికి పూనుకొందురా? ఇప్పుడు తెలుగు దేశం అంతటిలోను కొంచెం పనిచేసి చూపినవారు, చూపగలవారు తెలంగాణావారే, మీరే కనబడుతున్నారు. అందువల్ల ఆలోచిస్తారని ఈ విషయం మీ సమక్షాన పెట్టాను.

ఆంధ్రపత్రికలో ఆంధ్ర సారస్వత పరిషత్తుకు కొన్ని సూచనలన్న నా వ్యాసం తమరు చదివారా? నేను చేసిన సూచనలు కార్య రూపం దాల్చడం కష్టమంటారా? మీ అభిప్రాయం వ్రాయండి.

మిత్రులు శ్రీ పర్సా వెంకటేశ్వరరావు గారలకు నా వందనములు తెలుప గోరెదను. ఇక శలవు. నమస్కారం.

భవదీయుడు

మల్లంపల్లి సోమశేఖర శర్మ

* * *

తిరుపతి
3-12-1956

శ్రీ మిత్రులు దేవులపల్లి రామానుజరావు గారికి
నమస్సులు

తాము దయతోపంపిన తమ పుస్తకములు-సాంస్కృతిక పునరుజ్జీవనము-నవనీతము-అందుకొని ఎన్నో దినములాయెను. కాని యీ రెండు మూడు దినములు కొంత విరామము లభించితేనే రెంటిని పూర్తిచేయ గల్గితిని. ఉత్తమ రచనలను చదివిన చిత్త విశ్రాంతి ననుభవించినాను.

సాంస్కృతిక పునరుజ్జీవనము తమ బహుముఖమైన వ్యాసంగమును ధారణాశక్తిని వివిధముగా వెలువరచుచున్నది. ఎన్నోవిషయములు కాలగర్భములో దాగి పోనున్న వానిని ప్రకటించి జీవము పోసితిరి. దీనిని నేటిపాఠశాలలలో ఆవశ్యపఠనీయముగా చేయగల్గినచో ఆంధ్రదేశము మీ ఋణమును కొంత తీర్చుకొనవచ్చును.

నవనీతము మీ హృదయ సౌకుమార్యమును, లోతును ప్రకటించుచున్నది. గుణమును గ్రహించి చెప్పుటయందు మీకుగల పక్షపాతము విమర్శకులు నేడనుకరింపవలసిన విషయము. తెలంగాణమునందు ఇంత గొప్ప తెలుగు జీవిత వర్చస్సున్నదని మే మెఱుగము. దానిని సానుభూతితో వెలువరిచి మీరు చేసిన యుపకృతి మరువరానిది.

తమ కుశలమును వినగోరుచున్నాము.

భవదీయుడు
రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ

* * *

రాజమండ్రి
16-11-56

మహాశయా, వందనములు.

నిన్న మీకొక కార్డు రాసివున్నాను. ఇవాళ మధ్యాహ్నం 3 గంటల 50 నిముషములకు మళ్ళీ ప్రారంభించి వ్యాసమంజూష ఇప్పుడే పూర్తిచేశాను. అంతా చాలా గొప్పగా వుంది. విశేషించి పోతన్న, క్షేత్రయ్య, సూరన్న, ముద్దు పళని-వీరికి సంబంధించిన చిత్రణం సాటిలేనిది. వారి రచనల మీద మరి కొందరు రాశారు, తెలుసు. కాని మీ రచనలు అమోఘములు. మిమ్మల్ని మిక్కిలి ప్రశం సిస్తున్నాను.

—శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి

* * *

వాల్తేరు
31-12-52

శ్రీయుత రామానుజరావు గారికి

మిత్రుడు లక్ష్మీకాంతం - నమస్కారములు. మీరు దయతో పంపిన మీ గ్రంథములు రెండును పచ్చతోరణము-నవనీతము అంది నవి. కృతజ్ఞతతో గైకొని శ్రద్ధగా చదివి సంతోషించితిని.

మీ కవిత్వము మిక్కిలి సరళముగా సుందరముగా ఉన్నది. ఎట్టి గంభీర భావమునైనను మీరు తేలికగా రెండు మాటలలో వ్యక్తము చేయగలరు. పలుకుబడిలో జాతీయమై తెనుగుదనమును ప్రస్ఫుటము చేయుచున్నది.

మీకు అభినందనములు.

ఇట్లు
పింగళి లక్ష్మీకాంతం

* * *

గుంటూరు
26-12-52

శ్రీయుత దేవులపల్లి రామానుజరావు గారికి

నా నమస్తే.

తాము దయతో పంపిన కావ్యద్వయాన్ని కృతజ్ఞతతో నందుకొని చదివి ఆనందించాను మీ పద్య గద్య రచన- మీ హృదయం వలె స్వచ్ఛమై, మీ ప్రతిభ వేనోళ్ళ వ్యక్తం చేస్తున్నది. మీ నవనీత కావ్యం పేరుకుదగ్గ భాషను ప్రోవుజేసికొని, మెత్తగా కమ్మగా సాగినది. ఒక మనవి. నా కావ్యాలనన్నింటి నొకమారు తాము చిత్తగింప గోరుచున్నాను. సత్యగంధ భరితమై వెలువడే మీ వాణికి దీర్ఘాయువగుగాక.

భవదీయుడు
జి. జాషువా

* * *

మద్రాసు
25-12-1952

శ్రీ దేవులపల్లి రామానుజరావుగారికి - నేలటూరి వెంకటరమణయ్య వ్రాసుకొనుట ఏమనఁగా.

తాము నన్ను మరచిపోలేదని నిరూపించినారు- కృతజ్ఞుడను- ఇప్పుడే మీ పచ్చతోరణము, నవనీతమున ప్యాకెట్టు వచ్చినది- నా దృష్టి నవనీతము కంటె పచ్చతోరణమె బలవత్తరముగ నాకర్షించు చున్నది. మీ ఆముక్తమాల్యదను చదివినాను; రాయల కవితా కన్య యని భ్రమజెందితిని; కాని అది మీ చూడికుడుత్తనాచ్చియారని తేలినది. అయిననేమి యాముక్త మాల్యద సకల వైష్ణవ ప్రపంచ మును సేవింపదగినదేకదా.

'అనుగు మిత్రునితోడుత నాంధ్రనగరి
వీధిగడియారపు భ్రోమ్మతవిని యొకండు
పూటకూటింటికల్లనబోయి ముదము
గులుక వింధారగించిన స్థలమిదేమో'

అను గీతము వెదుకబోవుచుండిన మిత్రుడెదుర్కొనినంతటి యానం దము గల్గించినది. 'మోసము' నా మనసునకు నచ్చినది- చరిత్ర పక్షపాతము వలననేమో- 'సంక్రాంతి' చక్కఁగనున్నది- ఇంకను లోతుగల్గి యుండిన నెక్కువ గాంభీర్యముగ నుండెడిదేమో- ఇవి నా మొదటి యింప్రెషన్సు- నింపాదిగా జదువవలెనని కుతూహలము బుట్టుచున్నది- నాకు మీ కవితారసాస్వాదనము గావించి యానందించు భాగ్యమును గలుగజేసినందుకు మీకు కృతజ్ఞతాపూర్వక వందనములు సమర్పించుచున్నాను.

నేను ఆలంపూరునందు మిమ్మందర గలిసికొనవచ్చునని తలచియుంటిని: సంక్రాంతి పండుగలలో సమావేశమును జరుపునట్లు తెలియవచ్చుటచే రాజాలక విరమించుకొనవలసి వచ్చినది. పెద్దలను సందర్శించు భాగ్యము మఱి యెన్నడైన కలుగదా.

ఇట్లు
నేలటూరి వెంకటరమణయ్య

* * *

చిరివాడ

శ్రీ దేవులపల్లి రామానుజరావు గారు
హైదరాబాదు

నమస్కారములు,

అయ్యా,

తాము దయతో బంపిన నవనీతము, పచ్చతోరణము ఈ రెంటిని చదివితిని. (ఇంత కాలమునకు గాని నాకు తీరిక కలుగలేదని వగచుచు ఇప్పటికేని చదువ గలిగినందుకు సంతసించుచు ఈ చీటి వ్రాయుచున్నాను).

(ఈ నవనీత మిట్టే కరిగి హృదయమునకు వాజము కలిగించినది.) పచ్చతోరణము ఎన్నటికి పచ్చతోరణమేకాక పచ్చలతోరణము. ఇటులు మీ రొనర్చు కబ్బపు విందులకు పిలువని పేరంటము.

—వేలూరి శివరామశాస్త్రి

* * *

KOTAPATI MURAHARI RAO

8-11, LALBAHADUR STADIUM,
HYDERABAD - 500 001.
Phones : 233397, 237917

ఎన్నడో పొందవలసిన "డాక్టరు" బిరుదు నేటికి సార్వత్రిక విశ్వవిద్యాలయం వారు, సాహితీ పెద్దలు, సంఘ సేవకులు పూజ్యులు శ్రీ దేవులపల్లి రామానుజరావు గారికి ప్రాసాదించిన సందర్భంగా, వారికి (పూర్తి) పూర్ణాయుస్సులు కాంక్షిస్తూ సాహిత్యానికి మరి దేశానికి మరింత సేవలను అందించవలెనని మనస్ఫూరా కోరుకుంటూ

కోటపాటి మురహరిరావు
కార్యదర్శి
గ్రామాభ్యుదయ పరిశోధక సంస్థ
హైదరాబాదు.

విద్యా, వైజ్ఞానిక, సాహితీ, సాంస్కృతిక, రాజకీయ రంగముల సుప్రసిద్ధ యశో విశాలురగు

శ్రీ దేవులపల్లి రామానుజరావు గారి

సన్మాన సందర్భమున నేను సమర్పించుకొన్న పద్య కుసుమాంజలి

సీ॥ మాన్యులు శ్రీ మహిమాన్వితుల్ దేవుల
పల్లి రామానుజ ప్రభువుగారు
త్రి దశాబ్దములనుండి తెలియుటచే కొంత
వ్రాయబూనితి వారి ప్రతిభ గూర్చి
ఓరుగల్లు పురికి వన్నె గూర్చిన దొర
దేవులపల్లి కంధీందుమూర్తి
సిరి సంపదలగల్గి చెలువారు వంశాన
జనన మందిన బుధ జననుతుండు
విరులు విరియంగనే పరిమళించెడు భంగి
బాల మేధావియై పరిఢవిల్లె
ఆంధ్రాంగ్ల ఉర్దూల నభ్యసించిరి మహా
వక్తగా పేర్గాంచి వాసిగనిరి
సాహితీ గ్రంథాల సద్విమర్శలేగాక
బాల సారస్వత బహుళకృతుల
సువిశాల ఆంధ్ర రాష్ట్రోద్యమ రచనల
పచ్చ తోరణాది పద్య కృతుల

తే॥ పెక్కు కృతులకు కర్తగా పేరుగాంచె
పెక్కు కృతులకు భర్తగా ప్రీతిగూర్చె
పెక్కు సభలకు వక్తగా ప్రియమొనర్చె
చెక్కుచెదరని మేధావి శిష్టమూర్తి.

సీ॥ ఉస్మానియా యూనివర్సిటీ కులపతి
పదవిని ముమ్మాఱు పరిఢవిల్లె
అధ్యక్షులై తొల్త ఆంధ్ర సారస్వత
పరిషత్తు నెలకొల్పి ప్రగతి జూపి
శాశ్వతోపాధ్యక్ష స్థానంబు నందుండి
భాషాభివృద్ధికి పాటుపడిరి
హితముగ ఆంధ్ర సాహిత్య అకాడెమి
కార్యదర్శిగ పెక్కు కావ్యములను
కవులను, కళలను గౌరవించుటెగాక
పునరుద్ధరించిరి పూర్వకవిత
గ్రంథాలయోద్యమ కార్యకర్తగ రాష్ట్ర
స్వాతంత్ర్య సంగ్రామ సంఘటనల
తే॥ విద్య, విజ్ఞాన, సహకార యుద్యమముల
సాహితీ, సంస్కృతీ, న్యాయ, చట్టసభల
వీరి సంబంధమే లేని వారి సమితి
వెదకి నన్గానియుండ బోదిది నిజంబు. 2

ఆ.వె॥ వెన్నవంటి మనసు, వెన్నెల చిఱునవ్వు
మల్లెపూల చలువ మాట విలువ
పలుకు పలుకులెల్ల కలకండ పలుకులు
చూపులందు కరుణ సుధలఁ గురియు. 3

ఆ.వె॥ చిన్నవారినైన మిన్నగా మన్నించు
నిత్య సంతసమున నెనరుఁ జూపు
జాలిగుండెయున్న సౌజన్య మూర్తులు
ఆశ్రయించు వారి కమరతరువు. 4

ఆ.వె॥ నమ్మువారిఁ బ్రోచు న్యాయ సంపన్నులు
చెనటికయిన మేలు చేయగలరు
నీతి నియమములకు నికషోపలంబైన
న్యాయ మర్మవేది న్యాయవాది. 5

తే.గీ॥ మల్లె పువ్వుల మేలిమి మార్దవములు
లే గులాబీల నునుకెంపు లేతరుచులు
సన్నజాజుల సరిక్రొత్త సౌరభములు
సురుచిరంబగు మందార సురభిళములు
పరిమళించును వీరి సంభాషణముల. 6

సీ॥ ఎవరెప్పుడేతెంచి ఎదుట నిల్చినగాని
చిఱు నవ్వుతో బిల్చి చేరఁదీయు
బాగోగులను విన బహు శ్రద్ధ జూపించు
పలుకుల తేనియ చిలుకరించు
కష్ట గాథల విన కరగును మనసెంతొ
కనుగవ నిండును కరుణ రసము
వేలాది దీనుల వేదనలను మాన్పి
దిక్కు జూపిన యట్టి దీనబంధు
ఉద్యోగులకు నెల్ల నుద్యోగ ధర్మముల్
నేర్పుతో నోర్పుతో నేర్పజూచు
తప్పుల క్షమియించి ఒప్పుల వచియించి
కర్తవ్యమును దెల్పి కనికరించు
శిక్ష నిచ్చుట కన్న శిక్షణ నిచ్చుటే
దక్షత విధమని దయదలంచు
విధి నిర్వహణ జేయు వేళను చనుపీక
చండ శాసనులయి వెలగు చంద్రు
మనసు గంభీరంబు, మాట గంభీరంబు,
చూపు గంభీరంబు రూపునంతె
నడక గంభీరంబు, నడత గంభీరంబు
వ్రాత గంభీరంబు చేతగూడ

తే.గీ. ఇట్టి గంభీర మూర్తిని ఇద్ధ యశుని
విమల సౌజన్య మూర్తిని వేద విదుని
వేల సుగుణాల, పదవుల విశదపఱుప
అల్పబుద్ధిని నాచేత నగునె తలప!
పొత్త మొక్కటి వ్రాసిన పొసగు గాని
నోటి మాటల వ్రాతల చాట నగునె! 7

చివరగా శ్రీ రావుగారి కొౌక చిన్న మనవి. ఓ మహా మనీషీ! మూర్తీభ
వించిన మానవత్వానికి ప్రతి రూపమా! అపర సరస్వతీ! విజ్ఞాన సరస్వమా!

ఉ॥ మీదగు కార్యదీక్ష మఱి మీదగు నిర్వహణ ప్రవృత్తియున్
మీదగు శౌర్య, ధైర్యములు మీదగు నాశ్రిత పక్షపాతమున్
మీదగు న్యాయవర్తనము, మీదగు మేలిమి శీలసంపదల్
మాదగునట్లు దీవెనల మాకు నొసంగుము మాన్య ధీవరా! 8

ఉ॥ వికసిత శేముషీ విభవ? విశ్రుత జ్ఞాన పయోధి చంద్రమా
సకల ప్రజా హితోద్యమము చక్కగ జేసిన మానవాగ్రణీ!
ప్రకటిత పాండితీ గరిమ ప్రాజ్ఞులు, విజ్ఞులు ప్రస్తుతింపగా
సకల సుధీజన ప్రతతి సన్నుతులందుమ సద్గుణాంబుధీ! 9

విధేయుడు
విద్వాన్ కొర్లగుంట కృష్ణయ్య,
ఎం.ఏ., బి.ఇ.డి.,
రిటైర్డు తెలుగు లెక్చరరు,
75, సరోజినీదేవి రోడ్,
తిరుపతి.

తిరుపతి
14-3-1992